# శ్రీ శిరిడీ సాయిబాబా

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి
దివ్యప్రసంగములనుండి

## విషయసూచిక


మనవి

1. దైవం మానుషరూపేణ
2. అప్రాకృత దివ్యత్వ సందర్శనము
3. దివ్యత్వ వికాసము
4. తస్మై శ్రీగురవేనమః
5. త్యాగేనైకే అమృతత్త్వ మానసుః
6. ఆధ్యాత్మిక కేంద్రము షిరిడి
7. దక్షిణ ఆంతర్యం.. శ్రద్ధాభక్తులు
8. భక్తసంరక్షణ... విశిష్టశైలి
9. దివ్యసాధనం... దాస్‌గణు
10. భక్తాభీష్టవరప్రదాయి
11. సాయీశ్వరస్సర్వభూతానాం
12. సంపూర్ణ శరణాగతి
13. జన్మలు మారినా కర్మలు మారవు
14. దేహములు వేరు.. దివ్యత్వమొక్కటే
15. మంగళా శాసనము

ఫలశృతి

మంగళగీతం

# మనవి

**దివ్యమౌ భావాలు దీటుగా మీనోట**
**వెడలిన పులకించు ఒడలు మాకు**
**భవ్యమౌ చరితలు భక్తిని కలిగించు**
**మీనోట వినుచుండ మేల్మిమాకు**
**నవ్యమౌ మార్గాన నవనీత శైలిని**
**చెప్పగ వేదాలు చవులు మాకు**
**సవ్యమౌ జీవన సాధన సూత్రాలు**
**తెలిపెడు మీమాట తెరువు మాకు**
**చూచి తరియింప కొందరు వేచియుండ**
**కొలిచి కూర్మిని పొందుచు కొందరుండ**
**నిలిచి కొందరు మిముచేర నిష్ఠనుండ**
**ఎట్టులెప్పుడు కాతురో ఎవరికెరుక**
**సత్యసాయీశ! భవనాశ! సాధుపోష!**

భగవద్వాణి సంసార పారావారతారకం. భౌతిక, లౌకిక, దైహిక, ప్రాకృతిక భావాలకు మారకం. అనాత్మకతనుండి విడిపించి, గడిపించి, నడిపించేది. ఇది అనృతం, ఇది క్షరం, ఇది వ్యయం, ఇది చ్యుతం, ఇది క్షయం, ఇది మృతం అని నిరూపించి సత్య, అక్షర, అవ్యయ, అచ్యుత, అక్షయ, అమృత స్థితికి కొనిపోయేది ఆ అమృతవాణి.



వాసనలు, కర్మలు, జన్మలు, ప్రారబ్ధములు, సంచితములు కలసిన కాయమును నిరపాయముగా, నిర్నిరోధముగా, నిత్య సత్య శుద్ధ బుద్ధ స్థితికి, గతికి చేర్చేది ఆ దివ్యవాణి.

జన్మలలో నరజనమ శ్రేష్టం, ఉత్తమమం. కాబట్టి, ఎప్పుడూ నరుడుగానే నారాయణు డవతరించి మానవుల నుద్ధరిస్తాడు. అట్టి నారాయణుడే సత్యరూపధారి సత్యసాయి. వారే పూర్వావతారంలో షిరిడిసాయి, ద్వారకామాయి. రేపటి ప్రేమసాయి. శాంతిదాయి. ప్రశాంతిమాయి.

వారినోట వారి పూర్వచరిత్ర వినటం ఎంత భాగ్యమో ఆ మాటలను అక్షర రూపంలో అందరకు అందించటం మరింత అదృష్టం. అవతారమూర్తి కథను వారినోట వినటం పురాకృతపుణ్యవిశేషం. సంక్షిప్తంగా, సంగ్రహంగా, సరళంగా, సుభోధకంగా, హృద్యంగా, నిరుపమానంగా, నిసర్గంగా, దివ్యంగా, భవ్యంగా, అనితరసాధ్యంగా, సాగిన ఉపన్యాస వచనవాణి ప్రతి ప్రాణి పాణికి రక్షాకంకణం.

చదివి తరించటమే మన ధర్మం. అనుదినం, అనవరతం, అనిశం, అసాంతం, ఆస్వాదించి, ఆనందించి, అనుసరించి భగవదనుగ్రహాన్ని పొందటమే ఈ చరిత పరమార్ధం.

వాచామగోచరుని వర్ణించి, వివరించి, భావించి, ధ్యానించి, పాటించి జన్మ సార్ధకము గావించుకొనుటయే మన కర్తవ్యము.

# దైవం మానుషరూపేణ

**పత్రి గ్రామ సముద్భూతం ద్వారకామాయి వాసినం**
**భక్తాభీష్టప్రదం దేవం సాయినాథం నమామ్యహం.**

మహల్సాపతి మొట్టమొదట బాబాను 'సాయి' అని ప్రకటించాడు. మన్మాడు తాలూకాలో పత్రిగ్రామంలో అవతరించి, ద్వారకామాయిలో ఉంటుండి భక్తులయొక్క అభీష్టములు నెరవేర్చే నిమిత్తము తాను అవతరించాడు.

**కామితార్థంబులెల్లను కల్పతరువు**
**వలెను దయచేయు దేవుడు కలడొకండు**
**దుర్లభంబగు నరజన్మ దొరకు కతన**
**అతని గాంచుటే పరమలక్ష్యంబు యిలను**

ప్రపంచములో ఏవస్తువైననూ సంస్కరింపబడినప్పుడే అది ఉపయోగకరమౌతుంది. స్వతః విలువ కలిగిన వస్తువు సంస్కరింపబడుటచేత అది మరింత విలువైనదిగా పరిణమిస్తుంది. అది మరొక రూపాన్ని కూడను ధరిస్తుంది. కనుకనే, పవిత్ర భారత దేశమందు ప్రాచీనకాలమునుండి 'సంస్కరించాలి, సంస్కరింపబడాలి' అని చెబుతూవచ్చారు. మలినభావములను



సంస్కారముచేత పవిత్రమైన భావములుగా, ఉత్తమమైన భావములుగా తీర్చిదిద్దుకోవాలి. నిత్యం మనము భుజించే ఆహారాన్ని, ధరించే వస్త్రాలను సంస్కారమువల్లనే మనము పునః ఉపయోగించుకుంటూ వస్తున్నాము. ప్రత్తిని మనము అట్లే ధరించలేము. దానిని దారముగా చేసి తదుపరి మగ్గములో నేసి వస్త్రముగా తయారుచేసి మనము కట్టుకుంటున్నాము. వడ్లను దంచి పొట్టును తీసిన తదుపరి దానిని అగ్నితో పక్వము గావించుకొని భుజిస్తున్నామేగానీ ఎట్లాపుట్టిన వడ్లను అట్లే మనము భుజించటం లేదు. కొండలో గుండుగా ఉన్న బండరాయిని సుత్తి వేట్లతో, ఉలిదెబ్బలతో సంస్కరింపజేసి, తదుపరి మందిరములో షోడశోపచారములతో దానికి పూజలు సల్పుతున్నాము. చెట్టులోనున్న కఱ్ఱ, గొడ్డలి దెబ్బలు తిని, అంపముతో కోయించుకొని, తదుపరి ఉలులచేత తాను సంస్కరింపబడుటచేత 'ఛైర్' గా తయారైంది. కొతలుకోసి సంస్కరించటం చేత వజ్రముకూడా గొప్ప విలువైనదిగా రాణిస్తుంది. భూమిలో చిక్కిన ముతక బంగారము సంస్కరింపబడటంచేత పవిత్రమైన అపరంజిగా రూపొందుతుంది. అదేవిధముగా, ఎట్లాపుట్టిన మానవుడు అట్లానే తన జీవితము గడుపుతూ ఉంటే ప్రయోజనం లేదు. ఇది కేవలం మట్టిముద్దవలె, మాంసపుముద్దవలె కనిపించవచ్చు. కానీ దీనిని విద్య, సాధన, తపస్సు, ధ్యానములచేత సంస్కరించినప్పుడు దివ్యమైన మానవత్వంగా రూపొందుతుంది.

జీవుడు, దేవుడు రెండూ ఒక్కటే. వడ్లు, బియ్యము రెండూ ఒక్కటే. అయినప్పటికీ వడ్లకు, బియ్యమునకు ఉన్న తేడా ఏమిటి? ఈ వడ్లు పొట్టు (హస్క్) చే కప్పబడి ఉంటుంది. ఈ పొట్టుఉండినంత వరకు అవి వడ్లు. ఈ వడ్లుగా ఉండినంత వరకు ఎక్కడైనా భూమిలో పెట్టి నీరు పోయండి. తిరిగి మొక్కలు, తిరిగి వడ్లు.. ఈవిధంగా జీవితం గడుస్తుంది. ఈ పైపొట్టు తీసిన తరువాత బియ్యముగా తయారౌతుంది. ఈ బియ్యమును భూమిలో పెట్టి ఎన్నివిధముల మంచి ఎరువులువేసి పోషించినప్పటికి, 'పునర్జన్మ నవిద్యతే', దీనికి యింక జన్మ ఉండదు. పుట్టుక లేదు. వడ్లకు,

బియ్యమునకు యేవిధమైన వ్యత్యాసమున్నదో, జీవునకు దేవునకు ఇదే వ్యత్యాసము. బంగారులో వెండి, రాగి, యిత్తడి మొదలైన లోహములు చేరటంచేత అది కేవలం తెల్లబంగారమని చెప్పబడుతుంది, దీని విలువ కూడా తగ్గుతుంది. అయితే దీనిని అగ్నిలో వేసి, పుటము పెట్టి పరిశుద్ధము గావించిన తరువాత దీనిలో చేరిన వెండి, రాగి, ఇత్తడి దూరమై స్వతస్సిద్ధమైన అపరంజిగా తయారై దానికి గొప్ప విలువ వస్తుంది. అదేవిధముగా దివ్యత్వములో సత్త్వ, రజో, తమోగుణములు చేరిపోవటం చేత ఇది జీవుడుగా తయారౌతుంది. ధ్యాన, తపస్సులనే సాధనలద్వారా గుణములు శుద్ధసాత్త్వికమైన దివ్యత్వము తేలుతుంది. ఏతావాతా ప్రాకృత గుణముల సంపర్కమే జీవుడని, ఈ ప్రాకృతగుణములకు వేరైనవాడే దేవుడని మనకు స్పష్టమవుతూ వచ్చింది. ఇది ఇంకా అర్థము కావలనుకుంటే

లైఫ్ ప్లస్ డిజైర్స్ ఈజ్ఈక్వల్టు మేన్
లైఫ్ మైనస్ డిజైర్స్ ఈజ్ఈక్వల్టు గాడ్

పొట్టుతో కూడినవి వడ్లు, పొట్టులేనివి బియ్యము. అదేవిధముగా నిత్య జీవితములో నుండిన దైవత్వమును ప్రతిమానవుడు సంస్కారముచేత సందర్శించటానికి అవకాశము ఉంది. కనుక, మానవత్వానికి దివ్యత్వముతో ఒక సంబంధము ఏర్పరచాలి. నిత్యజీవితములో మనము అనేకం చూస్తుంటాము. తియ్యని మామిడి చెట్టునకు పుల్లని మామిడి కొమ్మను తెచ్చి అంటుకట్టినప్పుడు ఈ పుల్లని మామిడి కొమ్మ తియ్యని మామిడి పండ్లు యిచ్చే స్వభావము కలిగినదిగా రూపొందుతుంది. ప్రాకృత సంబంధ గుణములు కలిగిన మానవత్వాన్ని దివ్యత్వంతో, పవిత్ర దైవస్వభావముతో చేర్చినప్పుడు ఈ మానవత్వము దైవత్వముగా రూపొందుతుంది. దీనినే వేదాంత పరిభాషలో 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' అన్నారు.

ఈనాడు మనము మానవులమని భ్రమించుచున్నంత కాలము దైవత్వమును చెందలేము. కనుక, మనము దీనిని పూర్తి సంస్కరించుకోటానికి



విచారణ, సాధన రెండూ అవసరమే. అంతర్బహిశ్శుద్ధి కలుగవలెనన్న పరిశోధన, సాధన రెండూ అవసరమే. చిన్న ఉదాహరణము. మనకు దేహముపై చిన్న పుండు అయింది. ఇది సెప్టిక్ అయి అధికమైపోయింది. దీనిపైన ఆయంటుమెంటు పూయాలి. దీనినరికట్టుటకు లోపలకు పిల్సుకూడా వేసుకోవాలి. ఈ ఏంటీబయాటిక్ లోపలకు తీసుకోటం, బయట ఆయంటుమెంటు పూయటము ఈ రెండూ జరిగినప్పుడు పుండు మానుతూ వస్తుంది. అదేవిధముగా మనము బాహ్యంగా సాధనలు చెయ్యాలి. అంతర్దృష్టితో పరిశోధనలు సల్పాలి. ఈ రెండూ యీనాటి మనవునియందు చాలా వెనుకబడి ఉన్నవి. ప్రతి మానవుడు బాహ్యదృష్టిని అభివృద్ధి పరచుకొని, బాహ్యసంబంధమును అభివృద్ధి పరచుకొని అనేక విధములుగా పరిమితుడౌతున్నాడేగానీ చూచిన దానిని, విన్న దానిని, అనుభవించిన దానిని అంతర్ముఖముగా అనుభవించటం లేదు. ఇలాంటి అంతర్తత్త్వమును ప్రబోధించి, అందరకు అనుభవములోనికి తెప్పించే నిమిత్తమై అప్పుడప్పుడు భారతదేశమందు మహనీయులు అవతరిస్తూ వస్తున్నారు. ఈవిధమైన ఏకత్వానికి హాని సంభవించటం ఎప్పుడు ప్రారంభిస్తుందో అప్పుడు మహనీయులు మాత్రమే కాకుండా సాక్షాత్తు దైవమే అవతరిస్తుంటాడు.

భగవంతుడు దిగిరావటం అంటే పైనుండి క్రిందకు దిగటం కాదు. దివ్యమైన స్థాయినుండి మానవస్థాయికి రావటమే అవతరణ. మీ స్థాయికి వచ్చినంత మాత్రమున భగవత్తత్త్వాన్ని తక్కువగా అంచనా వేయటానికి వీలుకాదు. నేలపైనున్న బిడ్డను ఎత్తుకోవాలంటే తల్లి వంగుతుంది. వంగినంతమాత్రమున లొంగినట్లు కాదు కదా! అదేవిధంగా భక్తులనుద్ధరించాలని భగవంతుడు వారి స్థాయికి దిగుతుంటాడు. అంతమాత్రమున ఇతడు సామాన్య మానవునివలె సంచరిస్తున్నాడే! సామాన్య మానవునివలె పలుకరిస్తున్నాడే! దైవమంటే ఇలా ఉంటాడా! అని మీరు సందేహిస్తారు. దైవం మానవస్థాయికి అతీతంగా ఉండాలని మీరు

భావిస్తారు. మానవాకారంలో ఉన్న తత్త్వాన్నే మీరు అర్థము చేసుకోలేనప్పుడు, యింక మానవాతీతమైన తత్వాన్ని ఏరీతిగా అర్థం చేసుకోగలరు? అసాధ్యము. మీరైనా ఆ స్థాయికి పోవాలి లేక దైవమైనా మీ స్థాయికి రావాలి.

భక్తులకు సాలోక్య, సామీప్య, సాయుజ్యములను అనుగ్రహించటానికి భగవంతుడు మానవరూపము ధరిస్తాడు. 'దైవం మానుష రూపేణ' కాబట్టి మనుష్యాకారములేక మానవులను సమీపించటానికి వీలుకాదు. పురందరదాసు చెప్పినట్లుగా మానవుడు రాతినాగును చూస్తే నమస్కరిస్తాడు. అదే నాగుపాము ప్రత్యక్షమైతే రాళ్ళతో కొట్టి పారిపోతాడు. అట్లే భగవంతుడు శంఖ చక్ర గదాధారిగా వస్తే భక్తుడు పరుగెత్తి పారిపోతాడు. ఎందుకంటే అది అసహజమైనది. ఇంద్రియాతీతమైన భగవత్తత్త్వాన్ని ఇంద్రియాలతో కూడిన మానవుడు అర్థం చేసుకోటానికి వీలుకాదు. మనిషికి మనిషే సమీపంగా ఉండటానికి వీలవుతుంది. కనుకనే, భగవంతుడు మానవాకారం ధరించి మానవులతో సమీపంగా, సన్నిహితంగా మెలగుతూ, సంభాషణ సల్పుతూ మానవులలోనున్న భగవత్తత్త్వాన్ని అభివృద్ధిపరుస్తూ వస్తాడు.



# అప్రాకృత దివ్యత్వ సందర్శనము

ఆనాడు భారతదేశములో హిందువులు, మహమ్మదీయులు మతబేధాలతో, సంకుచిత భావాలతో పరస్పరం ప్రాణాలు తీసుకుంటూ వచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో సర్వమానవ ఏకత్వాన్ని, సర్వమత సమన్వాయాన్ని బోధించాలనే సంకల్పముతో దైవము ఒక ఆకారాన్ని ధరించవలసి వచ్చింది.

నైజాము రాష్ట్రములోని ఔరంగాబాద్ జిల్లాయందు పవిత్రమైన గోదావరీ తీరమందు ఒక చిన్న కుగ్రామము. దాని పేరు పత్రి. ఈ గ్రామమందు ఉత్తమ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన దంపతులు నివసించేవారు. వీరు పెద్ద శ్రీమంతులుగానీ, దరిద్రులుగానీ కారు. మధ్యతరగతి కుటుంబీకులు. వీరికి ఏవిధమైన ప్రాపంచిక వాంఛలు లేవు. కానీ ఒక్క కొరత వారిని బాధిస్తూ ఉంది. వారికి తినుటకు, ఉండుటకు, గౌరవమర్యాదలకు యేమాత్రం తక్కువ లేదు. తమకు బిడ్డలు లేరనే కొరత వారిని ఎక్కువ బాధిస్తూ వచ్చింది. భార్య పేరు దేవగిరమ్మ. భర్త పేరు గంగాభవారియా. వీరిద్దరూ కూడా గౌరీశంకరులపూజ సల్పుతూ, వచ్చిన అతిథిఅభ్యాగతులనాదరిస్తూ, వారి కాలమును కాయమును పవిత్రమైన సేవలో గడుపుతూ వచ్చారు. గంగాభవారియా వృత్తి యేమంటే గోదావరిలో

పడవలను నడిపించటం. (టాక్సీలని పెడతారు చూడండి) పడవలను సంపాదించి, కొంతమంది మనుష్యులను పెట్టుకొని ఇటువైపు వారిని అటువైపు, అటువైపు వారిని యిటువైపునకు దాటించే వృత్తిలో తన కాలమును గడుపుతూ వచ్చాడు. ఒకనాడు గొప్ప వర్షము కురిసింది. ఆరోజు ఆషాఢశుద్ధ పూర్ణిమ. సాయంకాలమయ్యేటప్పటికి గోదావరి నీటిమట్టం పెరుగుతూ వచ్చింది. అప్పుడు భర్త భార్యతో, 'నేను రాత్రి యింటికి రావటానికి వీలుకాదు. ఎందుకంటే గోదావరి పెరుగుతూ ఉన్నది. పడవలను రక్షించుకోవాలి' అని వెళ్లిపోయాడు.

ఈ మాటలను విని ఈమె తలుపులు బిగించుకొని లోపల కూర్చొని పార్వతిని ప్రార్థిస్తున్నది. చీకటి కమ్ముతూ ఉండగా వర్షము పెరుగుతూవచ్చింది. పూజ చేసుకుంటూ, పాడుకుంటూ ఉంటున్నది. ఈ కుంభవృష్టిలో ఎవరో ప్రధాన ద్వారము తట్టారు. భర్త వచ్చాడేమోనని త్వరగా వెళ్లి తలుపు తీసింది. అక్కడొక వయోవృద్ధుడు. ఎనభై సంవత్సరములుండవచ్చు. ముఖమునందు దివ్యతేజస్సు. 'అమ్మా! ఆకలి, ఆకలి' అని లోనికి ప్రవేశించాడు. ఈ దేవగిరమ్మకు మొదటినుండి అతిథిఅభ్యాగతులను ఆదరించే స్వభావమే. ఏవేళప్పుడు వచ్చినప్పటికీ తక్షణమే వండిపెట్టి వారిని తృప్తిపరచేది. ఇంకా అప్పటికి తాను భోజనము చేయలేదు. కనుక, కావలసినంత ఆహారపదార్థాలు ఉన్నాయి. 'స్వామీ! దయచేయండ' ని పీటవేసి భోజనపదార్థాలు వడ్డించింది. ఈ వృద్ధుడు బాగా భోజనం చేసాడు. 'అమ్మా! బయట వర్షము కురుస్తున్నది. నేను ఎక్కడికీ పోలేను. నేను మహావృద్ధుడను. మీ యింటియందే ఈరోజు నిద్రిస్తాను' అన్నాడు. 'మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ' అన్నారు. వచ్చినవారెవరైనాకానీ దైవంతో సమానంగా గౌరవించి, ఆదరించటం ప్రాచీన సాంప్రదాయం. కనుక, అతనికి వరండాలో పడకవేసి అతనిని శయనించమని చెప్పి తాను లోపలికి వెళ్లి తలుపు వేసుకుంది.



భర్త ఆ రాత్రి రాదని తెలుసును కనుక తాను కొంచెము ఆహారము తీసుకుంది. దీపము ఆర్పి లోపల తలుపు వేసుకుంది. పడుకొంది. ఇంచుమించు రాత్రి పది గంటలైంది. అప్పుడు తిరిగి ఈ వృద్ధుడు తలుపు కొట్టాడు. అప్పుడు యీమె తలచింది, 'వయోవృద్ధుడు, కాలకృత్యములు తీర్చుకొనేందుకేమో' నని తలుపు తెరచింది. తలుపు తెరచేటప్పటికి, 'అమ్మా! నీవు నాకు కడుపునిండా అన్నం పెట్టావు కానీ కంటినిండా నిద్ర రావటం లేదు' అన్నాడు. 'స్వామీ! దానికి నేనేమి చేయగలను?' అంది. 'నాకు ఎవరైనా కాళ్లు పట్టేవారు కావాలి' అని కోరాడు. 'పనివాడు కూడా వెళ్లిపోయాడే ఎవరూ లేరు, నేనేమి చేసేది?' అని తనలో తాను అనుకున్నది. ఇంతలో వృద్ధుడు, 'నాకు స్త్రీయే కాళ్లు పట్టటానికి కావాలి' అన్నాడు. ఆ మాట విని ఆమె యింక నిలువునా కూలిపోయింది. 'నేను వంటరిగా ఉంటున్నాను. ఈ వృద్ధుడు ఈ కోరిక కోరుతున్నాడు. నేను ఎక్కడికి పోయేది? ఏమి చేసేది?' అతిథిని బాధపెట్టటం ఆమెకు యిష్టం లేదు. అట్లని తానాసేవలో పాల్గొనటం యిష్టం లేదు. తలపై కొంగు కప్పుకుంది. దొడ్డి దోవలో బయలుదేరింది. ఆ గ్రామములో యిలాంటి సేవ చేసే స్త్రీలు ఉండరా అని అంతాపోయి, 'అమ్మా! నీకు కావలసినంత ధనము యిస్తాను. మా యింటికి ఒక వృద్ధుడు వచ్చాడు. అతనికి కాళ్లు పట్టే సేవ చేయాలి. వస్తావా, వస్తావా' అని అడిగింది. ఎవ్వరూ అంగీకరించలేదు. 'మేము ఈ వర్షములో అసలే రాము. మేము యీనాడు వ్రతము పూనినాము. వీలుకాదు' అన్నారు. తాను చేసేది లేక యింటికి వచ్చి పూజగదిలో కూర్చొని 'తల్లీ! నీవు నన్ను పరీక్ష చేస్తున్నావా? ఏనాడూ నేను పరపురుషుని అంటినదానిని కాదు. అలాంటిది నన్ను యీనాడు అతనికి పాదములు పట్టమంటావా?' అని ప్రార్థిస్తూ వచ్చింది. అతనిని కష్టపెట్టటం యిష్టము లేదు, పోనీ అతనికి సేవ చేద్దామా అంటే మనస్సు అంగీకరించటం లేదు. ఏమి చేసేది? ఇది పరిక్షా సమయమని భావించి ' ఆవృద్ధునికి నిరాశ కలుగకుండా, నా వ్రతము భంగము కాకుండా కాపాడు తల్లీ!' అని కంటిధారలు కార్చుకుంటూ

పార్వతీదేవిని ప్రార్థిస్తున్నది. ఇంతలో ఇంటి వెనుక తలుపు ఎవరో తట్టారు. ఈమె వెళ్లి తలుపు తెరిచేటప్పటికి ఒక స్త్రీ, 'అమ్మా! మీరు కోరారు, నేను వచ్చాను' అంది. అప్పుడు దేవగిరమ్మకు పట్టలేని ఆనందము కల్గి,' తల్లీ! ఈనాడు నా గౌరవము రక్షింప వచ్చావా! ఇది నీవు చేసిన సహాయమే! నీవే పంపించావ'ని ఆనందముతో ఆ స్త్రీని పిల్చుకొని వరండాలో ఉంచి తలుపు వేసుకుంది. ఆ వచ్చిన స్త్రీని తిరిగి పంపించాలికదా! తాను పండుకోటానికి వీలు లేదు. పూజగదిలో ప్రార్థన చేసుకుంటున్నాది.

ఇంతలో తలుపు తట్టారు. మళ్లీ ఏమి ప్రమాదము కలుగుతుందో యేమోనని ఈమె చాలా భయపడుతూ, వణుకుతూ తలుపు తెరచింది. తలుపు తెరిచేటప్పటికి దివ్యమైన సుందరస్వరూపాలతో పార్వతీపరమేశ్వరులు సాక్షాత్కరించారు. ఆ వచ్చినవాడు వృద్ధుడు కాదు. పరమేశ్వరుడే. ఆ వచ్చిన స్త్రీ సామైన్యస్త్రీ కాదు. సాక్షాత్తూ పార్వతీదేవియే. తక్షణమే కాళ్లపై పడింది దేవగిరమ్మ. ఈమె కాళ్లపైపడి ఏడుస్తున్న సమయంలో పార్వతి పరమేశ్వరుణ్ణి వరము ప్రసాదించమని హెచ్చరించింది. వీరి భాషలు వీరికే తెలుసుగానీ అన్యులకు తెలియదు. 'హరి చిత్తలీల హరికే తెలుసున్' ఎవ్వరు దానిని అర్థము చేసుకోలేరు. అప్పుడు ఈశ్వరుడు పార్వతికి అర్థమయ్యే రీతిగా, ప్రార్థన విని వచ్చినదానవు నీవు. పరీక్షించుటకు వచ్చినవాడను నేను. ప్రార్థన విని వచ్చినావు కనుక నీవే కోరికలన్నీ తీర్చుమ'న్నాడు. అప్పుడు పార్వతి,'అమ్మా! నీకు అన్ని సుగుణములు ఉంటున్నాయి. అన్ని సౌభాగ్యములు ఉంటున్నాయి కానీ సంతానము లేక బాధపడుతున్నావు. కన్యాదానమునకు ఒక కన్యను, వంశోద్ధరణకు ఒక పుత్రుని అనుగ్రహించాన'ని చెప్పింది. తక్షణమే ఈశ్వరునికి నమస్కారము చేసుకుంది దేవగిరమ్మ. 'దేవగిరీ! నీ భక్తి నన్ను కరిగించి, కదిలించింది. నీ మూడవ గర్భములో నేను పుడతాను' అన్నాడు. 'నేను ఆపస్తంబ సూత్రుడను, భారద్వాజ గోత్రుడను, శివుడను'. దేవగిరమ్మ మరల నమస్కారము చేసుకుంది. లేచేటప్పటికి యిద్దరూ లేరు. ఆనందము పట్టలేకపోయింది.



నిద్ర రాదు. చెప్పటానికి భర్త లేడు. ఎవరితో చెప్పుకొని ఈ ఆనందాన్ని పంచుకోగలదు? రాత్రంతా ఇల్లంతా ఆనందముతో తిరుగుతున్నాది. తెల్లవారురూము ఐదుగంటలైంది. భర్తవచ్చి తలుపు తట్టాడు. ఆయన ప్రవేశించిటప్పటికి పరుగెత్తిపోయి కాళ్లపై పడి ఆమె ఆనందముతో జరిగిన విషయాన్ని చెప్పింది. ఆయన అనుకున్నాడు,' ఈ దేవగిరమ్మ మొదటినుండి భక్తిప్రపత్తులవల్ల ఉన్మత్తురాలు. ఈమెకు ఏదో భ్రమ కలిగింది. నేను యింటిలో లేకపోవటంచేత నిద్ర రాలేదు కాబోలు. దానితో కలలు కంటున్నదేమో! ఇది అందరి ఆడవారి బలహీనతయే' అనుకొని, 'చాలా సంతోషము' అన్నాడు. దానిని సత్యముగా భావించలేదు. ఈవిధముగా కాలము గడుస్తున్నది.

రెండు నెలలయ్యేటప్పటికి ఈమెకు గర్భమని తేలింది. ఆ సంవత్సరము కుమారుడు పుట్టాడు. మరలా ఇంకొక సంవత్సరము తరువాత కుమార్తె కలిగింది. మూడవ సంవత్సరములో తిరిగి గర్భము ప్రారంభమైంది. దీనినే వైష్ణవమాయ అంటారు. దైవలీలలు అగమ్యగోచరాలు. ఈమెకు నవమాసములు నిండేటప్పటికి భర్తకు ఎక్కడలేని తీవ్రవైరాగ్యమూ బయలుదేరింది. 'ఇంటిలో క్షణమైనా నేను ఉండను. అరణ్యమునకు వెళ్లి తపస్సు చేసి ఈశ్వరుని సందర్శించాలి' అన్నాడు. 'నీవు ఈశ్వరుని సందర్శించావు. నేను సందర్శించలేదు. ఈనాడు నాకు తెలుస్తున్నాది ఆనాడు నీవు చెప్పినది సత్యమని. నీవు ఎంత అదృష్టవంతురాలవు! నీవు యిక్కడే ఉండు. నేను అరణ్యమునకు పోతాను' అన్నాడు. భార్య కాళ్లపైబడి చెప్పింది,'నాథా! సాక్షాత్తూ ఈశ్వరుడే మూడవ గర్భమున జన్మిస్తాని చెప్పాడు. మన కుమారునిగా పుట్టే ఈశ్వరుని దర్శించుకోకుండా ఎక్కడో అరణ్యమునకు ఎందుకు వెళ్లాలి? కొంతకాలము మీరు వేచి ఉంటే త్వరలో సాక్షాత్తూ ఈశ్వరునే మీరు దర్శిస్తారు. ఈ రెండూ సత్యమైనప్పుడు మూడవది మాత్రము అసత్యమౌతుందా? ఇదీ సత్యమే'. అప్పుడు గంగాభవారియా చెప్పాడు 'నాకు పుట్టే కుమారుడు మానవాకారముతో కనిపిస్తాడుగానీ

సాక్షాత్తూ ఈశ్వరుడుగా నాకు కనిపించడు. ఈ ప్రాకృత జగత్తునందు అప్రాకృతమైన దివ్యత్వము సందర్శించటమే సరైనది. కానీ ప్రాకృతమునకు ప్రాకృతము సరియైనది కాదు. నేను ప్రవృత్తి యందుండినంతవరకు నాకు నివృత్తి లభ్యము కాదు. బ్రహ్మజ్ఞానమే హృదయ నేత్రము. త్యాగమే జీవితమునకు సుఖము. నివృత్తియే జీవిత లక్ష్యము. ఈ మూడింటినే నేను అనుసరిస్తాను తప్ప ప్రాకృతికంగా ఉండుటకు వీలులేద' ని తాను బయలుదేరిపోయాడు.

పతిని వదలి ఒక్క క్షణమైనా ఉండలేని ఈ దేవగిరమ్మకు నవమాసాలు నిండాయి. ఆతను చాలా వేగంగా బయలుదేరి పోతున్నాడు. అతని వెంట ఈమెకూడా బయలుదేరింది. ఆ చిన్న బిడ్డలను ఒక పనిమనిషికి యిచ్చి, 'మా అమ్మగారింటికి చేర్చుమ'ని చెప్పి తాను పతితో బయలుదేరింది. అతను చాలా ముందుగా పోతున్నాడు. ఈమె వెనుక పోతున్నది. నడవలేకపోతున్నాది. అడవిలోకి పోయేటప్పటికి ఈమెకు పురిటి నెప్పులు బయలుదేరాయి. 'నాథా! కొన్ని క్షణాలు నిలవండి. ఇప్పుడే మీరు ఈశ్వరుని దర్శించగలరు. నాకు చాలా తీవ్రమైన బాధగా ఉంటున్నాది. నిలవండి. నిలవండి' అని చెప్పింది. కానీ అతను యేమాత్రం వినలేదు. వెను తిరగలేదు. ఆమె ఒక చెట్టు క్రిందకు పోయింది. ఒక్క అడుగు ముందుకు వేయలేక పోయింది. అలాంటి పరిస్థితిలో కూర్చుంది. క్షణములో ప్రసవమైంది. బిడ్డను చూస్తే దివ్య కాంతితో తేజరిల్లుతున్నాడు. ఇక్కడ బిడ్డ కోసం నిలవటమా? అక్కడ భర్త కోసం వెళ్లటమా? ఏమి చేయాలో తోచక తనకు పతియే దైవమని బిడ్డను ఒక ఆకులో చుట్టింది. అక్కడే పెట్టి ఆమె వెళ్ళింది. ఆమె తనలో తాను 'ఆనాడు పార్వతీపరమేశ్వరులను దర్శించాను. ఈనాడు ఈశ్వరుని పుత్రరూపంలో దర్శించాను. ఏఒక్క అనసూయకో యీవిధమైన ప్రాప్తి లభించింది' అని యోచించుకొని తన భర్త వద్దకు చేరింది. వాళ్ల కథ అట్లా ఉండనీ.



# దివ్యత్వవికాసము

ఆ బిడ్డ పుట్టిన దినము 1835 సంవత్సరము సెప్టెంబరు 28వ తేదీ. ఆనాడు రంజాన్. ఒక ఫకీరు, ఆయన భార్య సూఫీ మతస్థులు. అత్తవారింటికి వెళ్లి టాంగాలో వస్తున్నారు. ఎక్కడెక్కడ ఎవరెవరికి ఏవిధమైన కాల, కర్మ, కారణ, కర్తవ్యాలు కలసిరావాలో అది దైవనిర్ణయమే తప్ప మీరు భ్రమిస్తేగానీ, తలచుకుంటేగానీ, ప్రయత్నిస్తేగానీ జరిగేవికావు. ఆ చెట్టు దగ్గరకు వచ్చేటప్పటికి ఫకీరు భార్య, ' కొంచెం బండి నిలపండి, నేను బయటకుపోయి రావాలి' అంది. టాంగా తోలేవాడు, భర్త ఉన్నారు. వీరు తప్ప యింకెవరూ లేరు. ఆ ప్రదేశములో ఎక్కడో చిన్న పిల్లవాని ఏడ్పు వినిపించింది. ఎక్కడనుండి ఈ శబ్దం వినవస్తున్నదని చూస్తే చెట్టుక్రిందనే ఆకులోపల పురిటిబిడ్డ ఏడుస్తున్నది. తక్షణమే బిడ్డను ఎత్తుకున్నది. ఆ బిడ్డతల్లి ఎక్కడుందో యేమోనని భర్తను పిల్చింది. అటువైపు, ఇటువైపు భర్త, టంగా డ్రైవరు యిద్దరూ చాలా బిగ్గరగా పిలిచారు. ఎక్కడా ఎవరి జాడా కనిపించలేదు. అప్పుడామె, 'ఈనాడు ఈద్. నాకేకష్టము లేకుండా, నవమాసములు మోయకుండా అల్లా నాకీవిధంగా బిడ్డను ప్రసాదించాడు' అనుకొని బిడ్డను తీసుకొని టాంగా ఎక్కింది.

వారి క్యాలండరు లోపల అది తొమ్మిదవ నెల. తెల్లవారుతూనే లేచి స్నానాలు చేసి కొత్తగుడ్డలు ధరించి అల్లాకు కృతజ్ఞత చూపే దినము

రంజాన్. ఇంతేకాక మహమ్మద్‌కు కృతజ్ఞతలు అర్పించే దినము. మహమ్మద్ తన జీవితాన్నంతా త్యాగము చేసి అనేక ప్రార్థనలు చేస్తూ ఉండేవాడు. ఈ మహమ్మదీయులకు మూడు ప్రధాన విశ్వాసాలున్నాయి. 'అల్లాహో అక్బర్' భగవంతునికంటె శ్రేష్ఠమైనవాడు లేడు. 'లాయిలాహోయిల్లల్లా' ఇతనికంటె సర్వవిధముల కాపాడేవాడు లేడు. ఇతడు అన్నివిధముల పూజించుటకు అర్హుడు. ఇంక ఎవరిని పూజించుటకు వీలులేదు. "ఈమూడు ప్రమాణములు చాలా గాఢంగా విశ్వసించి, పాటించినందువల్ల, ఎల్లప్పుడు తలచుకొన్నందువల్ల మాకీ బిడ్డ దొరికింది' అని ఆ ఫకీరు, అతని భార్య ఆ టాంగాలో కూర్చొని ఆనందముతో పొంగిపోతూ ఇల్లు చేరారు.

మన ఇండ్లలో చంటిపిల్లలను చంటి, చిన్ని, బుజ్జి, కన్న యిలాంటి ముద్దుపేర్లతో పిల్చుకుంటాము కదా! అలాగే వారు ఆ పిల్లవానిని 'బాబా' అని పిలుస్తూ వచ్చారు. ఇలా ఆనందముగా ఫకీరు దంపతులు బాబాతో నాలుగు సంవత్సరములు 1838 నుండి 1842 వరకు గడిపారు.

వీరి యింటి పక్కనే ఒక షాహుకారు కుటుంబము ఉండేది. వారికి ఒక పిల్లవాడు. ఒకనాడు యిద్దరూ గోళీలు ఆడుకుంటున్నారు. ఆటలో అతనిని ఓడించి, గోళీలు గెల్చుకున్నాడు బాబా. అప్పుడు షాహుకారు పిల్లవాడు గోళీలు లేనందువల్ల యింటిలోనుండి సాలగ్రామము తీసుకువచ్చాడు. అదికూడా గెల్చుకున్నాడు బాబా. సాలగ్రామము కూడా పోయేటప్పటికి షాహుకారు పిల్లవానికి కోపము వచ్చింది. ఇద్దరూ పోట్లాట ప్రారంభించారు. ఆ పిల్లవాని తల్లి మేడమీదనుండి చూచింది. తన కుమారుని చూచి క్రిందకు దిగి వచ్చింది. 'మీరిద్దరూ కొట్లాడుకుంటున్నారెందుకు? బాబూ, బాబూ రమ్మ'ని పిలిచింది. 'నా గోళీలన్నీ గెల్చుకున్నాడు. అందులో క్రొత్తది ఒకటున్నది. అది నాకు యివ్వమంటే యివ్వటం లేదు. నోట్లో వేసుకున్నాడు' అని చెప్పాడు. అప్పుడు తల్లి అడిగింది. 'నాయనా! నేను డబ్బు యివ్వ లేదు. ఎక్కడనుంచి తెచ్చుకున్నావు?'అని. 'నా గోళీలన్నీ పోగొట్టుకోటంచేత నేను పూజరూమ్‌లో నున్న దానిని తీసుకు వచ్చాను' అని సత్యము



చెప్పాడు. అక్కడకు వెళ్లి చూచివచ్చి ఈమె చాలా బాధపడింది. 'అయ్యో! నేను నిత్యం పూజలో పెట్టుకొనే ఈ సాలగ్రామము తీసుకొని పోయావా?' అని. 'నీకు పది గోళీలు కాకపోతే నూరు గోళీలు యిస్తాను. నా సాలగ్రామము నాకివ్వు' అంది. బాబా తన చేతిలో లేదని చేతులు చూపాడు. కుమారుడు చెప్పాడు, 'అమ్మా! నోట్లో పెట్టుకున్నాడు' అని. అప్పుడు అటువైపున, యిటువైపున చెంపలమీద కొట్టింది. కొట్టి నోరు చూపమంది. నోరు తెరిచేటప్పటికి యశోదకు యేవిధముగా తన నోటిలో కృష్ణుడు అన్ని లోకాలు చూపించాడో, ఆవిధంగా ఈమెకు సినీమా రీలు తిరుగుతున్నట్లుగా బాబా నోట్లో అన్ని లోకాలూ కనిపించాయి. పరమభక్తురాలు కనుక, ఈ విషయాన్ని కృష్ణలీలలలో చదివినది కనుక, ఇదంతా తనలో తాను తలచుకొని, అటువైపు యిటువైపు చూచి, ఎవరూ లేరు కదాయని ఆ చిన్న పిల్లవాని పాదములు పట్టుకొని నమస్కారము చేసింది. అప్పటినుండి ఆమెకు బాబాపై భక్తి. ఎవరికీ చెప్పేది కాదు. తన యింటిలో యేమైనా చేస్తే బాబాను పిలచి తాను తినిపించేది, భర్తకు తెలియకుండా. ఎందుకంటే ఏమనుకుంటాడోయేమో! అప్పుడు మహమ్మదీయులకు హిందువులకు ద్వేషము.

అప్పటినుండి బాబా చేసే పని యేమిటి? మతముల యేకత్వము చాటే నిమిత్తము ఈ తీసుకున్న సాలగ్రామమును మసీదుకు పోయి పూజ చేసేవాడు. తాను మహమ్మదీయుడు. పోయేది హిందూదేవాలయమునకు. చదివేది ఖురాన్. ఈ రెండు పరస్పర విరుద్ధాలు. ప్రతి దినము హిందువులు, మహమ్మదీయులు వచ్చి ఫకీరుకు కంప్లైంట్లు చేయటం జరిగేది.

ఒకనాడు ఫకీరుకు స్వప్నము వచ్చింది. 'ఫకీర్! నీవు యింక ఎంతకాలమో ఉండవు. నీవు పెంచిన యీ పిల్లవానిని యింక ఎవరూ పెంచలేరు. ఫలానా చోట 'వెంకూసా' అని ఉంటాడు. ఈ పిల్లవానిని అతని దగ్గర వదలిపెట్టు' అని. ఫకీరు ఆ పిల్లవానిని తీసుకొని వెంకూసా దగ్గరికి వెళ్లాడు. వెంకూసా మంచి గురువు. పిల్లలకు ఆధ్యాత్మిక తత్త్వము

ప్రబోధించేవాడు. ఈ పిల్లవాడు వస్తుండగనే అతని కోసమే అంతకాలము కాచుకొని ఉన్నట్లు 'ఆవోజీ, ఆవోజీ' అని పిలచి దగ్గర కూర్చోపెట్టుకున్నాడు. భుజాలు నిమిరాడు. 'ఇంతకాలం నీకోసం కాచుకున్నాను' అని అనేకవిధములుగా ముచ్చటలాడి 'లోపల భోజనం చేసి రా'అన్నాడు. ఆ ఆశ్రమం హిందువులకు మాత్రమే సంబంధించినది. బాబా హిందువుల బిడ్డయా? మహమ్మదీయుల బిడ్డయా? అందరికీ వెంకూసా గురువు. ఈ వెంకూసా మహమ్మదీయ పిల్లలను చేర్చుకుంటే అతని ఆశ్రమముపై మహమ్మదీయులంతా వచ్చిపడతారు. హిందువులకు మరొకవైపున వారిని యెందుకు చేర్చుకున్నారని ద్వేషము యేర్పడుతుంది. ఈవిధంగా కొంచెము యోచిస్తూ ఉండేటప్పటికి వెంకూసాకు రాత్రి స్వప్నము వచ్చింది. 'వచ్చిన పిల్లవాడు సామాన్యుడు కాడు. అతనికి మతములతో యెట్టి సంబంధమూ లేదు. సర్వసమన్వయ మతమే అతని అభిమతము. కనుక, నీవు యేమాత్రమూ వెనుకంజ వేయవద్దు. ఇది నీ అదృష్టము'అని చెప్పేటప్పటికి వెంకూసాకు బాబాపై ప్రేమ అధికమౌతూ వచ్చింది. అతనిని చాలా ఆదరించి తనతోనే ఉండమని 'నాయనా! ఇదంతా నీదే' అని ఆశ్రమములో అన్ని అధికారాలు యిస్తూవచ్చాడు. ఆ పిల్లవానిని చాలా ప్రేమించేవాడు. ఏవిషయములోనైనా అతనికే ప్రథమస్థానము యిచ్చేవాడు.

దైవం కొందరిపై అనుగ్రహము అధికంగా చూపుతుంటాడు. కొందరిపై చూపీ చూపనట్టుంటాడు. కొందరిపై అసలు చూపనట్టే ఉంటాడు. అది నీ భ్రాంతియేగానీ మరొకటి కాదు. దైవమునకు అందరూ సమానులే. అద్దమునకు ఒకవైపున రసాయనము పూసి ఉండటం చేత నీ ప్రతిబింబము అందులో కనిపిస్తుంది. కాబట్టి ఎవరి హృదయమునకు ప్రేమ అనే రసాయనము పూసి ఉంటారో వారి దగ్గర మాత్రమే యిది కనిపిస్తుంది. కనిపించక పోవటం దైవముయొక్క దోషము కాదు. నీ హృదయనికి ఆ రసాయనం పూయలేదు. అందుచేత మరొక రోగము ప్రారంభమౌతుంది. ఏమిటా రోగము? అసూయ.



ఈ ప్రేమను చూచి అక్కడున్న విద్యార్థులలో గుసగుసలు ప్రారంభమయ్యాయి. 'ఇదేమి? మేము యిన్ని సంవత్సరముల నుండి ఇక్కడ ఉంటున్నాము. మా వైపున చూడటం లేదే. ఇప్పుడే వచ్చిన యీ పిల్లవానితో ఏమిటీవిధంగా మాట్లాడుతున్నాడు?' అని వీరిలో వీరికి కలతలు బయలుదేరాయి. కొంతమంది మంచిగా అభిప్రాయ పడ్డారు. మరికొంతమంది,' ఆ ఫకీరు ధనవంతుడు. అతని దగ్గర ఎక్కువ ధనము వస్తుందని ఆశిస్తున్నాడేమోన'ని అనుకున్నారు. ఈవిధముగా ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా అన్నారు. తలలు వేరైనప్పుడు తలంపులు వేరుగా వస్తుంటాయి. భావములకొద్దీ ఊహలు బయలుదేరుతాయి.

దినదినమునకు వెంకూసాకు, బాబాకు సన్నిహిత సంబంధము ఎక్కవ అవుతూ వచ్చింది. ఒకనాడు, 'వికారా' అనే అడవికి ఈ యిద్దరూ వెడుతున్నారు. వెంకూసా ఆశ్రమములోనికి హిందువులందరూ 'మహమ్మదీయ పిల్లవాడు ఆశ్రమములో ఉండకూడదు. ఈ ఆశ్రమము క్రమక్రమేణా మహమ్మదీయులతో నిండిపోతుంది. ఆ తరువాత వారే ఆక్రమించుకుంటార'నే ఉద్దేశ్యముతో కుట్రపన్ని బాబాను ఆశ్రమమునుండి తరిమకొట్టాలని ప్రయత్నించారు. ఐదారుమంది పిల్లలు ఒక ప్లాను వేసారు. 'ఇప్పుడు సరియైన సమయము. ఆ పిల్లవానిని చంపితే అప్పుడు వెంకూసా మనపై ప్రేమ చూపగలడు' అనుకున్నారు. అక్కడకు నడచిపోయారు. ఒక గుడిసె దగ్గర కూర్చున్నారు. ఒక బలమైన విద్యార్థి ఒక యిటుక తీసుకొని సూటిగా బాబా తలకు తగిలేటట్లు విసిరాడు. బాబా అంటే వెంకూసాకు ప్రేమ. తక్షణమే వచ్చి బాబా ముందు నిల్చున్నాడు. బాబాకు తగలవలసింది వెంకూసాకు తగిలింది. తక్షణమే రక్తం కారింది. అప్పుడు బాబా కట్టుకున్న బట్ట చించి తలకు కట్టాడు. 'స్వామీ! మీ కిట్లా తగిలిందే?' అని బాబా మాట్లాడుతుండగనే ఆ పిల్లలు పరుగెత్తివచ్చారు ఒక పిల్లవాని శవము తీసుకొని. ఎవరిది ఈ శవము? బాబాను కొట్టటానికి ఎవరైతే యిటుక వేశాడో వాడు చనిపోయాడు తక్షణమే. 'గురుజీ! మా పాపము క్షమించండి'

అని పాదములపై పడ్డారు. అప్పుడు వెంకూసా చెప్పాడు,'నాయనా! నేను వృద్ధుడనైనాను. నా సర్వస్వము ఈ పిల్లవాడే. నిర్మల ప్రేమ గలవాడే మనలను రక్షించగలడుగానీ యితరులు రక్షించలేరు'. ఈ మాటలు విని బాబా పాదములపై పడవేశారు పోయన పిల్లవాని. బాబా ఫక్కున నవ్వాడు. ఎందుకు నవ్వాడు? తనను చంపటానికి ప్లాను వేసినవాడు చచ్చాడనే ఆనందముతో కాదు. ఇదంతా దేహలక్షణమని నవ్వాడు. చిన్నవయస్సునందే యిట్టి పరమసత్యమును గుర్తించాడు. బాబాకు వయస్సుతో నిమిత్తము లేదు. తనకు మొదటినుండి తెలుసు. ఎందుకంటే సమస్తసృష్టి తన హస్తమునందుంచుకున్నాడు. తక్షణమే, 'ఏమికావాలని వచ్చారు? ఇది శవము. ఈ దినము యితను, రేపటి దినము మీరు. ఎవరూ శాశ్వతము కాదు' అన్నాడు. అప్పుడా పిల్లలు అడిగారు. 'మేము తల్లిదండ్రులకేమని చెప్పాలి?' అప్పుడు బాబా చెప్పాడు' జరిగింది చెప్పండి' అని. జరిగింది చెబుతే అవమానము. జరగనిది చెబుతే అసత్యము. 'మీకు కావలసింది ఏమిటి? ఈ పిల్లవానిని బ్రతికించటమే కదా!' అంటూ తక్షణమే కూర్చొని ఆ పిల్లవాని తలను తొడపై పెట్టుకున్నాడు. తల నిమురుతున్నాడు. 'సాయినాథునికి శరణుకండి. మీ అభీష్టము నెరవేరుస్తాను' అన్నాడు. అప్పుడందరూ బాబా పాదములు పట్టుకున్నారు. తక్షణమే పిల్లవాడు లేచాడు. అప్పటినుండి బాబా ప్రభావము లోకములో ప్రచారమౌతూ వచ్చింది. వెంకూసా మరణానంతరము అనగా 1854 లో ఒకనాటి రాత్రి ఆశ్రమము వదలి ప్రయాణమై షిరిడీ చేరాడు.

షిరిడీ చాలా చిన్న గ్రామము. షిరిడీలో ఖండోబా దేవాలయంలో ప్రవేశించబోయిన బాబాను మహల్సాపతి అనే పూజారి చూసి ఎవరో మహమ్మదీయ ఫకీరని భావించి లోపలకు రానివ్వలేదు. బాబా అక్కడనుండి ఊరి బయటనున్న ఒక వేపచెట్టు క్రిందకు పోయి కూర్చున్నాడు. అప్పటికి బాబా వయస్సు పదహారు సంవత్సరాలు. అతని పేరేమిటో ఊరేమిటో ఎవరికీ తెలియదు. ఒకవేళ ఎవరైనా వచ్చి 'మీ పేరేమిటి? మారే



ఊరినుండి వచ్చారు?' అని ప్రశ్నిస్తే, 'నా ఊరుతో నీకేమి పని? నా పేరు నీకెందుకు?' అని ఎదురు ప్రశ్నలు వేసేవాడు బాబా. అందుచేత బాబా పేరుగానీ, ఊరుగానీ ఎవరూ తెలుసుకోలేకపోయారు.

బాబా అక్కడే కొద్ది కాలంపాటు ఉన్నాడు. ఆ రోజులలో గ్రామ ప్రజలందరూ ఆ వేపచెట్టుక్రింద బాబా వద్దకు వచ్చి తమ బాధలను నివేదించుకొని నివారించుకొనేవారు. ఎవరైనా శారీరక బాధలతో వస్తే బాబా ఏదో ఒక ఆకు తీసుకొని నలిపి వారికిస్తూ, 'దీనిని తిను. నీ నొప్పి తగ్గిపోతుంది' అనేవాడు. ఈవిధంగా అనేకమంది రోగాలను నివారణ గావించేవాడు. ఈ విషయం చుట్టుపక్కల పల్లెలంతా ప్రాకిపోయింది. అందరూ బాబా వద్దకు రాసాగారు. ఈవిధంగా కొంతకాలం గడచిన తరువాత ఒకనాడు ఉన్నట్లుండి బాబా ఎవరికీ కనిపించకుండా ఎటో వెళ్లిపోయాడు. ఎంత వెతికినప్పటికీ బాబా కనిపించకపోవటంతో ఆ గ్రామ ప్రజలు నిరాశచెందారు.

# తస్మైశ్రీగురవేనమః

బాబా తిరిగి మూడు సంవత్సరముల తరువాత 1857వ సంవత్సరములో షిరిడీ వచ్చారు. ఎవరితో వచ్చారు? ఔరంగాబాద్ దగ్గర 'ధూఫ్' గ్రామం ఉంది. ఆ గ్రామములో 'చాంద్‌భాయిపాటిల్' అనే ఒక మధ్యతరగతి వ్యక్తి ఉండేవాడు. ఒకనాడు యేదో ఒక అత్యవసరమైన పని తటస్థించటంతో చాంద్‌భాయిపాటిల్ తన గుఱ్ఱమునెక్కి ఔరంగాబాద్ చేరుకున్నాడు. అక్కడ రెండుమూడు రోజులు తన పనులను చక్కపెట్టుకుంటున్న సమయంలో అతని గుఱ్ఱము తప్పించుకొని పోయింది. దానిని వెతకటానికి ఎంతో ధనము ఖర్చుపెట్టి సకల ప్రయత్నాలు చేశాడు. కానీ ఫలితం లేకపోయింది. చాంద్‌భాయిపాటిల్‌కి ఆ గుఱ్ఱమంటే చాలాయిష్టం. గుఱ్ఱము పోయేటప్పటికి ఆహారముకూడా తీసుకోలేదు. దేనిపైన అయనా అభిమానము కలిగితే ఈవిధంగా బాధలుకూడా వెంటాడుతూ ఉంటాయి. చివరకు నిరాశ చెంది దాని జీను మోసుకొని వస్తున్నాడు ధూప్ గ్రామానికి.

ఔరంగాబాద్ నుండి ధూప్ గ్రామానికి వచ్చేదారిలో దట్టమైన అరణ్యం ఉండేది. ఆ దట్టమైన అడవిలో ప్రవేశించాడు. ఒక మామిడి చెట్టు క్రింద కూర్చొని ఉన్న ఒక ఫకీర్‌ను చూచాడు. గుఱ్ఱమును పోగొట్టుకున్న విచారముతో నడుస్తూ వస్తున్న చాంద్‌భాయిపాటిల్‌ను ఆ ఫకీర్ చూచి 'ఏయ్! పాటిల్ ఆవోజీ' అన్నాడు. అప్పటికే అలసిపోయిన పాటిల్ ఆ చెట్టుక్రిందకు వచ్చి విశ్రమించాడు. బాబా దగ్గర చిలుమున్నది. ఈలోపల బాబా హుక్కా తయారుచేయటం ప్రారంభించాడు. హుక్కా



పీల్చాలంటే నీరు, అగ్ని రెండూ కావాలి. 'పాటిల్! నీ దగ్గర అగ్నిపెట్టె ఉందా?' అని ప్రశ్నించాడు. పాటిల్ లేదన్నాడు. అప్పుడు బాబా తన చేతిలోని కఱ్ఱను భూమిపై కొట్టాడు. వెంటనే అక్కడ అగ్ని ఆవిర్భవించింది. తిరిగి అదే కఱ్ఱను మరల కొట్టాడు. అక్కడే నీరు వచ్చింది. ఈవిధంగా సృష్టించిన అగ్నిని, నీటిని ఉపయోగించి బాబా హుక్కా వెలిగించాడు. తాను పీల్చి దానిని పాటిల్‌కు అందిస్తూ, 'పాటిల్! ఎందుకు విచారంగా ఉన్నావు? ఎక్కడకు వచ్చావు? ఎక్కడకు పోతున్నావు? జీను మాత్రమే వేసుకున్నావు. గుఱ్ఱము ఏది?' అని అడిగాడు. 'నా పేరు పాటిల్ అని మీ కెట్లా తెలుసు?' అని పాటిల్ తన ఆశ్చర్యాన్ని ప్రకటించాడు. ఇతడు మహనీయుడని గుర్తించి, 'ఈ జీను నాయొక్క తప్పిపోయిన గుఱ్ఱం జ్ఞాపకార్థంగా తీసుకుపోతున్నాను' అని చెప్పాడు. అప్పుడు బాబా, 'నాకన్నీ తెలుసు. నీ గుఱ్ఱం కోసం నీవు చాలా విచారిస్తున్నావు. తలమీద కళ్లు పెట్టుకొని వెతకటం వలన అది యింతకాలం నీకు కనిపించలేదు. నీ గుఱ్ఱము ఆ చెట్టు క్రిందనే మేస్తున్నది. పోయి చూసుకో' అన్నాడు. వెంటనే చాంద్‌భాయిపాటిల్ వెళ్లి చూడగా గుఱ్ఱము అక్కడే ఉంది.

ఇతనిని చూచి అది అరచుకుంటూ వస్తున్నది. ఇంతకు పూర్వం అదే ప్రదేశంలో ఎంతోమంది కూలీలచేత వెతికించినప్పటికి దొరకని గుఱ్ఱము అదే ప్రదేశములో కనిపించటం చేత ఆశ్చర్యం కలిగింది. ఆ గుఱ్ఱము తీసుకొని దానిపై జీను వేసుకున్నాడు. బాబా అగ్నిని, నీటిని సృష్టించటాన్ని కొద్ది నిముషముల ముందుగా చూచిన పాటిల్‌ను తన గుఱ్ఱముకూడా దొరకటంతో బాబా శక్తిసామర్థ్యాలు అర్థమైనవి. 'స్వామిజీ! మీరు నాకెంతో ఉపకారం చేశారు. కనుక మీరు నావెంబడి మా యింటికి వచ్చి నా ఆతిథ్యం స్వీకరించాలి' అని పాటిల్ ప్రార్థించాడు. బాబా అంగీకరించి అతని వెంట బయలుదేరాడు. బాబాను వెనుక కూర్చోబెట్టుకొని ధూప్ గ్రామం చేరాడు. ఆ ధూఫ్ గ్రామంలోనే బాబా మూడు సంవత్సరాలున్నాడు. ఈ విషయము ఎవరికీ తెలియదు.

చాంద్‌భాయి పాటిల్ మేనల్లుని వివాహము నిశ్చయమైంది. పెండ్లికుమార్తె షిరిడీకి చెందినది. కావున వారందరూ షరిడీ బయలుదేరవలసి వచ్చింది. బాబాను కూడా తమ వెంట రావలసినదిగా చాంద్‌భాయిపాటిల్ కోరాడు. వారందరూ బయలుదేరి షిరిడీ చేరుకున్నారు. అక్కడ బాబా బండి దిగుచుండగా మహల్సాపతి చూచాడు. వెంటనే అతడు 'ఆయీయే బాబా సాయీ' అంటూ బాబాను సాదరంగా ఆహ్వానించాడు. 'సాయి' అనే పేరు మహల్సాపతి పెట్టినదే. అంతవరకూ ఎవరూ పేరు పెట్టలేదు.

షిరిడీ చేరిన తరువాత యిక కావలసినన్ని జరుగుతూ వచ్చాయి. షిరిడీ వచ్చేంతవరకు ఎవరికీ బాబా యొక్క చరిత్ర యిట్టిది అట్టిది అని స్పష్టముగా తెలిసినట్లు లేదు. అక్కడ ఒక విష్ణుదేవాలయము ఉంటున్నాది. ఆ దేవాలయములో మహల్సాపతి పూజ చేసేవాడు. మహల్సాపతి గొప్ప భక్తుడు. ఈ పెండ్లివారితో వచ్చి దేవాలయము వద్ద కూర్చున్నాడు బాబా. మహల్సాపతి పోతూ పోతూ దేవుని ప్రసాదము కొంత యిచ్చాడు. 'నాకు ఈ ప్రసాదము వద్దు' అన్నాడు బాబా. 'ఎందుకు వద్దు నాయనా? ఎందుకు తీసుకోవు దేవుని ప్రసాదము?' అని అడిగాడు. 'నేను యిప్పుడే తిన్నాను' అన్నాడు. 'ఎక్కడకు వెళ్లావు? ఎక్కడికీ వెళ్లలేదే. ఎలా తిన్నావు?' అడిగాడు. 'ఇప్పుడు నాకు అక్కడ నైవేద్యముగా పెట్టావే, అదే తిన్నాను' అన్నాడు బాబా. 'అదేమిటి! చిన్న దేవాలయము. నేను అక్కడే ఉన్నాను. నీవు ఆవైపునే రాలేదు. ఎలా తిన్నావు?' అని అడిగాడు మహల్సాపతి. 'నీవు చూడలేదు నన్ను' అన్నాడు బాబా. ఈవిధముగా మాట్లాడేటప్పటికి మహల్సాపతి మొదట యితనెవరో చిన్న పిల్లవాడనుకొన్నాడు. మరికొంత దూరము పోయిన తరువాత, భక్తుడు మహల్సాపతి, మరల వెనుకకు వచ్చాడు కనుక్కొనేందుకు. ఈ పిల్లవాడు యీవిధముగా చెప్పటములో యేదో అంతరార్థముందని ఊహించి, ఆ పిల్లవాని యొక్క తేజస్సు చూచి దైవముగా విశ్వసించాడు. ఆ దేవాలయము ప్రక్కనే సామానులు, ఉత్సవవిగ్రహాలు పెట్టుకోటానికి చిన్న గది ఉండేది. ఆ గదిలో ఉండమని



చెప్పి నిత్యము నైవేద్యం పెట్టేదంతా బాబాకు పెట్టటం. ఈరకంగా చేస్తూ రావటం చేత క్రమక్రమేణా కొన్ని ఆధ్యాత్మిక ప్రబోధాలు అర్థముకానివన్నీ సులభంగా చెప్పటానికి ప్రారంభించాడు బాబా. అప్పుడు కొంతమంది ఈ దేవాలయానికి వచ్చిపోతూ 'ఈ అబ్బాయి యేమి చదివాడు? ఏవిధముగా పనిచేస్తున్నాడ' ని ప్రశ్నించేవారు. ఈ పిల్లవాడు, 'నేను చదువుకోలేదు. కానీ అన్ని చదువులూ నాకు తెలుసు. నేను దేహరీతిగా దేనినీ చూడలేదు. అన్నీ నాలోనే ఉన్నాయి. నేను యెట్టి గురువునూ సేవించ లేదు. నేనే అందరికీ గురువును. నాకు గురువు లేదు' అని యీవిధంగా చెబుతూ రావటం చేత మహల్సాపతి మరింత శ్రద్ధను అభివృద్ధి పరచుకొని ఆంతరికరూపాన్ని కొంతవరకు తెలుసుకోవాలని ప్రయత్నిస్తూ వచ్చాడు.

ఈవిధంగా రోజులు గడుస్తూ వస్తున్నాయి. ఆ గ్రామములో జానకీదాసు అనే ఒక పహిల్వాన్ ఉండేవాడు. ముష్టియుద్ధము చేస్తాడు. ఈ పిల్లవానితో అతడు, 'నాకు అన్నీ తెలుసునంటున్నావే. నాతో యుద్ధము చేయగలవా?' అన్నాడు. 'తప్పక చేస్తాన'న్నాడు బాబా. రెండు దినములు ఒక గుంట త్రవ్వి దానిలో యిసుకవేసి జానకీదాసు, బాబా యిద్దరూ కుస్తీ చేశారు. ప్రతి పర్యాయము జానకీదాసు క్రిందపడిపోయేవాడు పాపం. ఓడిపోవటం చేత కోపం ఎక్కువైపోయింది. గొప్ప పహిల్వాన్ కనుక, ఆ గ్రామములో ఉండే పెద్దలందరికీ ఆయనంటే గౌరవం. 'జానకీదాసు చిన్నపిల్లవానిచేత ఓడిపోతున్నాడుట' అని అపహాస్యం చేస్తూ వచ్చారు. అప్పుడు మహల్సాపతి బాబాకు చెప్పాడు. 'నాయనా! నీవు గొప్పవాడివని నాకు తెలుసు. కానీ జనులు అర్థము చేసుకోలేరు. లోకులు పలువిధములుగా ఉంటారు. నీపై ద్వేషముగా కూడా ఉంటారు. నిన్ను యేమి చేస్తారో యేమో. నాకు దేహాభిమానం ఉంది కనుక, నీపైన ప్రేమతో చెబుతున్నాను. ఏదో ఒకసారి అతనితో నీవు ఓడిపోయినట్లు నటనచేస్తే మంచిదికదా! ' అన్నాడు. అప్పుడు బాబా, 'మహల్సాపతీ! నీకోసం తప్పక ఓడిపోతాను' అన్నాడు. పందెం యేమంటే, 'జానకీదాసు ఓడిపోతే అతడు సన్యాసము

స్వీకరించాలి. నేను ఓడిపోతే ఈనాటినుండి ఈ కుస్తీ జీవితములో చేయను. ఓడిపోయినందుకు గుర్తుగా నేను ఒక కాషాయ వస్త్రాన్ని నా తలకు బిగించుకుంటాను' అన్నాడు. మహల్సాపతి ప్రార్థన ననుసరించి జానకీదాసు వచ్చి పట్టుకొన్న తక్షణమే బాబా క్రింద పడిపోయినట్టుగా నటించాడు. జానకీదాసుకు తృప్తి కలిగించాలి. విరోధము పెంచుకోకూడదు. ద్వేషాన్ని రెచ్చగొట్ట కూడదు. శాంతిని చేకూర్చాలనే ఉద్దేశ్యముతో తాను పడ్డాడు. అప్పటికప్పుడే జానకీదాసు యిచ్చిన కాషాయ వస్త్రము తలకు కట్టుకొన్నాడు బాబా. ఈ చరిత్రనే అనేక విధములుగా తెలుపుతూ వచ్చారు గ్రంథాలలో. బాబా గురువు తన ఆశ్రమములో ఉంటున్నప్పుడు ఆ గురువును కొట్టటానికి ఎవరో దొంగలు వచ్చారని, ఆ గురువు వెంట తానుకూడా అడవికిపోతే ఒక యిటుక రాయితో అతనిని కొట్టారని, దానివల్ల ఆయనకు దెబ్బ తగిలిందని, ఆనాడు వెంకూసా తలకు వస్త్రము కట్టాడని. ఇవన్నీ కేవలము కల్పితమైన కథలు. బాబాకు ఎప్పుడూ, ఎక్కడా ఏ దెబ్బా తగలలేదు. ఎవ్వరూ తలకు కట్టు కట్ట లేదు. ఒకవేళ దెబ్బ తగిలి కట్టు కడితే దెబ్బ మానిన తరువాత కట్టు తీయవచ్చుకదా! జీవితమంతా ఎందుకు కట్టుకట్టాలి? ఈవిధంగా కొన్ని కథలు కల్పించారు.

మహల్సాపతి ద్వారా క్రమక్రమేణా నానా, తాత్యా, అబ్దుల్‌బాబా, దాస్‌గణు వీరందరూ బాబా దగ్గర చేరుతూ వచ్చారు. అప్పటినుండి బాబా కీర్తి దినదిన ప్రవర్ధమానంగా పెరుగుతూ వచ్చింది.

ఒకనాడు పైల్‌గావ్‌లో కొంతమంది దొంగలు ఒక శ్రీమంతుని యింటిలో దొంగతనము చేసి పారిపోతుండగా వారిని పోలీసులు పట్టుకున్నారు. వారు భయంతో వణికిపోయి అక్కడే ఉన్న బాబాను చూపిస్తూ, 'అదిగో ఆ ఫకీరే ఈ వస్తువులను మాకిచ్చాడు' అని అబద్ధం చెప్పారు. అప్పుడా పోలీసులు బాబా వద్దకు వచ్చి, 'బాబా! ఈ వస్తువులను వారికి యిచ్చినది మీరేనా?' అని అడిగారు. 'అవును' అన్నాడు బాబా. 'అయితే మీకీ వస్తువులు ఎక్కడనుండి వచ్చాయి?' అని ప్రశ్నించారు. '



అన్నీ ఎక్కడనుండి వచ్చాయో యివికూడా అక్కడనుండే వచ్చాయి' అని బాబా జవాబిచ్చాడు. ఈవిధమైన సమాధానములు పోలీసులు అర్థము చేసుకోలేక పోయారు. పోలీసులది ప్రాకృత దృష్టి. అందుచేత బాబానుండి ఎట్టి సమాచారమూ సేకరించ వీలుకాదని గుర్తించి పోలీసులు మెజస్ట్రేటుకు ఒక రిపోర్టు వ్రాసుకున్నారు. అప్పుడు మేజిస్ట్రేటునుండి బాబాకు సాక్ష్యం చెప్పటానికి రావలసిందిగా పిలుపు వచ్చింది. కానీ ఎవరికీ బాబాను మేజస్ట్రేటు వద్దకు పంపటం ఏమాత్రం యిష్టం లేదు. వారు మేజస్ట్రేటుతోను, ఉన్నతాధికారులతోను మాట్లాడి దర్యాప్తు బృందం షిరిడీకి వచ్చి బాబాను కలుసుకొనేలా ఏర్పాట్లు చేశారు. ఒకనాడు ఆ బృందంవారు బాబా వద్దకు వచ్చారు. మొట్టమొదట 'మీ తండ్రి పేరేమిటి?' అని బాబాను ప్రశ్నించారు. 'బాబా' అని జవాబిచ్చాడు. బాబా అనగా తండ్రి అని అర్థము. ఇంక బాబాపై వారు ప్రశ్నల వర్షం కురిపించారు.

ప్రశ్న. మీదేమతము?

బాబా. దైవ మతము.

ప్రశ్న. మీ కులమేమిటి?

బాబా. దివ్యమైన కులము.

ప్రశ్న. మీరెక్కడనుండి వచ్చారు?

బాబా. ఆత్మనుండియే వచ్చాను.

ఈవిధంగా వారి ప్రశ్నలన్నింటికీ సమాధానము చెబుతూ వచ్చాడు.

అనేకమంది బాబా దైవత్వమును సందేహిస్తూ వచ్చారు. ఒక మార్గశిర శుద్ధ పంచమినాడు 'దత్తాత్రేయ జయంతి', అనేకమంది బాబా దగ్గర చేరుకున్నారు. వారిలో మంచి పండితుడు, ధనవంతుడు అయిన ఖైజాక్ అనే వ్యక్తికూడా ఉన్నాడు. అతని పూర్తిపేరు బల్వంత్ ఖైజాక్. అతను వచ్చేసరికి బాబా ఒక కట్టె తీసుకొని తన చుట్టూ చేరినవారినందరినీ

'జావో జావో సైతాన్' అంటూ కొట్టనారంభించాడు. బాబా యీవిధంగా ఎందుకు చేస్తున్నారో అర్థం కాలేదు. 'నాకు ప్రసవ వేదనగా ఉంది. మీరందరూ వెళ్లిపొండి' అని బాబా గట్టిగా అంటున్నాడు. అప్పుడు బాబా కేకలు వేయటమేకాదు, వీలుపడితే కఱ్ఱతో కొట్టేవాడు. బాబా కేకలు విని అందరూ భయంతో పరుగెత్తి పోయారు. కొంతసేపయ్యాక, 'అందరూ రండి' అని బాబా పిలిచాడు. అంతకాదు ఆ బల్వంత్ ఖైజాక్‌ను చూచి, 'బల్వంత్ ఖైజాక్! ఆవోజీ, ఆవోజీ' అని పిలుస్తూ బాబా లోపలికి వెళ్లాడు. లోపలకు బల్వంత్ ఖైజాక్ కూడా వెళ్లాడుగానీ అక్కడ బాబా కనిపించలేదు. ఆ స్థానములో మూడు తలలు కల్గిన శిశువు కనిపించింది. ఆ శిశువు దత్తాత్రేయుని మాదిరిగా కనిపించాడు. ఆ చిన్న శిశువుకు అనేక హస్తములున్నాయి. ఆ దత్తాత్రేయ స్వరూపాన్ని చూచిన బల్వంత్ ఖైజాక్ మిగిలిన వారినందరినీ పిలిచాడు. అందరూ లోపలికి వెళ్లి చూచి భక్తిపూర్వకముగా కళ్లు మూసుకున్నారు. తక్షణమే బాబా ప్రత్యక్ష మయ్యాడు. ఆనాటినుండి బాబా దత్తాత్రేయ అవతారమని, భగవంతుడని చాలామంది విశ్వసించారు.

గురువును ఆధారముగా చేసుకొని అతని సుబోధలచేత మనము ఉన్నత స్థాయికి చేరుతామనే విశ్వాసము మన భారతీయులది. శాస్త్రసమ్మతమైన గురువులు ఎనిమిదిమంది. బోధగురువు, వేదగురువు, నిపాతగురువు, కామ్యగురువు, వాచకగురువు, సూచకగురువు, కారణగురువు, విహితగురువు అని. బోధగురువు కేవలము శాస్త్రార్థము మాత్రమే బోధించి దానియొక్క నిబంధనలు తగినరీతిగా ఆచరించటానికి ఉత్సాహప్రోత్సాహముల నందించేవాడు. వేదగురువు తత్వార్థమును బోధించి, తత్త్వదర్శనమును గావించి మనస్సును దైవమువైపుకు మార్చేవాడు. నిపాతగురువు అనేకవిధములైన సందేహములను రూపుమాపి మనస్సును పరిశుద్ధము గావించి చిత్తశుద్ధిచే ఆత్మతత్త్వాన్ని గుర్తింపచేసేవాడు. కామ్యగురువు కొన్ని కామ్యకర్మలను బోధించి యిహపరములందు మోదమునందించేవాడు. పుణ్య



కార్యములను ఆచరింపచేసేవాడు. తద్వారా యిహపరములందు సుఖమునందించేవాడు. వాచకగురువు యోగతత్త్వమును బోధించి దివ్యత్వమైన ఆత్మతత్త్వమును అనుభవింపచేసేవాడు. సూచకగురువు శమదమాది సంపత్తిని బోధించి మానవునియొక్క యింద్రియములను నిగ్రహింపచేసేవాడు. కారణగురువు జీవబ్రహ్మైక్యానుసంధానము కలిగింప చేసేవాడు. జీవతత్త్వాన్ని దైవతత్త్వముగా మార్చగలిగేవాడు. విహితగురువు ఈ రెండింటి సంబంధము బింబప్రతిబింబములయొక్క సంబంధమని బోధించేవాడు. జీవునకు దేవునకు భేదము లేదని నిరూపించేవాడు. ఆచరణ రూపమైన ప్రబోధములు సల్పేవాడు. ప్రత్యక్ష ప్రమాణములు నిరూపించేవాడు. ఈ గురువు ఒక్క దైవము మాత్రమే.

బాబా ఒకనాడు కేల్కరును పిలచి, 'ఈనాడు గురుపూర్ణిమ. గురుపూజ చేయ'మన్నాడు . సాఠే మేనమామతో గురుపూజ మొట్టమొదట ప్రారంభింప చేశాడు. కేల్కరు గురుపూజ అంటే యేమిటని ప్రశ్నించాడు. బాబా చెప్పాడు' గురువంటే ఎవరనుకున్నావు? కేవలం మఠాధిపతులు సన్యాసులు కాదు గురువులు. భగవంతుడే గురువు. బ్రహ్మానందం పరమసుఖదం. లోకములో నున్న అన్ని ఆనందములలో ఉన్నతస్థాయిలోనున్నది బ్రహ్మానందం. అది ఒక్క బ్రహ్మకు తప్ప వేరొకరికి ఉండదు. లోకములో వస్తుసంబంధమైన ధన, కనక, వస్తువాహనాది సుఖములు తాత్కాలిక సుఖములే. పరమసుఖదం అనగా పరమాత్ముడే. 'కేవలం జ్ఞానమూర్తిం' ఏది జ్ఞానం? వస్తుజ్ఞానమా? కాదు, కాదు. అద్వైతజ్ఞానం. రెండుకాని వస్తువే ఈ జగత్తంతా వ్యాపించి ఉన్నదనే విషయమే జ్ఞానము. అట్టి జ్ఞానస్వరూపుడు భగవంతుడు. 'అహం బ్రహ్మాస్మి' , 'ప్రజ్ఞానం బ్రహ్మ' , 'అయమాత్మ బ్రహ్మ', 'త్వమేవాహం. ఈ నాలుగు వాక్యములకు అతీతమైన తత్త్వమే ఈ బ్రహ్మజ్ఞానం. గురువు కేవలం భగవంతుడే. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులే నిజమైన గురువులు. సృష్టిస్థితిలయ కారకుడైనవాడే గురువు'. 'నేను విష్ణు పూజ చేయాలా? లేక బ్రహ్మ పూజ చేయాలా? లేక రుద్ర పూజ చేయాలా? సెలవివ్వమ'ని

కోరాదు కేల్కరు. ఈవిధంగా అడిగేటప్పటికి, 'అరే సైతాన్! నేను ఇక్కడున్నానుకదా! నాకే పూజ చేయి' అన్నాడు బాబా. అనగా తానే బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపుడనని, ఇలాంటి 'నేను' గా నున్న తత్త్వాన్ని పూజించమ'ని అన్నాడు. దీనితో షిరిడీలో చేరిన వ్యక్తులందరూ సాక్షాత్ పరమేశ్వరుడు షిరిడీసాయిబాబా అని విశ్వసిస్తూ వచ్చారు.

బాబా వద్ద ఉపదేశం పొందాలని ఆరాటపడుతూ రాధాబాయి అనే భక్తురాలు వచ్చింది. అది వ్యాసపూర్ణిమా కాలం. మంత్రోపదేశం చేసేదాకా ఆహారం తీసుకోనని పట్టుపట్టింది. మూడు దినాలు నిరాహారదీక్ష సాగించింది. కానీ బాబా అంగీకరించలేదు. అప్పుడు శ్యామ్ రాధాబాయి పక్షాన ప్రార్థించాడు. ఉపవాసంతో ఆమె ప్రాణం కూడా పోయేటట్లున్నదని చెప్పాడు. ఆమె చనిపోతే దయాహృదయుడైన బాబా ప్రతిష్ఠకు దెబ్బతగులుతుందని చెప్పాడు. నీరసపడిపోయిన రాధాబాయిని బాబా దగ్గరకు తీసుకు వెళ్లాడు. ఎవరైనా గురువు దగ్గరకు పోయి ఉపదేశం పుచ్చుకోమన్నాడు. 'బాబా! నేను యింకేగురువును ఎరుగను' అందామె.

గురుర్బ్రహ్మ గురుర్విష్ణు గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్పరబ్రహ్మ తస్మై శ్రీగురవేనమః ॥

అనే శ్లోకానికి అర్థమేమిటని అడిగాడు బాబా. అయితే గురునామం ఎందుకు స్వీకరించరాదు? గురుముఖాన యింకొక నామం కోరటం ఎందుకు? గురువే దైవమైతే ఆయన చెప్పిన మాట తప్పకుండా, చూపించిన బాటలో నడిస్తే నామజపం చేసినంత ఫలితం సంపాదించవచ్చు. గురువును సంపాదించుకున్న తరువాత సర్వమూ ఆయనకే వదలాలి. మోక్షప్రాప్తికోసం కూడా ఆయనపైనే ఆధారపడాలి. మీకంటే మిమ్మల్ని గురించి గురువుకే ఎక్కువ తెలుసు. మీకు యేది అత్యంత శ్రేయోదాయకమో ఆ మార్గం వెంట మిమ్మల్ని నడిపించ గలడు. ఆయనకు దూరంగా తీసుకుపోయే వైఖరులు నిర్మూలించి ఆయనను అనుసరించుటయే మీ కర్తవ్యము.



ఈవిధంగా గురువును అనుసరిస్తే మీకు భోజనం ఎట్లా వస్తుందని మీరనుకోవచ్చు. భగవంతుడు మిమ్మల్ని తిండి లేకుండా చేయడని గట్టిగా మీరు విశ్వసించండి. ప్రభువు మీకు అన్నమే కాక అమృతం కూడా అందించగలడు.

# త్యాగేనైకే అమృతత్వ మానసుః

మానవ జీవితమేకాక సమస్త ప్రణులూ అరిషడ్వర్గములచేత కప్పబడినవి. ఈ అరిషడ్వర్గములలో మొట్టమొదటివి కామ, క్రోధములు. కామక్రోధములని రెండున్నప్పటికిని మొదటి పదముయొక్క పరిణామమే రెండవ పదము. లోభ, మోహ, మద, మాత్సర్యములు కూడా మొదటి పదముయొక్క పరిణామములే. అరిషడ్వర్గములు కామ పరిణామములే. కామము యొక్క పరివర్తనే వీటియొక్క స్వరూప స్వభావములకు మూలకారణం. కామము వలన అపేక్ష పెరుగుచున్నది. ఈ అపేక్ష విషయసంబంధమైన అపేక్షగామారి, అది విఫలమైన క్రోధముగా మారుచున్నది. ఈ క్రోధమే సమ్మోహనంగా తిరుగుచున్నది. ఈ సమ్మోహనమే పెరిగి పెరిగి కట్టకడపటికి స్మృతిభ్రష్టని గావించుచున్నది. ఈ స్మృతిభ్రష్టనకు కష్టము వలన బుద్ధి క్షీణించుచున్నది. ఈ బుద్ధి నాశనము వలన సర్వమూ నాశనమగుచున్నది. సర్వదుఃఖములకు, సర్వనాశనమునకు, అపకీర్తికి ఈ కామమే కారణము. సర్వవాంఛలను తగినంత అదుపులో నుంచుకొని తగిన రీతిగా మీరు జీవించటానికి ప్రయత్నించాలి.

ఒక్కొక్కసారి బాబా 'అల్లామాలిక్ ! అల్లామాలిక్ !' అని కేకలు వేసేవాడు. కానీ మరుక్షణంలో, 'కృష్ణమాలిక్ ! కృష్ణమాలిక్ !' అని అరిచేవాడు. అందుచేత బాబా హిందూమతస్థుడా లేక ఇస్లాం మతస్థుడా అనే సందేహం బయలుదేరింది. బాబా అల్లామలిక్ అని అరచినప్పుడు అనేకమంది ముస్లిములు వచ్చి బాబా చుట్టూ చేరేవారు. అదేవిధముగా హిందువులు కూడావచ్చి బాబాను ధూపదీపనైవేద్యములతో అర్చించేవారు.



కనుక, హిందువులు చేస్తున్న పని ముస్లిములకు, ముస్లిములు చేస్తున్న పని హిందువులకు నచ్చలేదు.

మహల్సాపతి ఖండోబా దేవాలయములో పూజారి. అయితే యితనెప్పుడూ బాబా వెంటే ఉండేవాడు. ఇది మహమ్మదీయులకు నచ్చలేదు. ఒక హిందూ పూజారి వచ్చి బాబా దగ్గర కూర్చున్నాడనే ద్వేషంతో ఒకనాడు మహమ్మదీయులు మహల్సాపతిని పట్టుకొని కొట్టారు. ఆ మహల్సాపతి తనను కొట్టిన ప్రతి దెబ్బకు, 'బాబా! బాబా!' అని అరుస్తూ వచ్చాడు. ఈవిధంగా అతను అరుస్తున్నప్పుడు ఆ దెబ్బలన్నీ బాబాకే తగిలాయి. బాబా బయటకు వచ్చారు. మహమ్మదీయులకు కూడా బాబాపై అమితమైన విశ్వాసముండేది. బాబా బయటకు వచ్చి ఒక్కసారిగా గర్జించాడు. 'సైతాన్ ! ఒకవైపున ప్రార్థించటం, మరొకవైపున దెబ్బలు కొట్టటం. ఇదేనా భక్తి?' అన్నాడు. బాబా శరీరమునుండి రక్తము కారుతున్నది. ఆ దృశ్యము చూచిన మహమ్మదీయులు బాబా వద్దకు పరుగెత్తుకొని వచ్చి, 'బాబా! మిమ్మల్ని ఎవరు కొట్టారు?' అని అడిగారు. 'ఇంతసేపూ మీరేకదా నన్ను కొట్టింది' అన్నాడు బాబా. 'బాబా! మేము మీ దగ్గరకు కూడా రాలేదే. మహల్సాపతిని మాత్రమే కొట్టాము' అన్నారు మహమ్మదీయిలు. 'మహల్సాపతితో ఎవరన్నారు? నేనే. అతని బాధలన్నీ నావే' అని బాబా పలుకగా మహమ్మదీయులందరూ బాబా కాళ్ళు పట్టుకొని క్షమించమని ప్రార్థించారు. అప్పుడు బాబా మహమ్మదీయులను, హిందువులను చేర్చి, 'నాయనలారా! మీరందరూ ఒక తల్లి బిడ్డలే. ఇటువంటి కులమత భేదములను పెట్టుకోకూడదు. మతములో వెతికేవానికి మాధవుడు కనిపించడు. కులమతములన్నీ దేహమునకు సంబంధించినవే. మీ హృదయములో భగవంతుని వెతకాలి' అని బోధించాడు.

ఒకానొక సమయంలో షిరిడీబాబా ద్వారకామాయియందు కూర్చున్నప్పుడు దామా, నానా అనే యిరువురు భక్తులు పాదసేవ చేస్తున్న

సమయంలో బాబా కొన్ని రాగినాణెములను ఆ చేతినుండి ఈ చేతికి, ఈ చేతినుండి ఆ చేతికి మార్చుకుంటూ పరీక్షగా చూస్తున్నాడు. ఏదో కనిపించీ, కనిపించకుండా ఉన్నదానికోసం వెతుకుతున్నట్లుగా ఆ నాణెములను త్రిప్పి చూస్తున్నాడేగానీ ఆ యిరువురితో ఎట్టి సంభాషణా జరపటం లేదు. ఒక గంట సేపు బాబా ఈ పని చేస్తూ వచ్చాడు. ఈవిధంగా జరుగుతూ ఉంటే దామా, 'బాబా! మీకోసం ఎంతోమంది కాచుకొని ఉంటే మీరుమాత్రం రాగినాణెములతో ఆడుకుంటున్నారేమిటి? చూచిన నాణెములనే తిరిగి చూస్తున్నారు. పరీక్షించిన నాణెములనే తిరిగి పరీక్షిస్తున్నారు. ఎందుకోసం వీటినంత పరీక్షగా చూస్తున్నారు?' అని ప్రశ్నించాడు.

అప్పుడు బాబా, 'అరె బేటా! నేను చేసిందే చేస్తున్నాను. చూచిందే చూస్తున్నాను. చెప్పినదే చెప్తున్నాను. ఆ ఎదురుగానున్న మామిడి చెట్టును చూడు. చెట్టంతా పూసింది పూత. ఆకులే కనిపించటం లేదు. నిజంగా ఆ పూతంతా కాయలైతే ఆ చెట్టు ఉండగలదా? అట్లైతే దాని కొమ్మలన్నీ వంగి విరిగిపోగలవు. కానీ అట్లు కావటం లేదు. ఏమవుతున్నది? ఆ పూతలో కొంత గాలికి, మంచుకు మరికొంత, పక్షులు వ్రాలటం చేత మరికృంత రాలి పోతుంది. ఇంక మిగిలినవి కాయలుగా తయారయ్యే సరికి పక్షులు, ఉడుతలు, కోతులు మొదలైనవి వాటిని కొరికివేస్తున్నాయి. ఈవిధంగా సుమారు తొంభైశాతము వృథా అయిన తరువాత ఏ పదిశాతమో చెట్టుకు కాయలు కాస్తున్నాయి. అదేవిధంగా నా దగ్గరకు ఇన్ని వేలమంది వస్తున్నారు. కానీ, వీరందరూ ఫలములుగా తయారౌతున్నారా? ఎంతమంది మధ్యలో రాలిపోతున్నారో. కొంతమంది ధనం కోసం, కొంతమంది విద్యకోసం, కొంతమంది వివాహములకోసం, మరి కొంతమంది ఉద్యోగాలకోసం. ఈవిధంగా అనేకరకములైన కోరికలతో వస్తున్నారు. వీరందరిలో దోషాలే ఉన్నాయి. వీరిలో నన్ను కోరేవారెవరూ లేరు. ఒక్కొక్కరు ఒక్కొక్క లౌకికమైన కోరికలతో వస్తున్నారుగానీ, ఆత్మజ్ఞానము కోరివచ్చేవారు ఒక్కరైనా నాకు కనిపించటం లేదు. ఎంతో విలువైన నా ఖజానాకు నేను తాళం వేయకుండా



పెట్టాను. కానీ దీనిని తీసుకునే వారెవ్వరు యింకా రాలేదు. నేను చూస్తున్న నాణెములలో చాలా అరిగిపోయినవి ఉన్నాయి. వీటిలో గుంటపడినవి, సొట్టపోయినవి, రంధ్రము పడినవి కూడా ఉన్నాయి. ఈ నాణెములలో యేవిధముగా దోషములున్నవో అదేవిధముగా వ్యక్తులందు కూడా దోషాలున్నాయి. ఆ వ్యక్తుల దోషాలనే నేను చూస్తున్నాను. ఈ నాణెములలో ఎన్నో గుంటలు, రంధ్రములు ఉన్నట్లుగా వ్యక్తులలో ఎన్నో దుర్గుణాలు ఉన్నాయి. ఇట్టి వారందరూ నా ఫలములు భుజించగలరా? నేను కావాలని కోరుతున్నారేగానీ తమ మనస్సంతా ప్రకృతిపైననే పెడుతున్నారు. నాకోసం తగిన ప్రయత్నం చేయటం లేదు. ఇంక నేనెట్లు లభ్యమౌతాను? ఇక్కడకు వచ్చే ప్రజలలో కోటికి ఏ ఒక్కరో నేను కావాలని ఆశిస్తున్నారు. ఇక్కడకు వచ్చేవారంతా భక్తులు కాదు. అందరిలోనూ అన్ని దోషాలు ఉంటున్నాయి. వారి బుద్ధులన్నీ బెండుబారిపోతున్నాయి. అంతేకాదు. పరమభక్తులమని భావించేవారుకూడా తమ అభీష్టములు నెరవేరకపోతే నన్ను విసర్జించి వెళ్లిపోతున్నారు. ఇంకా కొంతమంది కాళ్ళనుండి తలవరకు అనుమానాలతో దైవత్వమును తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఏవో కొన్ని కారణములచేత నన్ను దూరం చేసుకొని వెళ్లిపోతున్నారు. వీరందరూ పాపులేగానీ పుణ్యులు కారు, భక్తులు కారు. ఇట్టి వారందరూ నన్ను చేరగలరా!' అన్నాడు.

అదే సమయానికి అక్కడకు ఒక ఠాకూరు వచ్చాడు. అతడు వస్తూనే బాబాను ఉద్దేశించి, 'బాబా! నాకు కావలసినంత ధనము, సిరిసంపదలు ఉన్నాయి. కుమారులుకూడా ఉన్నారు. నాకు యేవిధమైన అసంతృప్తీ లేదు. కానీ బ్రహ్మజ్ఞానం కావాలనే కోరికతో యిక్కడకు వచ్చాను' అన్నాడు. 'ఆ! మంచిదే. అయితే నీవు యిక్కడ ఎంతవరకు ఉంటావు?' అని బాబా ప్రశ్నించాడు. అప్పుడు ఠాకూరు, 'నా తిరుగు ప్రయాణమునకు అయ్యే ఖర్చుకూడా బండివానికిచ్చి బండి పట్టుకొని వచ్చాను. మీరు యిప్పుడు బ్రహ్మజ్ఞానము నిస్తే తక్షణమే వెళ్లిపోవాలనుకుంటున్నాను' అన్నాడు. బాబా అతనిని కొంతసేపు

ఉండమన్నాడు. ఇంతలో దామాని పిలచి, 'దామా! నాకు ఐదు రూపాయలు కావాలి. వెంటనే ఊరిలోకి పోయి పటేలును అడిగి తీసుకురా!' అన్నాడు. కొద్దిసేపటికి దామా తిరిగి వచ్చి, 'పటేలు యింటి దగ్గర లేడు' అన్నాడు. 'సరే! అయితే షాపుయజమానిని అడిగి తీసుకొనిరా' అని తిరిగి పంపించాడు. కొంంసేపటికి దామా వట్టి చేతులతో తిరిగి వచ్చాడు. బాబా అతనిని కిళ్ళీకొట్టువాని దగ్గరకు పోయి అడగమన్నాడు. ఈవిధంగా ఐదురూపాయలకోసం దామాను ఐదు పర్యాయములు పంపించాడు. అక్కడే నిలబడిన ఠాకూరు తనకు ఆత్మజ్ఞానం బోధించమని పలుమార్లు అడుగుతున్నాడేగానీ తన జేబునుండి ఒక ఐదురూపాయలనోటు కూడా తీసి యివ్వటానికి అతనికి మనసొప్పలేదు. చిట్టచివరకు బాబా ఈ ఠాకూరును చూసి., 'అరేఠాకూర్! నీ ఎదురుగానే నేను ఐదురూపాయలకోసం దామాను ఐదుసార్లు పంపించాను. నీ జేబులోనున్న ఐదురూపాయలనోట్లు బాగా కనిపిస్తున్నాయి. ఒక్కటైనా తీసి యివ్వలేకపోయావు. ఓరిపిచ్చివాడా! ధనంపైన యింత ఆశ ఉన్నవానికి దైవం పైన యిష్టం కలుగుతుందా? ధనంపైన ఆశ ఉంటే ధనం వెంబడే వెళ్లు. వెంటనే టాంగా ఎక్కి వెళ్ళిపో' అన్నాడు. కానీ ఠాకూరు అక్కడనుండి కదలలేదు. వెంటనే బాబా కఱ్ఱ తీసుకున్నాడు. 'జావో సైతాన్! ఇటువంటివాడవు ఇక్కడకెందుకు రావాలి? ఆశించేది బ్రహ్మజ్ఞానం. కానీ నీ మనస్సునిండా ధనధ్యానం. తక్షణమే యిక్కడనుండి నీవు వెళ్ళిపో. త్యాగేనైకే అమృతత్త్వమానసుః. త్యాగము చేయనివానికి ఆత్మజ్ఞానము ఎన్నోవేల మైళ్ల దూరంలో ఉంటుంది. ఈనాడు నీవు కేవలం ఐదురూపాయలు యివ్వటానికి బాధపడుతున్నావు. కానీ, ఇవన్నీ ఏదో ఒకప్పుడు నీవు వదలిపెట్టి పోవలసిందే. ఆనాడు ఏమి చేయగలవు? ఈ సత్యాన్ని గుర్తించుకో. ఇదే నిజమైన ఆత్మజ్ఞానము' అన్నాడు. ఈవిధమైన ప్రబోధములచేత భక్తుల మనస్సులలో మార్పులు కలుగుతూ వచ్చాయి.

అయస్కాంతము శుద్ధంగా ఉన్న యినుప రజనును ఆకర్షింస్తుంది. తుప్పు పట్టిన యినుమును ఆకర్షించదు. అప్పుడు ఇనుము ఏమని



చెబుతుంది? ఈ అయస్కాంతమునకు శక్తి లేదని. ఆ మాటవిని అయస్కాంతము ఫక్కున నవ్విందట. 'నీలో కావలసినంత రస్ట్, డస్ట్ చేర్చుకున్నావు. నిన్ను ఎట్లా దగ్గర చేర్చుకొనేది? రస్ట్, డస్ట్ క్లీన్ చేసుకో. ఆకర్షిస్తాను'. మానవుని దేహము యినుపముక్క. దాన్ని శుభ్రం చేసుకోవాలి. కేవలం సబ్బుతో స్నానం చేసినంత మాత్రమున చాలదు. లోపల, వెలుపల సర్వత్రా మనం శుభ్రంగా ఉండాలి. ఆవిధంగా ఉంటే దైవత్వమనే అయస్కాంతము ఠక్కున ఆకర్షిస్తుంది. ఆకర్షించటమే కాదు. ఇనుమును అయస్కాంతముగా మారుస్తుంది. అదే 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి'.

# ఆధ్యాత్మిక కేంద్రము షిరిడి

బాబా షిరిడి వెళ్ళినప్పుడు యేమీ లేదు. పాడుబడిన మసీదు మాత్రమే ఉండేది. అక్కడ చిన్న వేపచెట్టు పెరుగుతూ వచ్చింది. దానికి ఒకవైపు మాత్రమే నీడ ఉండేది. కొమ్మ అలా పెరిగింది. ఈ వేప చెట్టు నీడలో సేద తీర్చుకొనేవాడు బాబా. ఎంతో శ్రమపడి భిక్షకు వెళ్ళివచ్చి అదే నీడలో కూర్చొనేవాడు. తరువాత లక్ష్మీబాయి అల్లుడు చిన్న మండపం కట్టాడు. 'ఇన్ని సంవత్సరములు నాకు చల్లని నీడనందించి ఎంతో ఉపకారం చేసిన ఓ వృక్షమా! నాకు హాయిని, ఆనందమును అందించిన ఆ కొమ్మ ఎప్పుడూ మధురముగానే ఉండుగాక!' అన్నాడు. అందువల్లనే ఆ ఒక్క కొమ్మ ఆకులు తీయగా ఉంటాయిగానీ మిగతా కొమ్మల ఆకులు తీయగా ఉండవు. అనగా ఉపకారము చేసేవారికి ఫలితం ఎప్పుడూ ఉపకారముగానే ఉంటుంది. మనము చేసిన ఉపకారము ఎప్పటికీ వృధా కాదు. తక్షణమే ఫలితం రాలేదని విచారమునకు గురికాకూడదు. కొంతకాలమైతే తప్పక ఫలితము వస్తుంది.

షిరిడీలో మహల్సాపతి ప్రతిదినము బాబాతో అదే రూములో నిద్రించేవాడు. ఒక చావడి ఉండేది. ఆ చావడిలో ఒక చిన్న పలక కట్టుకొని ఆ పలకపై పవళించేవాడు బాబా. ఆ పలక వెడల్పు ఐదు యించిలు మాత్రమే. ఆజానుబాహుడైన, మంచి ఎత్తైన మనిషి బాబా.



దానిపై పవళించేవాడు. వేరే స్థలము లేదు. దానిక్రింద మహల్సాపతి పడుకునేవాడు. ప్రథమంలో మహల్సాపతికి భయం. ఆ పలకను బాబా పాతపంచలతో వ్రేలాడ కట్టేవాడు. ఎప్పుడు తెగుతాయో ఏమిటో! మహల్సాపతి సన్నంగా ఉండేవాడు. క్రింద పడుకుంటే, 'అంత పెద్ద మనిషి నాపై పడితే నేను బ్రతక గలనా?' అని భయపడిపోయేవాడు. రాత్రంతా నిద్రపోయేవాడు కాదు. ఎక్కడ కొంచెము శబ్దమైనా పరుగెత్తిపోయేవాడు. తన దైవత్వమును మహల్సాపతికి మాత్రమే నిరూపిస్తూ వచ్చాడు బాబా. ఒకనాటి రాత్రి బాబా 'చోటాభాయ్! లే' అన్నాడు. మహల్సాపతిని 'చోటాభయ్' అని పిల్చేవాడు. మహల్సాపతి లేచి చూడగా పాతపంచలు కూడా లేవు. వట్టి పలక మాత్రమే నిల్చింది గాలిలో. ఆ పలకపైన ఊయల మాదిరి ఊగుతున్నాడు బాబా! 'నా బరువును ఈ పాతపంచలా మోసేది? కాదు. కాదు. నా శక్తియే!' అన్నాడు. అప్పుడు మరల చెప్పాడు, 'మహల్సాపతీ! ఎవరికీ నీవు చెప్పవద్దు. కొందరు నేను బ్రాహ్మణుడనని, మహమ్మదీయుడనని మరికొందరు, పటేలునని కొంతమంది ఈవిధముగా భావిస్తున్నారు. పత్రి గ్రామములో దేవగిరమ్మ, గంగాభవారియా అనే బ్రాహ్మణ దంపతులకు పుట్టినవాడను నేను. ఈ మర్మము ఎవరికీ చెప్పవద్దు'. ఎందుకనగా ఆనాడు మహారాష్ట్రలో హిందువులకు మహమ్మదీయులకు ద్వేషము ఏర్పడి ఒకరినొకరు చంపుకోటం జరిగేది. 'ఇది మంచిదికాదు. మహమ్మదీయులలో మహమ్మదీయుడను. హిందువులలో హిందువుడను. నన్ను హిందువని చెప్పవద్దు. మహమ్మదీయుడని చెప్పవద్దు' అని మహల్సాపతితో మాట తీసుకున్నాడు. ఈవిధమైన కొన్ని రహస్యాలు ఎవరో ఒకరిద్దరికి మాత్రమే చెబుతూ వచ్చాడు. ఏ అవతారమందు అందరికీ తెలిసేది కాదు. రామావతారమందు లక్ష్మణునికి తప్ప మరెవరికీ చెప్పలేదు తన తత్త్వము. కృష్ణావతారమందు బలరాముడు ఎప్పుడూ ఉండేవాడే. కానీ కృష్ణునకు పరమమిత్రుడు ఉద్ధవుడు. నీడవలె ఉండేవాడు. తానెప్పుడు దేహాన్ని వదిలేదీ ఉద్ధవునికే చెప్పాడు. అందరికీ చెప్పటానికి వీలుకాదు. దైవతత్త్వము

అందరికీ అర్థము కాదు.

బొంబాయి రాష్ట్రములో డిప్యూటీ కలక్టరు, సెటిల్‌మెంటు ఆఫీసరు సాఠే ఉండేవాడు. పూర్తిపేరు హరివినాయక్ సాఠే. ఇతను భార్యావియోగముచేత బాధపడుతూ ఉండేవాడు. ఈవిధముగా బాధపడుతుండగా ప్రొఫెసర్ నార్కే అనే స్నేహితుడు వచ్చాడు. వచ్చి, ధైర్యము చెప్పి, 'బ్రదర్! నీవు విచారించి ప్రయోజనము లేదు. కొంతకాలం ఈ స్థలం వదలి ఎక్కడైనా మహనీయులను సందర్శిస్తే మంచిది' అని చెప్పి షిరిడి తీసుకువచ్చాడు. షిరిడీ వెళ్లి బాబాను సందర్శించాడు. కొన్ని సందర్భాల్లో యితనివైపు చూస్తూ నవ్వుతూ, చేతులు తిప్పుతూ అనేక చేష్టలు చేసాడు బాబా. ఇతడు నిజంగా నహనీయుడా లేక పిచ్చివాడా అనే సంశయ భావము అతనిలో యేర్పడింది. వేరెవరూ కానీ, తన మిత్రుడుగానీ చెప్పలేదు. దర్శనం చేసుకొని నిల్చున్నాడు. 'సాఠే! నీవు విచారించవద్దు. దేహములు నీటిబుడగలు కదా! కనుక, యిట్టి దేహముపై నీవు భ్రాంతిని పెట్టుకోవద్దు. దైవభ్రాంతిని అభివృద్ధి పరచుకో. విచారములు కదలిపోయే మేఘములు. ప్రతి వ్యక్తికి యిలాంటివి సంభవిస్తూనే ఉంటాయి. ధైర్యము వహించు. బిడ్డను కాపాడుకో' అన్నాడు. వాని భార్య బిడ్డను ప్రసవించి మరణించింది. పాపం ఆబిడ్డ సంగతి తన మిత్రుడైన నార్కేకు కూడా తెలియదు. కానీ ఈవిషయాన్ని వినేటప్పటికి 'యితను పిచ్చివాడు కాదు, త్రికాలజ్ఞాని' అని విశ్వసించాడు. అప్పటికప్పుడు దర్శనం చేసుకొని రావాలనుకున్నవాడు తిరిగి రెండు దినములు అధికముగా ఉన్నాడు. క్రమక్రమేణా యితను సర్వీసు చేస్తూ, చేస్తూ ఎవరికి నేను సంపాయించి యివ్వాలి, ధనకనకవస్తు వాహనాదులంతా కేవలం అనిత్యములని స్మరించుకుంటూ తిరిగి రెండవ పర్యాయము షిరిడీ వెళ్ళాడు. బాబా నవ్వుతూ, 'సాఠే! నీకు ఉద్యోగముపై విరక్తి కలిగినట్టుగా ఉంది. నీవు ధనము సంపాదించి ఎవిరికి యివ్వాలని విచారిస్తున్నావు. ఎవరికి



యివ్వటమేమిటి? మంచి కార్యములు చేయి. మన షిరిడీకి కోట కట్టు' అన్నారు. 'స్వామీ! నేను లక్షాధికారిని కాదు కదా! ఇంత పెద్ద కోటను నేను ఎట్లా నిర్మించగలను?' 'చేతనైనంతవరకు చేస్తూరా. నేనుండగా భయమెందులకు?' ఈవిధమైన పలుకులు సాఠే విని ధైర్యం వహించాడు. క్రమక్రమేణా మేనమామ దాదాకేల్కరు వచ్చి షిరిడీలో స్థిరనివాసం యేర్పరచుకున్నారు. ఇతను డబ్బు పంపుతూ ఉండటం మేనమామ కట్టడాలు కట్టి అభివృద్ధి చేయటం. ఈవిధంగా కార్యక్రమములో మునుగుతూ వచ్చారు. వచ్చిపోయే భక్తులకు వసతికోసం మొట్టమొదటి వసతి గృహం నిర్మించాడు సాఠే. దీనినే యిప్పుడు కూడా సాఠేవాడా అని పిలుస్తూ ఉంటారు.

ఈవిధముగా సాఠేను మొట్టమొదటి పనిముట్టుగా తీసుకున్నాడు బాబా. ఇంక అప్పటినుండి అన్ని కార్యములందు సాఠేను ప్రధాన వ్యక్తిగా భావిస్తూ వచ్చాడు. ఇక్కడ బాబా సాఠేను అతి సమీపంగా చేర్చుకొని ప్రతి పని సాఠేకు చెప్పటంచేత షిరిడీలోని ప్రజలకు సాఠేపై అసూయ కలుగుతూ వచ్చింది.

**తానుచేయకున్న తగవు పుట్టదుగాని**
**పరులు చేయ జూచి ఓర్వలేరు**
**దాతదరిని చేరి తన సొమ్ము చెడినట్లు**
**జిహ్వతోడ చాడీలు చెప్పుచుంద్రు**

అనేకమంది బాబా దగ్గర చేరి అనేకరకములుగా చాడీలు చెప్తూతూ వచ్చారు సాఠేపై. ఇట్టి వారికి ఏ పేరు పెట్ట వలయు? భిక్షకులకు శత్రువని పేరు పెట్టవలయు అన్నారు. ఏమిటి ఆ శత్రువు? కుక్కలు. ఇలాంటి చాడీలు చెప్పేవారు కుక్కలతో సమానమన్నారు. షిరిడీలోని వారందరూ సాఠేపై కక్ష సాధించాలని ప్రయత్నించారు. దీనికి కారణమేమనగా వచ్చిన దక్షిణంతా ఒక హుండీ మాదిరి పెట్టి దానిని సంరక్షించుకొని భవనమును కట్టాలని సంకల్పించుకున్నాడు పాపం. దీనికి తగినట్టుగా, సాఠే దురదృష్ట

మనుకోవచ్చు. ఒక వెండి రథము, గుఱ్ఱములు షిరిడీలో ఉండేవి. వాటిని దొంగలు ఎత్తుకుపోయారు. ఆ ట్రస్టుకు సాఠే ప్రధాన కార్యకర్త. ఇతను యేదో చేసాడని యితనిమీద కక్ష సాధిస్తూ వచ్చారు. ఒకనాడు ఒక వ్యక్తి ఒక గొడ్డలి తీసుకొని సాఠే ప్రయాణమయ్యే మార్గములో నిల్చుని ఉన్నాడు. ఈ దృశ్యము వాని మేనమామ చూచాడు. చూచి 'సాఠే! ఇంక నీవు ఇక్కడ ఉండనక్కరలేదు. నీవు ఎక్కడైనా ఉండి బాబాను స్మరిస్తూరా. నీవు తక్షణమే షిరిడీ వదలిపో' అని చెప్పి పంపించాడు. బాబా 'సాఠే, సాఠే' అని పిలుస్తూ పరితపించారు. కానీ సాఠే లేడు. బాబాకు సాఠే అతి ప్రియుడు. అతి సన్నిహితుడు. ఇలాంటి సన్నిహితుడైన సాఠేను పంపటంచేత బాబా ఆనందముగా లేడని భక్తులలో ఒకరికొకరు మాట్లాడుకుంటూ వచ్చారు.

ఈసమయమునకు తగినట్లుగా శ్యాం తల్లిదండ్రులు రిటైరైన తరువాత శాంను షిరిడీ తీసుకు వచ్చారు. బాబా కేవలం శ్యాం, శ్యాం అని పిలచేవారు. తల్లిదండ్రులు రిటైరైనందువల్ల షిరిడీలోనే నివసించేవారు. శ్యాం అక్కడే ఒక స్కూలులో టీచరుగా నియమింపబడ్డాడు. సాఠే పోయిన తరువాత క్రమక్రమేణా శ్యాంను దగ్గరకు తీసాడు బాబా. శ్యాం పగలంతా పాఠములు చెప్పటం. క్లాసులైన తరువాత క్లాసురూంలోనే పడుకోటం. ప్రక్క రూంలో బాబా ఉండటం. రాత్రి కిటికీ నుండి బాబా రూంలోకి చూస్తూ ఉండేవాడు శ్యాం. బాబా తనలోతాను మాట్లాడుకోటం, తనలోతాను నవ్వుకోటం, తనలోతాను అనేక చర్యలు చేయటం చేస్తూ ఉండేవాడు. బాబా పండుకొనే పలక పైన రెండు తాళ్ళతో కట్టారు. సన్నటి చెక్క. ఆ చెక్క పైన పండుకొని ఊగుతూ ఉండేవాడు. అందుకే శ్యాంకు భయము. 'నిద్రలో క్రింద పడిపోతాడోయేమో. చిన్న పలక' అని దినము చింతిస్తూ ఉండేవాడు. ఒకనాడు బాబా పాదములు వత్తుతూ ఉండగా,'స్వామీ! రాత్రంతా మీరు నిద్రపోవటం లేదే. ఏదో నవ్వుకుంటున్నారు. మాట్లాడుకుంటున్నారు. ఏమిటి దీని అంతరార్థము?' చెప్పాలని ప్రార్థించాడు. ' పిచ్చివాడా! నీవు ఒక్కడివేనా ఉండేది లోకములో. ఎంతోమంది నాకోసం ప్రార్థిస్తున్నారు.



వారందరితో మాట్లాడుతున్నాను' అనేవారు. ' నా వేలు తిప్పటమంటే మనసు తిప్పటమే. వారితో మాట్లాడటమే నా పెదవులు చేసే పని. వారియొక్క పిచ్చితనాన్ని చూచి నవ్వటమే నా సరదా. ఇవన్నీ భక్తులకోసం చేసే చర్యలే నాయనా!' అని సమాధానం చెప్పారు.

బాబాకు కోపం లేదుగానీ ప్రదర్శించేవారు. కోపం వస్తే పదడుగుల దూరంలో ఉండినా కఱ్ఱ తీసుకొని వారిపై విసిరేవారు. ఒకరోజు తిరిగి శ్యాం ప్రశ్నించాడు. 'స్వామీ! ఇంత కోపంగా వారిని కొడుతున్నారే వారికి యేమైనా ప్రమాదము కలిగి ప్రాణం పోతే మీకు అపకీర్తి వస్తుంది కదా!' అని. 'సైతాన్! బైఠో. ఆ ప్రాణం నాచేతిలో ఉంటున్నాది. నేను పంపిస్తే కదా వాడు పోయేది. కాబట్టి నేను పోకుండా చూచుకుంటాను. నీవు నీ పని చేయి' అన్నారు. 'నీకెందుకీ విషయంలో విచారము. ఈరకమైన నటన నేను చేసినప్పుడే వాడు సరైన స్థితికి వస్తాడు. మంచిగా పోతే నా తలపై కూర్చుంటాడు. కనుకనే పదముల చేతను, వాక్యముల చేతను, కొంతవరకు వారిని బెదరించి అదలించి పని చేయించాలి. కార్యనిమిత్తమై నేను కోపము నటిస్తానుగానీ నాకు కోపం లేదు' అని ఒక్క శ్యాంకే లోపలున్న రహస్యము చెప్పాడు. అతనితో సేవలు చేయించుకుంటూ కాలము గడుపుతూ వచ్చాడు.

# దక్షిణ ఆంతర్యం..శ్రద్ధాభక్తులు

బాబా దగ్గర రెండు ప్రధానమైన పనులుండేవి. ఎవరు వచ్చినా ముందు దక్షిణ తీసుకొనేవాడు. మరీ అధికంగా కాదు. సాధారణంగా రెండు రూపాయలు దక్షిణ అడిగేవాడు. ఎందుకోసమంటే ఒకటి భక్తి, రెండవది శ్రద్ధ. ఈ రెండూ నాకు యివ్వండి. ఈ రెండూ విత్తనములో రెండు బద్దల వంటివి. రెండు బద్దలూ చేరినప్పుడే మొక్క వస్తుంది. బద్దలు వేరువేరైనప్పుడు మొక్క రాదు. భక్తి, శ్రద్ధ రెండు బద్దలవలె చేరిపోవాలి. అప్పుడే ఆనందమనే మొక్క ఆవిర్భవిస్తుంది.

అక్కడ తీసుకున్న దక్షిణ అక్కడే యిచ్చేసేవాడు బాబా, వారి ఎదురుగానే. ఒక్కటీ తన దగ్గర ఉంచుకునేవాడు కాదు. ఒకనాడు ప్రధాన్ అనే వ్యక్తి వచ్చాడు. అతను షిరిడీ సాయిబాబాకు యిరవై రూపాయలు యివ్వాలనుకున్నాడు. ఆనాడు అన్నీ నాణెములే. వెండి రూపాయలుండేవి. ఇంత చిల్లర ఎలా యిచ్చేదని ఒక బంగారు నాణెమును (సవర) తీసుకొని యిచ్చాడు. దానిని బాబా అటుయిటు తిప్పి చూచాడు. ప్రక్కనున్నవాడు 'యిది బంగారు నాణెము' అన్నాడు. 'దీనికి ఎన్ని రూపాయలు?' అడిగాడు బాబా. అప్పుడు సవరకు పదిహేను రూపాయలు. అప్పుడు పదిహేను రూపాయలిచ్చినట్లు. పదిహేను రూపాయలిచ్చేటప్పటికి బాబా,'ప్రధాన్! ఇంకా ఐదు రూపాయలు రావాలి' అన్నాడు. అతను జడ్జి. 'ఏమిటి సవరకు పదిహేను రూపాయలు. సరిగానే యిచ్చానే. ఎందుకిలా అడుగుతున్నారు?'



అని అనుమానం బయలుదేరింది. 'మొదట ఐదు రూపాయలిచ్చి తరువాత యోచన చేయి' అన్నాడు బాబా. 'నీవు ఇంటి దగ్గర యేమనుకొని వచ్చావు? ఇరవై యివ్వాలనుకున్నావు. ఇప్పుడు పదిహేను రూపాయలే యిచ్చావు. ఇంకా ఐదు రూపాయలు రావాలి కదా! ఇయ్యి' అన్నాడు. దానితో ఆ జడ్జి నిర్ఘాంతపోయాడు. బాబా సరైన జడ్జి అనుకున్నాడు. ఈవిధంగా పోయినవారి దగ్గర డబ్బు తీసుకోటం అప్పటికప్పుడే బీదవారికి యిచ్చివేయటం బాబాకు అలవాటు.

షిరిడీలో బాబా కేవలం ఉపన్యాసాలతో జ్ఞానబోధ చేయలేదు. ఎందుచేతనంటే ఆనాటి వాతావరణము ఆవిధంగా ఉండేది. సాయి ప్రేమమయుడు. ఆయనలో కోపముగానీ ద్వేషముగానీ లేవు. ఇందుకెన్నియో ఉదాహరణలు కలవు. ఒకానొక సమయంలో దాదాసాహెబ్ భార్య తన బిడ్డను తీసుకొని షిరిడీలో కొన్ని రోజులుండాలని వచ్చింది. ఆ సమయంలో అక్కడ ప్లేగువ్యాధి అధికంగా ఉండేది. షిరిడీలో ఆ బిడ్డకు జ్వరం వచ్చింది. వళ్లంతా పెద్దపెద్ద బొబ్బలు వచ్చాయి. ఆ బిడ్డను అక్కడ వదలి ఆమె మసీదుకు వెళ్ళి 'బాబా! బాబా!' అని దీనంగా ప్రార్థించింది. 'ఏమి వచ్చావు? నీ బిడ్డకు జ్వరం వచ్చి బొబ్బలు పుట్టాయా? నీ బిడ్డకే కాదు. నాకు కూడా ఉన్నాయి' అని అంటూ తన చొక్కా తీసి చూపించగా అక్కడ పెద్దపెద్ద బొబ్బలు కనిపించాయి. అప్పుడు మహల్సాపతి కూడా అక్కడే ఉన్నాడు. అప్పుడు బాబాకు 105, 106 డిగ్రీల వరకు జ్వరం వచ్చింది ' అయ్యో పాపం! నా కుమారునికే కాక మీకు కూడా వచ్చిందా! తమను రక్షించేవారెవరు?' అని చింతించి, వెంటనే 'సర్వజీవ రక్షకుడైన నిన్ను రక్షించేవారు ఇంకొకరున్నారా స్వామీ! నా అపరాధము క్షమించు' అని లెంపలు వేసుకుంది. మరికొంతసేపటికి జ్వరం తగ్గిపోయింది. ఆమె ఆనందముతో యింటికి వచ్చి చూసేసరికి తన బిడ్డకు జ్వరం లేదు. బొబ్బలు లేవు. 'బాబా నా బిడ్డ బాధను స్వీకరించి రక్షించావా!' అంటూ ఆమె కృతజ్ఞతలు తెలుపుకొంది.

పిళ్లె అని ఒక డాక్టరు. అతడు బాబా యెడ సద్భావము కలవాడు కాదు. వారి మహిమలను గూర్చి ఛలోక్తులతో విపరీత ప్రసంగములను అప్పుడప్పుడు చేయుచుండెడివాడు. కొంత కాలమునకు అతనికి పరిణామశూల యేర్పడి బాధింపజొచ్చినది. తనకు తెలిసిన మందులన్నియూ వాడి చూచినాడు. పెద్ద పెద్ద డాక్టర్ల వద్ద చికిత్సలు చేయించుకున్నాడు. బాధ తగ్గలేదు. అది అంతకంతకు అధికమై ఆ బాధ భరింపలేక ఆత్మహత్య తప్ప దీనికి మందు లేదనే నిశ్చయమునకు వచ్చినాడు. అట్టి స్థితిలో అతని ఆప్తమిత్రుడును, బాబా భక్తుడు అయిన కాకాసాహెబ్ అనునతడు, 'అయ్యా! నీ అహంకారము తగ్గించుకొని వినీతుడవైపోయి బాబా పాదములపై పడుము. నీ బాధతొలగించును' అని బోధించెను. బాధ ఓర్వలేకనూ, బ్రతుకు మీద ఆశ చేతను అతడు బాబాను దర్శించి పాదములపైబడి మ్రొక్కి లేచి వినమ్రుడై నిల్చుండెను. బాబా ఒక్క నిముషమాతనిని చూచి చిరునవ్వుతో, ' 'ఏమోయీ! పరిణామశూలతో బాధ పడుచున్నావా? భయ పడకు. భగవంతుని నమ్మి ధ్యానించుకొనుము. ఆ బాధ నీ జోలికి రాదు' అని ఉపదేశించి ప్రసాదమిచ్చి పంపివేసెను. ఆనాటితో ఆ బాధ అతనిని వదలిపోయినది. ఎక్కడికి పోయినది? దీనిని బాబా తీసుకున్నాడు. అది వారి ఆజ్ఞ మేరకు కొన్ని దినములుండిన తరువాత తన దారిని తాను పోయినది.

ఈవిధంగా బాబా ప్రతి విషయానికి ఎప్పటికప్పుడే ఫలితాలను చూపించాడు. దీనికి కారణం ఆనాటి భక్తుల పరిపూర్ణ విశ్వాసమే. వారు బాబా మాటలను తు.చ. తప్పకుండా పాటించేవారు. కానీ ఈనాడు అది లేదు. ఏదైనా చెబితే దానికి పది ప్రశ్నలు వేస్తారు. ఇది ఈనాటి విద్య యొక్క ప్రభావమే. ఈనాటి మానవుడు ఏ ఉపకారము పొందినప్పటికా మహా కౄరుడుగా, కృతఘ్నుడుగా మారిపోతున్నాడు. మంచిని మరచిపోయ చెడ్డను మాత్రం హృదయంలో పెంచుకుంటున్నాడు. కనుక, మానవునియందు అసురత్వం పెరిగిపోయింది. ఏది కోరినా స్వార్థమే. తన కోరిక తీరిన బాబా



బాబా అని నవ్వుతూ వస్తారు. లేనిచో పూర్తిగా మారిపోతున్నారు. ఇంతటి కౄరమృగాలుగా మారితే మానవత్వంలో బాబా భక్తి ఏవిధంగా అభివృద్ధి కాగలదు? ఈనాడు ఆకారము మానవునిగానే ఉన్నదిగానీ ప్రవర్తన మాత్రం మృగమువలె ఉన్నది.

షిరిడీలో ఒకానోక సమయంలో (1916) పెద్ద తుఫాను వచ్చింది. భరించుకోలేకపోయారు షిరిడీ ప్రజలు. వడగళ్లు రాళ్లవలె కొట్టేస్తున్నాయి. పనిచేసేవారు, పల్లెప్రజలు అందరు ద్వారకామాయికి పరుగెత్తి వచ్చారు. ద్వారకామాయి చిన్నదిగా ఉంటున్నాది. ఎక్కడ స్థలం చిక్కుతే అక్కడంతా ప్రవేశించారు. అందరూ,'బాబా! రక్షించండి, రక్షించండి' అన్నారు. ద్వాపరయుగంలో ఇంద్రుడు రాళ్లవర్షం కురిపించినప్పుడు శ్రీకృష్ణుడు గోవర్ధనగిరి ఎత్తినట్లుగా, ఆ గోపికలు గోపాలురు వెళ్లి, 'ఓ భగవంతుడా! కాపాడు, కాపాడు' అని ప్రార్థించినట్లుగా షిరిడీ ప్రజలందరూ ప్రార్థించారు. అప్పుడు బాబా,'అచ్చా దేఖేగా' అని ముందుకు పోయాడు. స్తంభము పట్టుకు కొట్టాడు. 'అయ్యా! చాలుయింక నీ రౌద్రము. శాంతించు. ఎక్కువ క్రోధము ఉపయోగపెట్టావు. అందరూ నీకు భయపడిపోయారు. నీ ప్రతాపాన్ని తెలుసుకున్నారు. నీవు అధిక ప్రతాపాన్ని ప్రదర్శించకు. చల్లబడు' అన్నాడు. క్షణములో ఆగిపోయింది.

ద్వారకామాయిలో అగ్నిగుండము (ధుని) ఉంటున్నది. ధునిలో కట్టెలు వేయటం సాంప్రదాయం. భక్తులు ధునిలో కట్టెలు వేస్తే మంచిదని అందులో ఆడవారికి పిచ్చిభక్తి. కాబట్టి, కట్టెలు కొని మరీ వేసేవారు. ధునిలో కట్టెలు వేశామని తృప్తిపడేవారేగానీ దానివల్ల ఆ మసీదు ఆ మంటలను భరించగలదా అని ఆలోచించేవారు కాదు. అందులో కట్టెలు వేయటం వారికి తృప్తినిచ్చేది. ఒకరోజు కొంతసేపయ్యేటప్పటికి పెద్ద మంట ప్రారంభమైంది. శ్యాం వచ్చాడు. 'దాదా! దాదా!' అని పిల్చాడు. 'క్యాహోగయా?' అడిగాడు బాబా. 'దేఖో! అగ్నిహోత్రుడు ప్రత్యక్షమయ్యాడు'. 'చూచేవారెవరున్నారు? ఇక్కడ ఎవరూ లేరు. ఎవరూ లేనప్పుడు నీ

ప్రతాపము ఎందుకు చూపుతావుయ నీకు బుద్ధి చెప్పేవారు లేకపోతున్నారు. అవసరమైన దగ్గర నీ ప్రభావం చూపించాలిగానీ అవసరం లేనిదగ్గర నీ ప్రభావమెందుకు?' అని స్తంభము పట్టుకొని కొట్టాడు బాబా. క్షణములో అగ్ని చల్లారిపోయింది.



# భక్తసంస్కరణ...విశిష్టశైలి

దేహంబు క్షీణించు దినమెవ్వరెరుగరు
   కష్టంబులొచ్చుట గాంచలేరు
జగతిపైనెవరైన జన్మించుటెరుగరు
   దివిభువి సుఖములన్ దెలియలేరు
మాయలోపలజిక్కి మమత వీడగజాల
   రించుక తమ మర్మమెరుగలేరు
మానవ ధర్మంబు మాటయే మరతురు
   దేనినొనర్తురో తెలియలేరు
ఇన్ని తీరులుకూడ దైవేచ్ఛగాన
దీన వత్సలుడతని ప్రార్థింతురేని
సృష్టి చిత్రంబులెంత విచిత్రమైన
భక్తిశక్తియు ముక్తియు బాబాయిచ్చు.

అనేకమంది భక్తులు షిరిడీ వచ్చేవారు. బాంద్రాలో తర్కడ్ అనే శిరస్తాదారు ఉండేవాడు. అతనికి భార్య, పదహారు సంవత్సరముల కుమారుడు ఉండేవారు. భార్య, కుమారునకు బాబా అంటే చాలా యిష్టము, విశ్వాసము. వీరికి యేవిధమైన అడ్డు చెప్పేవాడు కాదు తర్కడ్. ఒక దినము 'మేము షిరిడీ వెళ్లాలి' అన్నారు భార్య, కుమారుడు. తప్పక వెళ్లమన్నాడు తండ్రి.

ఇతను బ్రహ్మసమాజము వాడు. ఇతనికి ఏ క్షేత్రము పోవటము యిష్టము లేదు. భార్య ప్రార్థించినా యితను షిరిడీ పోలేదు. అదికూడా ఒక బలహీనతే. ఎందుకంటే ఏ సమాజమైతే మనకేమి సర్వేశ్వరుడు ఒక్కడే అని గుర్తించాలి. కొంతమంది ఈ కులమతములని వంకరమార్గములో ప్రవేశిస్తుంటారు. ఈ బ్రహ్మసమాజమువాడైన తర్కడ్, 'నేను రాను. మీరు వెళ్లండి' అన్నాడు. ఆ పదహారు సంవత్సరముల కుమారుడు చెప్పాడు, 'నాన్నా! నేను వెళ్లను'. 'ఎందుకోసం వెళ్లవు?' 'నేను నిత్య పూజలో తెల్లవారి మొదలు రాత్రివరకు క్రమశిక్షణ పాటిస్తున్నాను. కండ చక్కెర నైవేద్యము పెడుతున్నాను. ఇది బాబా స్వీకరించాడనే విశ్వాసముతో తిరిగి ప్రసాదముగా స్వీకరిస్తున్నాను. ఈ పద్ధతిని నేను వదలటం యిష్టం లేదు. కనుక, నేను షిరిడీ వెళ్లను' అన్నాడు. కుమారునిపై తండ్రికి ప్రేమ ఎక్కువ. కుమారుని కష్టపెట్టటం యిష్టం లేక తండ్రి చెప్పాడు, 'ఆ పని నేను చేస్తాను. నీవు వెళ్లు' అన్నాడు. 'నిజంగా చేస్తావా?' అని కుమారుడు గట్టిగా అడిగాడు. 'బాబాకు నీవు పూజ చేస్తావా? నేను చెప్పినట్లు నైవేద్యం పెడతావా? మాట యియ్యి. నేను షిరిడీ పోతాను లేకపోతే పోను' అన్నాడు. ఈ పిల్లవాని పట్టుదల చూచి తండ్రి మనస్సు కరగింది. 'ఇంత క్రమశిక్షణ పాటించేవాడు ఎంత ఉత్తముడు! ఇంత వయస్సు వచ్చినా నాకు ఈ క్రమశిక్షణ లేదు కదా!' అని విచారణ చేశాడు. కుమారునికి నేను చేస్తానని మాట యిచ్చాడు. కుమారుడు, తల్లి వెళ్లారు. కుమారునికి మాట యిచ్చిన ప్రకారము పూజ సక్రమంగా చేశాడు తండ్రి. కుమారుడు చెప్పినట్లు కండచక్కెర అక్కడ పెట్టటము తిరిగి భోజనము చేసే సమయములో ప్రసాదము భుజించటము, యీవిధంగా జరుగుతూ వచ్చింది. మూడవదినము గురువారము వచ్చింది. కోర్టులో అవసరమైన పని ఉంది. స్నానం చేసి పూజ చేశాడు. టిఫిన్ తిన్నాడు. తన డ్రస్సు వేసుకొని ఆఫీసుకు వెళ్లాడు. తిరిగి భోజనమునకు వచ్చాడు. భోజనమునకు కూర్చున్న తరువాత వంటవానిని ప్రసాదము తీసుకొని రమ్మన్నాడు. వంటవాడు చెప్పాడు,



'మీరు అవసరంగా పోతూ ప్రసాదము నివేదన చేయలేదు'. చాలా బాధ పడ్డాడు. కుమారునికి యిచ్చిన మాట తప్పినాను కదా! బాబాకు నివేదన చేయలేదని కాదు బాధ, కుమారునకిచ్చిన మాట తప్పినాననే బాధ. రెండవదినము తర్కడ్‌భార్య, కుమారుడు నమస్కారము చేసుకోటానికి వచ్చారు. 'బాబూ! నిన్న నేను బాంద్రాకి పోయాను. కానీ అక్కడ ఎవరూ భోజనం పెట్టలేదు. నిత్యమూ నీవు యిస్తున్న ఖండచక్కెర నాకు చిక్కలేదు. చాలా ఆకలిగా తిరిగి వచ్చాను. ఇప్పుడేమైనా యిస్తే చాలు' అని పిల్లవానిని అడిగాడు బాబా. ఆ పిల్లవానికి షాక్ మాదిరి అయింది. ఇంటికి వెళ్లి తల్లి ఒడిలో ఏడుస్తూ కూర్చున్నాడు. తండ్రి మాట యిచ్చాడుగానీ నైవేద్యము పెట్టలేదు. కనుకనే బాబా నిరాశగా వచ్చాడు. 'అమ్మా నేను యిక్కడ ఉండను. నా క్రమశిక్షణ నేను తప్పను. నేను తిరిగి బాంద్రా వెడతాను' అనేటప్పటికి, బాబా జోగ్ అనే అతనితో పిల్లవానికి చెప్పి పంపాడు. 'నీవు యిప్పుడు పోనక్కరలేదు. నీ తండ్రి మాట తప్పాడుగానీ నీవు మాట తప్పలేదు. కాబట్టి నా అనుగ్రహం దండిగా ఉంది. నీవు వెళ్లనక్కరలేదు. ఎంతకాలము నీకు యిష్టమో అంత కాలము ఉండు' అని.

కానీ అంతకాలం కొంత నిరాశగా, అసంతృప్తిగా కాలం గడుపుతూ వచ్చాడు. పది దినములైన తరువాత యింటకి వచ్చాడు. పిల్లవాడు వచ్చిన వెంటనే తండ్రి పిల్లవాని దగ్గరకు పోయి, 'ఎక్స్క్యూజ్ మి. నీవు చిన్నవాడవు. నేను పెద్దవాడను. కానీ నిన్ను క్షమార్పణ వేడుకుంటున్నాను' అన్నాడు. అప్పుడు పిల్లవాడు చెప్పాడు, 'క్షమార్పణ నాకు కాదు బాబాకు చెప్పు'. ఏ సమాజములో ఉండినప్పటికి, ఏ కల్చరు నీకుండినప్పటికి మాట మాత్రం ఒక్కటే. సత్యం ఒక్కటే. సత్యాన్ని పాలించటం చాలా అవసరం. ఆవిధంగా మనము సక్రమంగా పాటిస్తున్నప్పుడు దైవత్వం మనకు సాక్షాత్కరిస్తుంది.

షిరిడీబాబాను కొంతమంది పిచ్చివాడని భావించేవారు. మరికొంతమంది ఇతడొక ఫకీరని విశ్వసించేవారు. భగవంతుడు

పిచ్చివాడనుకొన్నవారికి పిచ్చివాడుగానే కనిపిస్తాడు. ఫకీరనుకొన్నవారికి ఫకీరుగానే కనిపిస్తాడు. ఒకానొక సమయంలో బాబా అప్పాకులకర్ణి అనేవానిని పిలచి తన జేబులోనుండి రెండు కాసులు తీసి యిచ్చి, 'నీవు వెళ్లి నానాను తీసుకురా' అన్నాడు. అప్పుడు నానా తహసీల్దారు పని చేసేవాడు. ఆకాలములో తహసీలాదరు అంటే అమిత గౌరవం. అంతేకాక నానా గొప్ప విద్యావంతుడు. మంచి పర్సనాలిటీ గలవాడు. అందుచేత అతనికి అహంకారం కూడా అధికంగా ఉండేది. ఈ కులకర్ణి నానాను కలుసుకొని, 'బాబా మిమ్ము తీసుకు రమ్మన్నారు' అన్నాడు. 'ఛీ! ఎక్కడో ఎవరో ఒక ఫకీరు నన్ను రమ్మంటే నేను రావాలా? నీకు బుద్ధిలేదా? వెళ్లిపో' అన్నాడు. కులకర్ణి తిరిగి వచ్చి ఈ మాటలు బాబాకు చెప్పాడు. కానీ బాబా, 'నేను నానాను చూడాలి, నేను నానాను చూడాలి ' అని అనేక పర్యాయములు పిచ్చివానివలె అరుస్తున్నాడు. అప్పుడు కులకర్ణి 'ఏమిటిది. ఈ నానా నన్నుకూడా అవమాన పరుస్తున్నాడే. ఇంత అహంకారియైన నానాను చూడవలసిన అవసరం యేమిటి? అతనిపై బాబాకు ఎందుకింత ఆప్యాయత?'అని యోచించాడు. కానీ అర్థం చేసుకోలేకపోయాడు. కడపటికి నానా కాళ్లు పట్టుకొని, 'బాబా నిన్ను చూడాలని ఆశిస్తున్నారు. మీరు తప్పక రావలసిందే' అని యేడ్చాడు. అప్పుడు నానా, 'నీవు బాధపడుతున్నావని వస్తున్నానుగానీ బాబాను చూడటానికి కాదు. అతనిని చూడవలసిన అవసరం నాకు లేదు' అని పలికి షరిడీ వచ్చాడు. కానీ బాబాకు నమస్కారం చేయలేదు. కనీసం చేతులైనా కట్టుకోలేదు. 'నేను అధికారిని. నీవు బికారివి. నాతో నీకేమి పని? ఎందుకు రమ్మన్నావు?' అని ప్రశ్నించాడు.

'నానా! ఎన్నిసార్లు కబురు చేసినా ఎందుకు రాలేదు? నాకు నీకు యిప్పుడుకాదు సంబంధము. నీవు మరచిపోయావు. నాకు ఎరుక ఉంది. దగ్గరకు రా!' అన్నాడు. నన్ను క్రింద కూర్చోమంటున్నాడే అని చాలా యిబ్బందిగా ఉన్నాడు లోపల. ఇంతమందిలో బాబా మాట వినకపోతే అవమానమవుతుందని దగ్గరకు వచ్చాడు. ఆయన చేసే తప్పులన్నీ చెప్పాడు



బాబా. 'తహసీల్దారుగా ఉన్నావు. గవర్నమెంటు భూములు స్వంతం కోసం ఉపయోగపెడుతున్నావు. ఇది మంచిది కాదు. ప్రజలను సరైన స్థితిలో పెట్టేందుకు ఈ ఉద్యోగం వచ్చింది. నీవు చేస్తున్నది చాలా తప్పు' అన్నాడు బాబా. ఇలా చెప్పటంతో నానా అనుకున్నాడు, 'ఈయన బికారి కాదు. చాలా గొప్పవాడు!' 'పైవారం రా' అన్నాడు బాబా.

తరువాత వారం వచ్చాడు నానా. బాబా వేదాంత విషయములు మాట్లాడుతున్నాడు అక్కడున్న వారితో. నానా మంచి వయస్సులో ఉన్నాడు. ఈలోపల ఒక ముస్లిందంపతులు వచ్చారు. వారు చిన్న వయస్సువారే. ఆమె ముసుగు వేసుకు వచ్చింది. ముస్లిములకు అది సహజం. ముఖం కప్పుకుంటారు. నమస్కారం చేసినప్పుడు గాలికి ముసుగు లేచిపోయింది. ఆమెను చూచాడు నానా కళ్లార్పకుండా. ఊరకే ఆమెవైపు చూస్తున్నాడు. బాబా కనిపెట్టాడు. 'కన్నులను చూడటానికి యిచ్చినది నిజమేగానీ కన్నులు చూచినాయని బుద్ధిని పెడమార్గం పట్టించటం తప్పు. చూచేది కన్నులు. బుద్ధిని ఎందుకు మారుస్తావు? భగవంతుడు కన్నులు చూచేందుకు యిచ్చాడు. తప్పులేదు. కానీ బుద్ధిని పెడమార్గం పట్టిచంటం తప్పు' అన్నాడు. నానా చాలా బాధ పడ్డాడు. ఇంతమందిలో యీరకంగా అవమానం చేశాడు. 'బాబా! ఇంతమందిలో నన్ను అవమానం చేయవచ్చునా?' అడిగాడు. 'యువకులకు గుంపులో అవమానము చేస్తేనే బుద్ధి వస్తుంది. ఒంటరిగా యేమి చెప్పినా వినరు. చిన్న ఉదాహరణ. నీ రూములో నీవు కూర్చొని పాత పంచ, బనీను వేసుకొని ఇల్లు శుభ్రము చేసుకుంటుంటే సిగ్గుపడవు. కానీ ఎవరైనా వచ్చి చూస్తే మంచి బట్టలు వేసుకొని వస్తావు. ఒంటరిగా ఉన్నప్పుడు ఏ డ్రస్సుతోనైనా ఉంటావు. అక్కడ అభిమానం లేదు. పదిమందిని చూచేటప్పటికి అభిమానపడుతున్నావు. అభిమానపడినప్పుడు చెడ్డ దూరం చేసుకుంటావు. మంచి దగ్గర చేర్చుకుంటావు. పదిమందిలో చెబుతే మంచి భావములు అలవర్చుకుంటావు. లేకపోతే యింకొకసారి బయటపెడతానేమోనని భయం ఉంటుంది. అదే పాప భీతి. పాపభీతి

ఉన్నప్పుడే దైవప్రీతి అభివృద్ధి చేసుకుంటావు. దైవప్రీతి ఉంటే సంఘనీతి పెరుగుతుంది' అన్నాడు. నానా చాలా బాధ పడ్డాడు.

మరల తరువాత వారం కూడా వచ్చాడు నానా. 'బేటా భైఠో' అన్నాడు బాబా. నానా కూర్చున్న తరువాత బాబా అతనితో, 'నానా! ప్రస్తుత జన్మలో నీకు నాకు సంబంధం లేదుగానీ పోయిన జన్మలో మనిద్దరికి చాలా సన్నిహిత సంబంధముంది. అందుచేత నిన్ను చూడాలని ఆశించాను' అని బాబా లేచి తన హస్తమును నానా కన్నులపై పెట్టాడు. అప్పుడు నానాకు పూర్వం తానెరో బాబా ఎవరో స్పష్టంగా కనిపించింది. తక్షణమే బాబాకు సాష్టాంగనమస్కారము చేశాడు. 'బాబా! నన్ను క్షమించు. మీకు తెలిసినా తెలియని వారులా ఉంటారు. మాకు తెలియకపోయినా తెలిసినట్లు నటిస్తాము' అన్నాడు.

అప్పటినుండి నానా బాబాకు అత్యంత సన్నిహితుడుగా మారిపోయాడు. బాబాకు హుక్కా నానాయే అందించేవాడు. 'ఛీ! ఈ పిచ్చివాని దగ్గరకు రావలసిన అవసరమేమిటి నాకు?' అని బాబాను నిందించిన నానా చివరకు బాబాయే తన ఆరవప్రాణంగా విశ్వసించాడు. బాబాలేక నానా గానీ, నానలేక బాబాగానీ భోజనం చేసేవారు కాదు. 'ఆయన లేకుండా ఈయన భోజనం ఎందుకు చేయకూడదు?' అని కొందరు విమర్శించేవారు. 'అది నా యిష్టం. మీరెవరు చెప్పేందుకు. నానా ఉంటేనే భోజనం చేస్తాను' అనేవాడు బాబా. ఎవరే జన్మలో ఏవిధంగా ఉండేవారో, ఈనాడు ఈజన్మ ఏరీతిగా ఉంటుందో ఎవరూ చెప్పలేరు. కొందరికి ఎట్టి కారణములు లేకుండానే జరుగుతుంటాయి. వారు ఆశించకపోయినా భగవంతుడే వారిని తన దగ్గరకు లాక్కుంటాడు. దీనికి కారణం పూర్వజన్మ కర్మ ఫలితమే. నిన్న విత్తనము లేక ఈనాడు మొక్క రావటానికి వీలులేదుకదా! అనేక జన్మల సంస్కారము ఒక్క జన్మలో ఫలించవచ్చు. మీరు ఏవిధమైన రూపనామములు ధరించారో చెప్పలేరు.



కారణం ఏమిటి? ఈజన్మలోని రూపనామములపై మీకు గల అభిమానమమకారములచేత పూర్వజన్మలోని రూపనామములను పూర్తిగామరచిపోతుంటారు.

ఒకానొక సమయంలో భక్తుడైన నానా కుమార్తె మీనా ప్రసవవేదనతో బాధపడుతోంది జామ్నేరులో. మూడునాలుగు దినములైపోయింది. చాలా నీరసించింది. ఆమె ప్రాణము ఉంటుందో లేదో అనే సందేహస్థితి వచ్చింది. నూరు సంవత్సరముల క్రితము ఎట్టి వైద్యము, ఎట్టి ఆసుపత్రులు, నర్సులు ఉండేవారుకాదు. నిరంతరము బాబా పటము దగ్గర 'బాబా! బాబా! బాబా! నా కుమార్తెను రక్షించు' అని ప్రార్థించాడు. భక్తుడు ఎక్కడ ఏవిధముగా ప్రార్థించినా భగవంతునికి ఒక కనెక్షను ఉంటున్నాది. వైర్‌లెస్ కంటె ఎక్కువ వేగముతో చేరుతుంది. భక్తునికి, భగవంతునికి హృదయమునకు, హృదయమునకు సంబంధము. తక్షణమే బాబాకు తెలిసింది. అక్కడ బాఊ (రాంగిరి బువ) అని ఉండేవాడు. అతనిని బాబా బాఊ అని పిల్చేవాడు. 'బాఊ! రా ఈ విభూతి తీసుకొని జామ్నేరు గ్రామములోనున్న నానాకు అందించు' అన్నాడు. 'ఆజ్ఞ' అన్నాడు బాఊ. జేబులో చూచుకున్నాడు. రెండు రూపాయలు ఉన్నాయి. జలగాం వరకు రైలులో పోవచ్చు. జామ్నేరు పోవటానికి అతని దగ్గర డబ్బులు లేవు. 'బాబా! నా దగ్గర కాసులు లేవు. నన్ను ఎలా వెళ్లమంటారు?' అని అడిగాడు. 'ఒరే పిచ్చివాడా! నేను చూచుకుంటాను. పొమ్మ'న్నాడు. 'ఎప్పుడు చెప్పానో తగిన సదుపాయములు నేను చూచుకుంటాను. సందేహములకు చోటివ్వకు'. అట్లే రామావతారమందు రాముడు హనుమంతుని ఆజ్ఞాపించాడు. 'హనుమా! నీవు సీతాన్వేషణ చేయాలి. లంకలో ప్రవేశించి సీత ఏవిధముగా ఉంటున్నదో ఆమె స్థితిగతులు కనుగొని రమ్మ'న్నాడు. హనుమంతుడు సందేహించాడు. ఇంతపెద్ద సముద్రము నేనెట్లా దాటాలి? నన్ను పొమ్మని చెబుతున్నాడు అని కొంత సందేహించాడు. ఆజ్ఞ యిచ్చినవాడే కార్యము పూర్తిచేయించుకుంటాడు. నాతో కార్యము

సాధించుటకై నాకీ కార్యము చెప్పాడు. ఇంకెవ్వరికీ యివ్వలేదే. ఆజ్ఞాపించిన భగవంతుడే ఈ కార్యములో అన్నీ చూచుకుంటాడనే ధైర్యముతో వెళ్ళాడు. పరిశుద్ధమైన విశ్వాసము, అచంచలమైన విశ్వాసము. బాఊ కూడా సందేహముతో ప్రశ్నించాడు బాబాను, 'నా దగ్గర రెండు రూపాయలున్నాయి. నేను యింతదూరం ఎట్లా పోవాలి? జలగాం నుండి ముప్పైమైళ్ళు పోవాలి. ఆ రోజులలో టాంగాలు మాత్రమే ఉండేవి. ముప్పైమైళ్ళు టాంగాలో వెళ్లాలి లేక నడచి వెళ్లాలి. ముప్పైమైళ్లు నడవగలనా?' అని సందేహిస్తుండగా బాబా ధైర్యమునిచ్చాడు. 'నా మాటలు విశ్వసించు. నా ఆజ్ఞ శిరసావహించు. నీవు వెళ్ళు' అన్నాడు. జవాబు చెప్పకుండా జలగాం వరకు రైలులో వెళ్లాడు. రాత్రి ఒకటిన్నర గంటలకు జలగాం చేరాడు. 'నేను ఎక్కడికి పోయేది ఈచీకటిలో? ఏవిధముగా కాలము గడపాలి?' అని ఇక్కడకూడా కన్నులు మూసుకొని బాబాను ప్రార్థించాడు. ఒక బిళ్లజవాను వచ్చాడు. పాతకాలములో తహసీల్దారు వెంట బిళ్లవేసుకొని జవాను ఉండేవాడు. ఆ జవాను ఆజానుబాహుడు. 'ఎవరండీ బాఊ ట్రైనులో దిగారు షిరిడీనుండి?' అని కేకలు వేసుకుంటూ వచ్చాడు. 'బాబా పంపుతే వచ్చాను. నా పేరు బాఊ' అన్నాడు. 'రండి. రండి. మీకోసం టాంగా కాచుకొని ఉంటున్నాది' అన్నాడు. 'ఎక్కడనుండి వచ్చింది?' అడిగాడు. 'నానాసాహెబు పంపించారు' అన్నాడు. టాంగాలో కూర్చున్నాడు. తాను కూర్చుంటే టాంగా నడచినట్లే లేదు. అంత స్పీడుగా పోతున్నాది. తనలో అనుకుంటున్నాడు, 'ఎంత స్పీడుగా పోతున్నాది' అని. ఈవిధంగా తలచుకుంటుంటే గ్రామము వచ్చింది. 'అదే నానా యిల్లు' అని చూపించాడు. ఆయన దిగాడు. నడచి తిరిగి టాంగావానితో చెబుదామని వెనుకకు తిరిగాడు. టాంగా లేదు. టాంగా నడిపేవాడూ లేదు. సరే ఇంటికి వచ్చి చేరాడు. 'నానాసాహెబ్! ఇదిగో బాబా విభూతి పంపించారు'. 'ఎప్పుడు పంపారు?' 'నిన్న సాయంకాలమే పంపారు. రాత్రి ఒకటిన్నర గంటలకు స్టేషను చేరాను. మీకు ఎట్లా తెలిసిందో ఏమిటో మీరు టాంగా పంపటం చేత శీఘ్రముగా ఇల్లు



చేరగలిగాను'. నానాకు ఆశ్చర్యం వేసింది. 'నాదగ్గర టాంగా లేదే. నేను ఎవరినీ పంపలేదే. మీరు వచ్చే విషయం నాకు అసలు తెలియదే. ఎందుకు ఈవిధంగా చెబుతున్నారు? ఆటాంగా ఎక్కడుంది?' చెప్పమన్నాడు. 'అయ్యా! దిగిన వెంటనే టాంగా కనిపించలేదు. అతను మీరు పంపినట్లు చెప్పాడు'. మాటలకు సమయము కాదు. మొట్టమొదట పేషెంటుకు ఊదీ యివ్వాలని లోపలకు వెళ్లి ప్రసాదము యిచ్చాడు. బాబా పటము దగ్గరకు వెళ్లి ప్రార్థన చేశాడు. 'బాబా! బాబా!! బాబా!!!' అని అరిచాడు. ఆ అరుపులోపలనే బిడ్డ అరుపులు వినిపించాయి. కుమారుడు పుట్టాడు.

ఆనందముతో బాఊ దగ్గరకు వచ్చి, 'బాఊ! ఏమి జరిగిందో చెప్పు. బాబా యేమి చెప్పారు? ఏవిధంగా వచ్చావు?' అని అడిగేటప్పటికి, ' రెండు రూపాయలతో నేను బయలుదేరాను. అన్ని సదుపాయములు బాబాచేశారు. నమ్మినవారిని వదలడు. నమ్మకమే ప్రధానమైనది. నమ్మకమనే నయనములను కోల్పోయినాము. ఈనాడు నమ్మి పని చేస్తే దేనిలోనైనా విజయము చేకూర్చుకోవచ్చు. ఈ నమ్మకము చేతనే నేను యింత ఆనందము పొందగలిగాను'. మూడవదినము బాఊ, నానా షిరిడీ వెళ్లారు. 'బాబా! ఏమి నీయొక్క నాటకము! ఏమి నీ సందేశము! ఏమి నీ లీలలు! ఇవి వర్ణనాతీతమైనవి' అని ప్రార్థించారు.

# దివ్యసాధనం...దాసగణు

దాస్‌గణు కోపర్గాంలో పోలీసాఫీసరు. మంచివాడేగానీ షరిడీకి వచ్చేపోయేవారిని దూషిస్తూ ఉండేవాడు. ఫకీరు దగ్గరకు యింతమంది వెడుతున్నారని అపహాస్యము చేసేవాడు. ఆయన బాగా పాడేవాడు. స్టేషనులో ఉన్నా ఏదో ఒకటి పాడుతుండేవాడు. మధ్యమధ్య హరికథలు చెప్పేవాడు. మంచి కంఠం. జనంకూడా ఎక్కువగా వచ్చేవారు. మధ్యమధ్య భగవంతుని నమ్ముకోండి అని చెప్పేవాడేగానీ ఆ ఫకీరు దగ్గరకుమాత్రం పోకండని చెప్పేవాడు. ఈ వార్త బాబాకు తెలిసిపోయింది. 'స్వామీ! దాస్‌గణు యీవిధంగా అంటున్నాడు, చాలా కష్టంగా ఉంది వినేటందుకు'. ప్రతిఒక్కరు కోపర్గాం మీదుగానే రావాలి. ఇలా చెబుతుంటే వచ్చేవారి మనసు కలతచెందుతూ వచ్చింది.

ఒకసారి షిరిడీలో శ్రీరామనవమి, ముస్లిముల బక్రీద్‌పండగ రెండూ జరిగాయి ఒకరోజు. ఈ ఫంక్షనుకు దాస్‌గణు కోపర్గాంనుండి డ్యూటీపై వేశారు. అప్పుడు బాబాకు ఊరేగింపు ఉండేది. పల్లకీపై కూర్చోబెట్టి తీసుకుపోయేవారు భక్తులు. వచ్చాడు దాస్‌గణు. దూరంగా నిల్చుకున్నాడు. బాబా చూచారు. 'దాస్‌గణూ! ఆవో! ఆవో!' అని పిల్చేసరికి కంపించిపోయాడు. ఎందుకంటే గిల్టీకాంక్షస్. పూర్వం బాబాను తిడుతూ ఉండేవాడు. 'భయపడవద్దు. నేను ఫకీరును. నా దగ్గరకు యింతమంది పిచ్చిపట్టి వస్తున్నారు. నీకూ పిచ్చిపట్టి వచ్చావా?' అన్నాడు. పల్లకీ పైనుండే కట్టె విసిరాడు. 'సైతాన్! నాలుక ఉందని యిష్టము వచ్చినట్లు మాట్లాడటమా?



నాలుక మంచి మాటలు ఉచ్చరించేటందులకు. నాలుక అపవిత్రమైన మాటలకు ఉపయోగపెడుతున్నావా? ఇది పోలీసు డ్యూటీ కాదు. విరుద్ధంగా ప్రవర్తిస్తున్నావు' అని గట్టిగా తిట్టాడు. అందరికీ తెలిసిపోయింది దాస్‌గణును తిడుతున్నాడని. దాస్‌గణుకు కూడా కోపం వస్తున్నాది. 'ఇంతమందిలో తిడుతున్నాడే. వంటరిగా పిలచి చెప్పవచ్చుకదా!' అని అతనికి బాధ కల్గింది. లోపల యిలా తల్చుకుంటుంటే 'వంటరిగా పిలవాలా? ఉండు నిన్ను పల్లకీ ఉత్సవం అయిన తరువాత పిలుస్తాను' అన్నాడు బాబా. ' నేను అనుకున్నాను. అనుకున్నది వెంటనే చెప్పాడు. ఇతను బికారి కాదు' అని అనుకున్నాడు. పల్లకి దిగుతూ నానాకు చెప్పాడు దాస్‌గణును పిలవమని. దాస్‌గణు బూట్లు విప్పి వచ్చాడు. 'నీకు ప్రపంచముతో యేమి పని. ఈనాటినుండి యిక్కడే నిల్చిపో!' అన్నాడు. 'స్వామీ! నాకు డ్యూటీ ఉంది. నాకు ప్రమోషను వస్తుంది' అన్నాడు. 'ప్రమోషను కావాలా?' అడిగాడు బాబా. 'చాలాకాలం పని చేశాను. ప్రమోషనుకి అవకాశం ఉంది' అన్నాడు. అయితే ప్రమోషను వచ్చిన తరువాత వస్తావా?' అడిగాడు బాబా. 'తప్పక వస్తాను' అన్నాడు దాస్‌గణు. 'ప్రామిస్. ఒకేమాట. నేను పంపిస్తాను ప్రమోషను ఆర్డరు' అన్నాడు బాబా.

దాస్‌గణు కోపర్గాం వెళ్ళాడు. మరుసటి వారమే ప్రమోషనుపై ఔరంగాబాద్ వెళ్ళాడు. ప్రమోషను వచ్చింది. ప్రామిస్ మర్చిపోయాడు. తన పనులు చేసుకోటం, పార్టీలకి వెళ్ళటం. కులకర్ణిని పంపించాడు దాస్‌గణు దగ్గరకు. ఈ కులకర్ణి రాయబారము జరిపేవాడు. పూర్వము నానాను పిలవటానికి కులకర్ణియే వెళ్ళాడు. ఇతను పోయి, 'దాస్‌గణూ! బాబా పిలుస్తున్నారు' అన్నాడు. నేను మరచిపోయనా బాబా మరచిపోలేదే అని బాధ పడ్డాడు. 'లీవు తీసుకొని వస్తాను. నేను పనిలో ఉన్నంత వరకు నా డ్యూటీ నేను చక్కగా చేయాలి' అన్నాడు. లీవు తీసుకొని షిరిడీ వచ్చాడు దాస్‌గణు. 'ఏమి చెప్పావు దాస్‌గణు! ప్రమోషను వచ్చిన తరువాత వస్తానన్నావు. ఆరునెలలైంది. ఇక్కడకు రావటానికి ప్రయత్నం చేయలేదు'

అన్నాడు బాబా. 'సామీ! అధికారం కదా! అనుభవించాలని ఉంది యింకా. కొంతకాలం పోయిన తరువాత వస్తాను' అన్నాడు. 'సరే వెళ్ళు' అన్నాడు బాబా. వెళ్ళాడు దాస్‌గణు. అక్కడికి వెళ్ళేటప్పటికి ఎంక్వైరీ వచ్చింది. ఏమిటది? దొంగలు ఎత్తుకుపోయిన సొత్తు చిక్కింది. పోలీసుస్టేషనులో పెట్టారు ఆ సొత్తు.రెండవ దినము ఆ సొత్తు లేదు. ఎక్కడకు పోయింది? దాస్‌గణు పాపం నిరపరాధి. అయినప్పటికీ ఇతనే రెస్పాంసిబుల్ అని యితనిపై ఛార్జి. ఇంతకాలం బ్రతికి పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలనుకుంటే నాకు ఈ అపకీర్తి వచ్చిందా' అని బాధ పడ్డాడు. నిద్ర కాదు మెలకువ కాదు, బాబా మాటలు వినబడ్డాయి. 'యోచన చేస్తున్నావా? మరచిపోయావా? ఇదంతా నేను చేసిన పనే. గౌరవాన్ని నిలుపుకొని మర్యాదగా, చెడ్డ రిమార్కు రాకుండా ఉండాలంటే తెల్లవారి బయలుదేరు'. అతను బయలుదేరి షిరిడీ చేరాడు. పోయన సొత్తు అక్కడే ఉంది. అప్పుడు పోలీసులు షరిడీ వచ్చారు. దాస్‌గణుది తప్పుకాదు. అతను ప్రోమిస్ మరచిపోవటం చేత అతనికి పనిష్మెంటుకోసం కనిపించకుండా చేశాను. నేనే తిరిగి కనిపించేటట్టు చేశాను' అన్నాడు బాబా.

అప్పటినుండి దాస్‌గణు షిరిడీయందే ఉండేవాడు. కవి, గాయకుడు. బాబాను గురించి హరికథలు చెబుతూ పల్లెలంతా తిరిగేవాడు. 82 సంవత్సరములున్నాడు. ఎవరైనా బాబా దగ్గరకు వెడుతుంటే వారినంతా తిడుతూ ఉండేవాడు. ఇప్పుడు అందరినీ బాబా దగ్గరకు రమ్మని కోరుతూ వచ్చాడు. షిరిడీ పోకపోతే పాపము చేసినట్లే. షిరిడీ పోతే జన్మ సార్థకమైపోతుందని, ఇలా హరికథలు చెబుతూ ఈ విషయాలన్నీ చెప్పేవాడు. ఈ ప్రభావము విని అనేకమంది బాబా దగ్గరకు చేరారు.

ఒకనాడు బాబా ఒక మట్టిచెట్టు క్రింద కూర్చున్నాడు. కొంతమంది భక్తులుకూడా ఉన్నారు. ఎవరైనా ప్రశ్నలు వేస్తే జవాబు చెప్పటము, మధ్యమధ్య దాస్‌గణూని పాడమని చెప్పటం. అందరూ నిశ్శబ్దంగా ఉన్నారు.



ఇంతలో ఒక బల్లి అరచింది. అందరూ ఆ శబ్దముపై దృష్టినిలిపారు. అందరూ నిశ్శబ్దంగా ఉండటంచేత చిన్న శబ్దమైనా వినిపించింది. కొందరు అడిగారు, 'స్వామీ! బల్లి శబ్దములో యేదో అంతరార్థము ఉంటున్నాది. బల్లి అరుస్తే మంచా, చెడ్డా?' అని. 'సైతాన్! ఆమాత్రం తెలియదా? ప్రతిదానికీ ఒక అంతరార్థం ఉంటుంది. ఒక కార్యము జరిగినప్పుడు ఉత్సాహం కలుగుతుంది. నీ బిడ్డలు నీ యింటికి వస్తున్నారని వార్త తెలిస్తే నీకెంత సంతోషం అవుతుంది. అట్లనే యీ బల్లి సంతోషంగా ఉంటున్నాది. ఈ సంతోషమునకు కారణం ఏమిటి? ఔరంగాబాద్‌నుండి చెల్లెలు వస్తున్నాది' ఔరంగాబాద్ ఎక్కడ? బల్లికి చెల్లెలు ఎక్కడ. వస్తుందని తెలుస్తే కదా సంతోషంగా ఉంటుంది. అంతలో పటేలు, భార్య టాంగా దిగారు బాబా దర్శనమునకు. ఔరంబాద్‌నుండే వచ్చారు. టాంగా దిగి గుఱ్ఱమునకు దాణా వేయాలని సంచీ తీసాడు. దానిలో బల్లి ఉంది. ఆది పాకి ఆ బల్లి దగ్గరకు పోయింది. రెండూ ఆనందపడ్డాయి. 'చూచారా వాటిని'. దాస్‌గణుకు ఈ సంఘటన పూర్తి మార్పు తీసుకువచ్చింది. దైవమునకు తప్ప యెవరికీ యిటువంటివి అర్థము కావు. బాబాకు బల్లి బాషేకాదు అన్ని బాషలు తెలుసునని అక్కడ హరికథ ప్రారంభించాడు. 'మీ చరిత్ర హరికథగా వ్రాయాలి. ఎక్కడ పుట్టారు? తల్లిదండ్రులెవరు? ఎక్కడ పెరిగారు?' అని అడుగుతూ వచ్చాడు దాస్‌గణు. 'నాకు పుట్టుక లేదురా దాస్‌గణు. నా పేరు బాబాయే. నేను దేవునినుండి వచ్చానేగానీ పుట్టలేద'న్నాడు బాబా. ఈవిధంగా జవాబు చెబుతే ఎవరికీ అర్థం కాదు. ఒకసారిమాత్రం దస్‌గణును పిల్చి చెవిలో చెప్పాడు, 'పత్రిగ్రామ సముద్భూతం ద్వారకామాయి వాసినం' అప్పుడు అతనికి, అందరికీ బాబా పత్రిలో పుట్టాడని తెలిసింది.

# భక్తాభీష్ట వరప్రదాయి

షిరిడీ దగ్గర నాందేడ్ అనే గ్రామమునుండి ఒక భక్తుడు వచ్చాడు బాబా దగ్గరికి. అతను గొప్ప శ్రీమంతుడే. వాడియా అతని పేరు. అతను షిరిడీ పోవాలని ఎంతోకాలంగా ప్రయత్నంచేస్తున్నాడు. అతనికి దాస్‌గణు చాలా స్నేహితుడు. దాస్‌గణు దగ్గరకు వెళ్ళి, 'నేను షిరిడీ పోవాలనుకుంటున్నాను. ఏవిధంగా పోవాలి? ఇది ప్రథమం షిరిడీ పోవాలనే సంకల్పం నాకు రావటము. నాకు బిడ్డలు లేరు. కావలసినంత ధనము ఉంటున్నాది. నీ గైడెన్సు కావాలి' అన్నాడు.

అదే గ్రామములో చాలా పవిత్రమైన హృదయము గలవాడు, కష్టపడి పనిచేసేవాడు, సాధుహృదయుడు ఉండేవాడు. గ్రామములోని వారందరు అతనిని కూలిస్వామి అని పిల్చేవారు. అతను కూలిపని చేసి బ్రతికేవాడు. అందరికీ మంచి బోధ చేసేవాడు. ఆచరించి బోధించేవాడు. ఈ కూలిస్వామి ఒక గట్టు క్రింద పడుకున్నాడు ఒకరోజు. ఎవరు అతనిని మాట్లాడించటం లేదు. ఈ వాడియా టాంగాలో ఆదారిన పోతూ చూచాడు. అతను చాలా బలహీనముగా ఉంటున్నాడు. బిడ్డలు లేరు కనుక, వాడియాకు దయాదాక్షిణ్యములుంటున్నాయి. ఒక హోటలువానికి చెప్పాడు. ఇతనికి యేమి కావాలో ఆ తిండి పెట్టమని. సరే పెట్టారు. తిని ఆ కూలిస్వామి భగవంతునికి కృతజ్ఞతలు చెప్పాడు. దిక్కులేనివానికి దేవుడే దిక్కు



**అడవులందున్న ఆకాశమున నున్న**
**పట్టణముననున్న పల్లెనున్న**
**గుట్టమీదనున్న నట్టేటనున్నను**
**దిక్కులేనివానికి దిక్కు హరియె!**

అనుకున్నాడు తనలోతాను. పెట్టినవానికి కృతజ్ఞతలు చెప్పాడు. దాస్‌గణు చెప్పిన తరువాత వాడియా షిరిడీ ప్రయాణమయ్యాడు భార్యను తీసుకొని. బాబా దర్శనము చేసుకున్నాడు. 'ఏయ్! ఐదు రూపాయలు దక్షిణ యియ్యి' అడిగాడు బాబా. ఇతను శ్రీమంతుడే. ఏమీ వెనుకంజవేయలేదు. తీసాడు. అంతా నాణెములు. మంచి లాంగ్‌కోటు వేసుకున్నాడు. కోటుజేబునుండి కాసులు తీసాడు. అప్పుడు బాబా, 'వాడియా! ఇప్పుడు ఐదు కాసులు అక్కరలేదు. ఒక రూపాయి రెండణాలు యియ్యి. మూడు రూపాయల పదునాల్గణాలు ముందే యిచ్చావు' అన్నాడు. ఇతనికేమీ అర్థము కాలేదు. 'ఇదే నేను ప్రథమముగా షిరిడీ రావటము. నేను బాబాను చూడటమే మొటిసారి. అలాంటి సమయంలో మూడురూపాయల పదునాల్గణాలు ముందుగానే యిచ్చానంటున్నాడే. ఇదెలా సాధ్యం?' అనుకున్నాడు. సరేలే పోనీ దర్శనము అయిందికదాయని ఒకరూపాయి రెండణాలు యిచ్చాడు. తిరిగి నాందేడ్ వెళ్లాడు.

రెండవదినము దాస్‌గణు వచ్చాడు. 'షిరిడీ పోయావుకదా! ఏమి జరిగింది?' అని అడిగాడు. వాడియా అంత తృప్తిగా లేదు. 'దాస్‌గణు! నాకు అతను మహనీయునివలె కనిపించటంలేదు. ఏదో పిచ్చివానివలె ఉన్నాడు. ఆ పిచ్చిమనిషిలోకూడా ఒకవిధమైన భగవత్ శక్తి ఉండవచ్చు. కానీ నేను అతనిని ఎక్కువగా గౌరవించలేదు' అన్నాడు. ఏమిజరిగిందో చెప్పమన్నాడు దాస్‌గణు. 'నేను వెళ్ళిన తక్షణమే ఐదురూపాయలిమ్మన్నాడు దక్షిణ. ఇస్తుండగనే మూడురూపాయల పదునాల్గణాలు ముందుగానే యిచ్చావు, యిప్పుడు ఒకరూపాయ రెండణాలు యమ్మన్నాడు. ఇంతకుముందు నేను ఎప్పుడు చూడలేదు. ఎందుకీవిధంగా అన్నాడు'. దాస్‌గణు మహాభక్తుడు.

బాబా ఎప్పుడు లేనివి పలుకరు. సర్వత్రా, సర్వులయందు ఉండేవాడు బాబా. అలాంటి బాబా యిలా చెప్పారంటే అది తప్పక నిజమై ఉంటుంది. నీవే పొరపడుతున్నావు. నీదే దోషముగానీ బాబాలో దోషము లేదు. ఈమధ్య నీవు ఎవరికైనా దానమో, ధర్మమో చేశావా?' అని అడిగాడు దాస్‌గణు. షిరిడీపోయే మడుదినముల ముందుగా నేను టాంగాలో వస్తుంటే కూలిస్వాముకి హొటలులో అన్నం పెట్టించాను. అంతే తప్ప నేను ఎవరికీ దానధర్మములు చేయలేదు' అన్నాడు. 'అయితే దానికి ఎంత ఖర్చైంది?' అడిగాడు. వెంటనే జవానుని పిలిపించి అడిగాడు. మూడు రూపాయల పదునాల్గణాలైందన్నాడు. 'చూసావా! ఆ మూడు రూపాయల పదునాల్గణాలు నీవు బాబాకే యిచ్చినట్లు. బాబాసంకల్పము లేనిదే ఏదీ జరగదు. అందరియందు భగవంతుడున్నాడు. నీవు ఏది చేసినా భగవంతునికి చేసినట్లే. ఇదే భారతీయ సంస్కృతియొక్క ప్రధాన సూత్రము. అన్ని మతములు దానిని అంగీకరిస్తూ వచ్చాయి. అతనికిచ్చిన మూడు రూపాయల పదునాల్గణాలు బాబాకు చేరాయి. అతను అడిగిన ఐదురూపాయలలో మిగిలిన రూపాయి రెండణాలు తీసుకున్నాడు. భగవంతుని లీలలు ఈవిధంగా ఉంటాయి. నీవు బాబాను యింకొక రీతిగా భావించవద్దు' అనేటప్పటికి వాడియాకు గొప్ప ఆశ్చర్యము వేసింది. 'నా బుద్ధితక్కువతనం చేత ఈవిధంగా భావించాను' అనుకున్నాడు.

రెండవదినమే భార్యతోను, దాస్‌గణుతోను షిరిడీ వెళ్ళాడు. దాస్‌గణు ముందర మసీదుకు వెళ్ళాడు. భార్యతో వెళ్ళంటం వలన వాడియాకు కొంచెం ఆలస్యమైంది. ఒంటరిగా ఉంటే సరాసరి పోవచ్చు. ఆడవారుంటే బంధనే. నిదానమవుతుంది ప్రయాణం. 'ఏమి దాస్‌గణా! ఏమి చెప్పాడు వాడియా? కూలిస్వామికి యెంత యిచ్చాడు? ' ఇవన్నీ అడిగాడు బాబా. అప్పుడే అక్కడికి చేరుకున్న వాడియా విన్నాడు. తక్షణమే 'బాబా నన్ను క్షమించు' అని పాదములపై పడ్డాడు. వాడియా పెద్దబుట్టెడు పండ్లు



తీసుకువెళ్లాడు. అందులో నాలుగు అరటిపండ్లు తీసారు బాబా. వాడియా భార్యను పిలచి నాలుగు యిచ్చారు. ఆనాటి స్త్రీలు చేతులతో తీసుకునేవారు కాదు. ఒడిని పట్టేవారు. చీరకొంగులో నాలుగు పండ్లు వేశారు. 'ఈ నాలుగు నీవే తినాలి. ఇంకెవ్వరికీ యివ్వకూడదు. నీకు నలుగురు పుత్రులు పుడతారు' అన్నాడు. అంతకుపూర్వం వాడియా జ్యోతిష్కుల దగ్గరకు పోయి డబ్బు ఖర్చు చేశాడు. ఎవరి మాటలు నిజం కాలేదు. కట్టకడపటికి బాబా తనకు నల్గురు పుత్రులు కల్గుతారని చెప్పాడు. ఆ రెండవ సంవత్సరము పండువంటి కుమారుడు పుట్టాడు. కుమారుని తీసుకువెళ్ళి బాబా పాదములపై పెట్టి ఆశీర్వాదం పొందారు. ఆనాడు బాబా దగ్గరకు వచ్చే భక్తులకు యేమీ వసతులు లేవు. అందువల్ల వాడియా సత్రం కట్టాడు. ఇప్పుడది చాలా పాతబడిపోయింది.

# సాయీశ్వరస్సర్వభూతానాం

బాంద్రా గ్రామములో హేమాద్రిపంతు అనే పరమ భక్తుడుండేవాడు. అతని పేరు అన్నాసాహెబు. అన్నాసాహెబు ఎప్పుడూ బాబా, బాబా, బాబా అంటూ బాబానే చింతిస్తూ ఉండేవాడు. ఒకనాడతను పండుకున్నాడు. మూడుగంటలకు లేచాడు. పెద్ద ఆజానుబాహుడు వచ్చినట్లు కనిపించింది. చూచాడు. తలుపులు తెరచి ఉన్నాయి. అన్నాసాహెబు వీపు తట్టాడు. 'సాబ్! రేపటిదినము మీ యింటికి భోజనమునకు వస్తున్నాను' అన్నాడు. స్వప్నమా లేక యదార్థమా అని కొంతవరకు యోచన చేశాడు. స్వప్నము కాదు. నా బాబాయే నా దగ్గరకు వచ్చాడు. రేపు నాయింటికి భోజనమునకు వస్తాడుట అని అప్పటినుండియే రేపటిదినము బాబా నాయింటికి భోజనమునకు వస్తాడని ఒకే ఆనందంపడిపోతున్నాడు. ఈ అరుపులు, కేకలు వినింది భార్య. 'ఏమండీ! మీకు స్వప్నమా? గిలియా? ఎందుకింత అవస్థ పడుతున్నారు?' అని అడిగింది. ఇదంతా చెప్పాడు భర్త. 'ఇది కేవలం స్వప్నంలా ఉంది. మూడు గంటలప్పుడు బాబా యిక్కడకు రావటమేమిటి? షిరిడీ ఎక్కడ? బాంద్రా ఎక్కడ? అంతా మీ భ్రమయే' అంది భార్య. అతనికి బాబా తత్త్వం తెలుసు. చెప్పాడు, ' పిచ్చిదానా! భగవంతునికి దూరము దగ్గర లేదు. సర్వత్రా ఉన్న భగవంతునికి రావటం పోవటం ఎక్కడ? భగవంతునిది రాకపోకలు లేని స్వరూపమే. ఎక్కడ ఎవరికి ప్రాప్తో అక్కడే వారికి కనిపిస్తాడు. ఎక్కడ ఎవరికి ప్రాప్తి లేదో



వారికి కనిపించడు. అది వారి వారి ప్రాప్తానుసారం నడుస్తుంది. బాబా రేపటిదినం మన యింటికి వస్తాడు. తప్పక తెల్లవారి లేస్తూనే తగిన వంటకములు చేయాలి ' అన్నాడు. 'వస్తే అంతకంటె అదృష్టమా?' అంది భార్య. తెల్లవారి లేచింది. ఇల్లంతా కడిగింది. పాత్రలంతా శుభ్రం చేసింది. ప్రత్యేకంగా వంటలంతా వండింది. పాయసము వండింది. మరొక స్వీటు చేసింది. వడలు చేసింది. బాబా వస్తాడు. భోజన సమయానికి కాచుకొని ఉంటున్నారు. చక్కని పూలతోరణాలు, మామిడాకులు కట్టింది.

పన్నెండు గంటలైంది. బాబా రాలేదు. వచ్చే సూచనలు కనిపించటం లేదు. అన్నివైపులా చూస్తున్నాడు.' బాబా ఎందుకు రాలేదో! బాబా ఆడిన మాట తప్పరు. అతను సర్వస్వరూపుడు. అతడే సత్యనారాయణుడు. అతనికంటె సత్యము వేరు లేదు. వచ్చేతీరుతాడు. బాబా యిచ్చిన మాట తప్పడు' అని భార్యకు నచ్చచెబుతున్నాడు. సరే రెండు గంటలైంది. వచ్చే జాడలు కనిపించ లేదు. సరే యింకేమి చేసేదని అనుకున్నారు. ముందు గదినుండి యిద్దరు ముస్లిములు వచ్చారు. 'ఏమండీ! అన్నాసాహెబ్! మీరు తొందరలో ఉంటున్నారు. బంధువులు వచ్చినట్లున్నారు. భోజనాలు రెడీ చేసుకుంటున్నారు. ఇప్పుడు మాట్లాడటానికి వీలు లేదు. మీ పని మీరు చూసుకోండి. ఇదిగో ప్యాకెట్టు. తీసుకోండి!' అన్నారు. ప్యాకెట్టు తీసుకున్నాడు. విప్పి చూసాడు. చూస్తే బాబా ఫొటో. 'బాబా! నీవు యీ రూపకంగా వచ్చావా మా యింటికి!' ఫొటోనే గట్టిగా హత్తుకున్నాడు. భక్తి అంత పిచ్చిగా ఉంటుంది. పిచ్చిని పట్టించు, పిచ్చిని పోగొట్టు సచ్చిదానంద శ్రీసాయిబాబా. బాబా ఎందుకీవిధముగా పిచ్చి పట్టిస్తున్నాడు? ప్రపంచపు పిచ్చి (భ్రమ) పోగొడతాడు. తన పిచ్చిని (భక్తి) పట్టిస్తాడు. ఆ ఫొటోను తీసుకొని ఆకుముందు పెట్టాడు. 'బాబా! నీవు భోజనం చేయాలి. ఈరూపంగా వచ్చావు' అని ప్రార్థించాడు. ఆ ఫొటోనిలవటానికి వీలులేదే. ఒక టంబ్లరును నిలబెట్టాడు ఫొటో వెనుక. 'కన్నీరు తెప్పించు కన్నీరు తప్పించు చిన్మయమూర్తి చిన్నిబాబా'. లోకసంబంధమైన కంటినీరు తుడిచివేస్తాడు. తననిమిత్తమై

కంటినీరు తెప్పిస్తాడు. 'బాబా! నీవు భుజించి తీరాలన్నాడు'. కన్నులు మూసుకొని ప్రార్థిస్తున్నాడు. ఆ తట్టలోనున్న ఒక వడ లేదు. అన్నమంతా కుప్పమాదిరి వడ్డించింది. అది చెదరిపోయి చేతి వేళ్లు కనిపిస్తున్నాయి. బాబా తిన్నాడు అని ఆ అన్నమంతా తానే తిన్నాడు బాబా ప్రసాదమని. ఆనాటి పరిస్థితులకు ఆనాటి చర్యలు. భక్తులకు తృప్తిగా ఉండేది. బాబా వస్తానని చెప్పిన తరువాత ఏదో ఒక రూపములో వచ్చేవాడు. భగవంతుడు సర్వస్వరూపుడనటానికి కారణం ఏమిటి? కుక్కగా వచ్చి భోజనం చేసేవాడు. పక్కింటి ఎనుముగా వచ్చి ఆకులో ఉండేది తినేవాడు. పిల్లిగా వచ్చి తినేవాడు.

ఇప్పుడు అట్లాకాదు. వస్తాను మీ యింటికి అంటే ప్రత్యక్షముగా వస్తాను. భోజనం చేసి పోతాను. బొంబాయికి వెళ్ళినప్పుడు మీ యింటికి వస్తానని చెప్పి తప్పక వెడుతున్నాను. ఎందుకోసం? ఆనాటి భావముయెక్క ప్రభావము, ఈనాటి భావముయెక్క ప్రభావము వేరు. ఆనాడు పూర్తి విశ్వాసము ఉండేది. ఆనాడు పూర్తి ప్రేమతోనే మునిగేది. ఈనాటి విశ్వాసము పార్ట్‌టైమ్. కొంతసేపు ఆనందంగా ఉంటుంది. తరువాత వస్తారోరారో ఏదో తృప్తికోసం చెప్పారోయేమో. అనేక సందేహాలు వస్తుంటాయి. సందేహాలకు అవకాశం యివ్వకూడదు. పూర్ణవిశ్వాసముతో ఉండినప్పుడు తప్పక ఆమాట జరుగుతుంది. అదే దైవవాక్కు. అదే అమృతవాణి. అదే దివ్యవాణి. ఎప్పటికీ తప్పేది కాదు. కానీ మీ విశ్వాసములో ఉండే లోపము వలన అది తప్పిపోతుంటుంది. 'యద్భావం తద్భవతి' మీరు ఆ విశ్వాసము ధృడంగా పెట్టుకోండి. ఎన్ని పరిస్థితులు అడ్డుతగిలినా విశ్వాసము మార్చుకోకండి. ఏవిధములైన కష్టములొచ్చిపడినా సరే భగవంతుని విశ్వాసము వదలకుండా ఉండాలి. మీ శ్వాస ఎట్లా జరుగుతున్నాదో అట్లానే విశ్వాసము కూడా.

షిరిడీయందు మాటలు చెప్పటముగానీ, రూపముతో రాకుండా యింకొక రూపములో రావటం వల్ల ఈ అంతరార్థము గుర్తించుకోలేని కొంతమంది, 'బాబా! మీరు వస్తారని కాచుకొని ఉన్నామే! మమ్మల్ని



ఎందుకింత నిరాశపరిచారు. ఎందుకు కష్టపెట్టారు? మేము ఏమి పాపము చేశాము' అని వారు బాధపడేవారు. 'వచ్చాను నల్లకుక్క రూపంలో వచ్చాను'. అనగా ఏమిటి? అన్ని జీవులయందు భగవంతుడు ఉన్నాడనేది భారతీయ సంస్కృతి. చూడండి! ఎలుక యింట్లో ఉంటే బోను పెట్టి పట్టేస్తాము. అదే వినాయకుని క్రింద ఉంటే దానికి కూడా నమస్కారము చేస్తాము మనము. దైవసన్నిధిలో ఉండిన ప్రతిదానికి నమస్కార అర్హత వస్తుంది. పాములు బయట కనిపిస్తే కొడతాము. కానీ అదే సర్పము ఈశ్వరుని ఆభరణముగా ఉంటున్నప్పుడు నమస్కారము చేస్తాము. సన్నిధి పట్టి పెన్నిధి దొరుకుతుంది. సమీపత్వాన్ని పురస్కరించుకొని గౌరవమర్యాదలు లభిస్తుంటాయి. సన్నిధి దూరమైతే ముఖము చూచేవారుండరు. సర్వత్రా మనము భగవంతుని సన్నిధియందే ఉంటున్నాము. ఎటుచూచినా భగవత్తత్వమే. ఎక్కడ చూచినా భగవత్త్వమే. రాకపోకలు లేని తత్వము భగవత్తత్వము.

దహను గ్రామములో ఉండే మమలతదారుడు దేవ్. తల్లిని సంతృప్తిపరచాలని వ్రతమునకు ఒప్పుకున్నాడు. బాబా దగ్గరకు వచ్చి, 'మా జీవితములో ఇదే గొప్ప వ్రతము. మా వ్రతములో మా ప్రత్యక్షదైవముగా విశ్వసించిన మీరు ఆగమిస్తే యింతకంటె స్వర్గము, మోక్షము మాకు అక్కరలేదు. ఆనాడు వచ్చి మా ఆతిథ్యము స్వీకరించాలి'. దానికి తగినట్లుగా దేవ్ అన్ని యేర్పాట్లు గావించాడు. బాబా, 'నేను తప్పక వస్తాను. నాతో యింకా యిద్దరు వస్తారు' అన్నాడు. కానీ పేర్లు చెప్పలేదు. దహను వెళ్ళి అన్ని యేర్పాట్లు చేసుకున్నాడు. ఎప్పుడు వ్రతము దినము వస్తుందా అని నిరీక్షిస్తున్నాడు. బాబా వస్తున్నారని దహనులో అందరికీ చెప్పాడు. అందరూ ఆనందముతో ఉన్నారు.

ఒక పదిదినములకు ముందుగా నరేంద్రనాథఠాకూర్ అను పేరుగలవాడు వచ్చాడు. 'గోసంరక్షణ నిమిత్తము చందా తీసుకోవాలని నేను యీ గ్రామము వచ్చాను. ఎవరైనా యిస్తారా?' అని అడిగాడు.

గ్రామములోనివారు చెప్పారు, ' ఈ గ్రామములో దేవ్ పెద్దవారు. ఆయన పెద్ద కార్యక్రమములో ఉంటున్నారు. కార్యక్రమము జరిగిన తరువాత రండి' అని గ్రామప్రజలు వానిని వెనక్కి పంపించారు. పోయేటప్పుడు దేవ్‌ని చూచి, 'మీరు గొప్ప కార్యక్రమములో ఉన్నారు. ఆశించి వచ్చాము. తిరిగి కొన్ని దినములైన తరువాత వస్తాము' అన్నాడు. సరిగా ఆ వ్రతము సంపూర్ణమైన దినము, సంతర్పణ జరిగే దినమే తిరిగి యిద్దరితో వచ్చాడు ఈ నరేంద్రనాథఠాకూర్. వారే చెప్పారు,' అయ్యా! చందాకోసము మేము రాలేదు. మీరు చేసే వ్రతము చూడాలని వచ్చాము'. అప్పుడు దేవ్ నమస్కారము చేసి, 'మీరుకూడా మాయింట్లో ఆతిథ్యం స్వీకరించాలి' అన్నాడు. 'వ్రతము పన్నెండున్నర గంటలకు పూర్తవుతుంది. నేను పనిలో ఉంటున్నాను. మీరు ఎక్కడుంటారో చెబితే మనిషిని పంపిస్తాను' అన్నాడు దేవ్. అప్పుడు నరేంద్రనాథఠాకూర్ చెప్పాడు,' మీరు యింత కార్యక్రమములో ఉండి మాకోసం మనిషిని పంపటం యెందుకు? మేమే పన్నెండున్నరగంటలకు వస్తాము'. ధన్యవాదములు చెప్పాడు దేవ్.

తిరిగి పన్నెండున్నరగంటలకు సరిగా వచ్చారు. అందరూ కూర్చున్నారు. బాబాకోసం కూర్చున్నాడు దేవ్ నీరైనా త్రాగకుండా. బాబా వచ్చిన తరువాత బాబాకు నమస్కారము చేసుకున్న తరువాత నీరు తీసుకోవాలనుకున్నాడు. ఒంటిగంట అయింది. సాయంకాలము నాలుగైంది. రాత్రి పదిగంటలైంది. బాబా రాలేదు. దేవ్‌కి కోపం వచ్చింది. దైవసమానంగా మేము పూజిస్తున్నాము. అబద్ధం చెప్పి వయస్సు అయిన తల్లిని యింత నిరాశ పర్చవచ్చునా! బాబా అబద్ధమాడి మమ్మల్ని యీవిధముగా మోసము చేయవచ్చునా! ఈవిధంగా నోటికి వచ్చినట్లు అనుకున్నాడు. ఇంక బాబా రాడని తల్లి భోజనము చేసింది.

వారమైన తరువాత షిరిడీకి పోయాడు దేవ్. చాలా కోపంగా ఉన్నాడు. కాళ్లు గట్టిగా పట్టుకొని అడగాలని పోయాడు. ఇంతపెద్దవాడైపోయి



అబద్ధాలు చెప్పి నా మనస్సు బాధపెట్టడం సరైంది కాదనుకొన్నాడు. దేవ్ దూరంగా కనబడ్డాడు. దాస్‌గణు, తాత్యా, నానా, శ్యాం ఉన్నారు. వారితో చెబుతున్నాడు బాబా, ' దేవ్ నాతో యుద్ధము చేయటానికి వస్తున్నాడు. మీరందరూ సిద్ధంగా ఉండండి. నేను వాదన చేస్తాను. నా దగ్గరకూడా మంచి అస్త్రాలున్నాయి' అన్నాడు. దేవ్‌కి కోపము ఒకవైపున, భక్తి మరొకవైపున ఉంటున్నాయి. పాదములపై పడి యేడ్చాడు. 'నేను భక్తుడను. ప్రజలు నేను చెప్పింది అబద్ధమా లేక బాబా చెప్పింది అబద్ధమా అని అనేకరకములుగా హేళన చేస్తున్నారు. వృద్ధురాలైన నా తల్లి మనస్సు చాలా బాధపెట్టారు. అది మరింత నన్ను బాధపెడున్నది. ఎందుకు అబద్ధాలు ఆడాలి?' 'దేవ్! నాకు అబద్ధాలు ఆడవలసిన అవసరము లేదు. ఏనాడూ యింత వయస్సు వచ్చినా అబద్ధం చెప్పలేదు. సత్యము గుర్తించుకునే తెలివితేటలు నీకు లేవు. నీ లోటు కావలసినంత ఉంచుకొని నేను అసత్యము చెప్పానని నాతో పోట్లాడటానికి వచ్చావా? నేను చెప్పినది చెప్పినట్లు చేస్తాను' అన్నాడు బాబా. ' భోజనానికి వస్తానని రాలేదే? ఇద్దరితో వస్తానన్నారు. మీరైనా వచ్చి భోజనం చేయకూడదా?' అని అడిగాడు దేవ్. ' గోసంరక్షణ చందా వసూలు చేయటానికి వచ్చిన ఠాకూర్ ఎవరనుకున్నావు? నీవే ఆహ్వానించావు భోజనానికి రమ్మని. తిరిగి మమ్మల్ని ఆహ్వానము చేయనక్కరలేదు పన్నెండున్నర గంటలకు వస్తామని చెప్పి, వచ్చి భోజనము చేశాము' అని అక్కడ జరిగినవన్నీ చెప్పాడు. 'బాబారూపములోనే వస్తారనుకున్నాను. నా బుద్ధి ఆవిధంగా పోయింది. ప్రజ్ఞానం లేకుండా పోయింది!' 'అన్ని రూపములు నావే. కేవలం యీ సంకుచితమైన రూపమును బట్టి బాబా అనుకుంటున్నావా? నీది సంకుచితమైన బుద్ధి. నాది కాదు. నాకు విశాలమైన భావములే వస్తాయి' అని చెప్పాడు బాబా.

ప్రక్కన తాత్యా, దస్‌గణు హెల్పుగా ఉన్నారు. నాకు యిలా అనేక పర్యాయములు అయ్యాయి. నాకు అబద్ధం చెప్పాడు బాబా. నేను, నాభార్య షిరిడీలోనే ఉన్నాము. నాభార్య గురువారము పోళీలు మీకు యిష్టముకదా

బాబా వండుతాను, యీనాడు మా యింటికి రమ్మంది. 'అయ్యో, నాకు చాలా యిష్టం పోళీలు. తప్పక వస్తానమ్మా!' అన్నాడు. ఆమె పోళీలు చేసింది. ఇల్లు శుభ్రం చేసుకుని అన్నీ సిద్ధం చేసుకున్నారు. చెప్పిన కాలానికి రాలేదు బాబా. ఎక్కడికైనా వెడితే బాబా వస్తారోమోనని ఎవరూ కదలలేదు. కాచుకున్నారు. తాత్యా, భార్య బాబా ఫొటో దగ్గర ప్రార్థన చేస్తున్నారు. ఈలోపల ఒక నల్లకుక్క వచ్చి తట్టలోని పోళీ తింది. పరుగెత్తి ఆమె యినుపకడ్డీతో కొట్టింది. 'బాబాకోసం చేస్తే ఈ పాడు కుక్క ఎక్కడనుండి వచ్చింది? గోవుకైనా అర్పితము చేయవచ్చు. ఈపాడు కుక్క తాకిందే' అని చాలా బాధపడింది. సరే అయిపోయింది. ఈనాటికింతే ప్రాప్తి అనుకుంది. రెండవ దినము, 'బాబా ఎందుకు అబద్ధము చెప్పి మా మనస్సు కష్టపెట్టారు?' అడిగింది. 'నేను అబద్ధము చెప్పలేదు. నేను వచ్చాను. నేను ఒక పోళీ తిన్నాను. కానీ నీవే నన్ను యినుపకడ్డీతో కొట్టావు. దోషము నీదా, నాదా? ఆహ్వానము చేసి తిరిగి పట్టుకొని కొట్టటము ఎంత దోషము?' అన్నాడు బాబా. 'ఎప్పుడు వచ్చారు? కనిపించలేదే? ఏరూపములో వచ్చారు?' 'ఆ నల్లకుక్క ఎవరు? డాగ్ అనుకుంటున్నావు. కాదుకాదు. అది గాడ్. నేనే వచ్చి ఆరూపంలో తీసుకున్నాను'. ఈవిధంగా చెప్పేటప్పటికి ఆమె బాధపడింది. 'బాబా ఏరూపములో వస్తారో ఏమిటో. ఈరూపము కోసమని కాచుకున్నాము' అని తాత్యా బాధ పడ్డాడు. అప్పుడు బాబా, 'మీరు సంకుచితమైన భావాలు పెట్టుకుంటున్నారు. ఈ రూపము, ఈ నామము యిదే నిజమైనదని, యితర నామములు, యితర రూపములు దైవము కాదని చెబుతున్నారు. ఏకాత్మా సర్వ భూతాంతరాత్మా. అన్ని భూతములందు ఉన్నది ఒకే ఆత్మ. ఏ రూపములో వస్తాడో భగవంతుడు. ఆ సమయమునకు ఎవరు వచ్చినా దైవముగా చూడాలి. భోజనం చేసే సమయంలో ఎవరు వచ్చినా వారు దైవసమానులని మొట్టమొదట వారికి పెట్టి మనం తినాలి'.

లక్ష్మీబాయిషిండే గొప్ప శ్రీమంతురాలు. అయినప్పటికీ ఆమె బాబా



ఉండే ప్రదేశాన్ని ఊడ్చి శుభ్రం చేసేది. ఒకనాడు అవకాశం చిక్కినప్పుడు ఆమె బాబా పాదములపై పడి నమస్కారం చేసింది. ' లక్ష్మీబాయి! నాకు చాలా ఆకలిగా ఉంది' అన్నాడు బాబా. అడుగని ఫొటోకు ప్రతిరోజూ నైవేద్యము పెడుతున్నాముగానీ అడిగిన భగవంతునికి వెంటనే పెట్టటానికి నావద్ద యేమీలేదే' అని చింతించి బాబాతో కొంచెముసేపు ఉండమని ఇంటికి పరుగెత్తి వెళ్ళింది. త్వరగా చపాతీలు చేసింది. అప్పుడు బాబా బాగా తినేవాడు. ఒక్కొక్క చపాతీని నాలుగు మడతలు వేసి ఒక్కతూరి నోట్లో పెట్టుకొనేవాడు. లక్ష్మీబాయి ప్లేటులో చాలా చపాతీలను పెట్టుకొని వచ్చింది. వాటిని చూచి బాబా, 'ఆహా! చాలా బాగున్నాయి' అన్నాడు. ఇంతలో ఒక నల్లకుక్క తోకాడించుకుంటూ వచ్చింది. బాబా దానిని దగ్గరకు పిలచి తల నిమురుతుంటే అది అన్ని చపాతీలు తినేసింది. ఈ దృశ్యము చూచింది లక్ష్మీబాయి. 'బాబా! ఇదేనా మీరు చేసే పని. ఆకలి, ఆకలి అన్నారు. సాక్షాత్తూ భగవంతుడు నోరుతెరచి అడిగాడని ఎంతో ఆప్యాయంగా భక్తిశ్రద్ధలతో చపాతీలను చేసుకువస్తే వాటిని నా కళ్ల ఎదురుగానే కుక్కకు పెడుతున్నావు. నేను ఏమి పాపం చేశాను?' అని బాధపడింది. 'లక్ష్మీబాయి నీవు తెచ్చిన చపాతీలను నేనే తిన్నాను. నా కడుపు నిండింది అన్నాడు. 'బాబా! ఆ కుక్కకు పెడుతుంటే కళ్లారా చూచాను. ఇప్పుడు మీరు తిన్నారంటే ఎలా నమ్మేది?' అన్నది. అప్పుడు బాబా చెప్పాడు, 'మానవుడు ఆకలైతే అడుగుతాడు. కానీ పశుపక్షిమృగాదులు అడగలేవు. వాటికి కూడా ఆకలి ఉన్నదికదా! బాబా అంటే ఈదేహము ఒక్కటేయని నీవు భావించవద్దు. ఆ కుక్క బాబాయే. సర్వ జీవులూ బాబా స్వరూపాలే. అన్నింటియందున్న బాబాను నీవు సంకుచితంగా భావించటంచేత నన్నీవిధంగా అడగటానికి పూనుకున్నావు. విశాల భావాన్ని పెంచుకోవాలి' అన్నాడు.

భగవద్గీతయందు 'బీజంమాం సర్వభూతానాం' అన్నాడు కృష్ణుడు. సర్వ భూతములందున్న విత్తనము నేనే. లక్ష్మీబాయి బాబాకోసం తెచ్చిన

చపాతీలు కుక్క తిన్నది. కానీ 'బాబా నేనే తిన్నాను' అన్నాడు. దీని అర్థము ఏమిటి? భగవంతునికి ఎట్టి బేధము లేదు. రూపనామములు వేరుగానీ దైవత్వము ఒక్కటే. అయితే రూపమునకు తగినట్లు నటించవలసి వస్తుంది. నాగయ్య త్యాగయ్య వేషము వేసినప్పుడు త్యాగయ్య వలె నటించాలి. కానీ త్యాగయ్య వేషం వేసి నాగయ్య వలె నటిస్తే రాళ్లు పడతాయి. స్టేజిపైన త్యాగయ్య, స్టేజి వెనుక నాగయ్య. అట్లే ప్రకృతి దృష్టిలో మీరు ప్రత్యేకమైనవారేగానీ ఈ ప్రకృతికి అతీతమైనప్పుడు మీరూ నేను ఒక్కటే.



# సంపూర్ణ శరణాగతి

ఈనాటి ప్రపంచములో జయమునకు అపజయమునకు వారివారి విశ్వాసమే మూలకారణము. 'మానవ' అనగా నమ్మకము కలవాడని అర్థము. కానీ అట్టి మానవునియందు ఉండవలసిన ప్రధానమైన నమ్మకము యీనాడు కరవైంది. చిన్నచిన్న విషయములందు కూడా మానవుడు అమితమైన విశ్వాసము కలిగి జీవిస్తున్నాడు. కానీ, ఒక్క ఆధాత్మిక విషయమునందు మాత్రమే యీనాటి మానవునకు అంతటి విశ్వాసము లేకుండా పోతున్నది. ఈనాడు ఒక యింటికి పునాది వేస్తే రెండవ సంవత్సరము దీనిని పూర్తిచేస్తాను అనే నమ్మకము చేతనే ఆ యింటికి పునాది వేస్తున్నాడు మానవుడు. కానీ వచ్చే సంవత్సరము వరకు తాను జీవించగలను అనే విశ్వాసము దానిపై ఉంటున్నాది. ఇట్టి నమ్మకములేని ప్రాకృత విషయములందు మానవుడు అన్నింటినీ విశ్వసిస్తున్నాడు. నిత్యసత్యమైన, దివ్యమైన దైవముపై మాత్రము మానవుడు నమ్మకమును కోల్పోతున్నాడు. నమ్మకము ఉండవలసినది దైవముపైన. ఇవన్నీ లోకసంబంధమైన విషయాలు. కదలిపోయేవి. క్షణభంగురములు. కానీ, నమ్మతగని వాటిపై నమ్మకము పెరుగుతున్నాది. నమ్మతగిన వానిపై నమ్మకము తరుగుతున్నాది. ఈ నమ్మకము లేకపోవటం చేతనే మానవుడు నిత్య జీవితములో అన్నింటియందు అపజయము పొందుతున్నాడు.

పూర్వము షిరిడీయందుండినప్పుడు శివదాస్ అనే విద్యార్థి ఉండేవాడు. బి.ఎ. ప్యాసైయ్యాడు. ఎల్.ఎల్.బి. కి పోవాలని ప్రయత్నంచేశాడు. ఆనాడు లాయర్సు అంటే గొప్ప గౌరవము. వారు చెప్పే ప్రతి పదము సత్యమైనదని, ధర్మమైనదని, న్యాయమైనదని ప్రజలయొక్క విశ్వాసము. ఈనాడు ధర్మము, న్యాయము, నీతి అనేవి అడుగంటిపోయాయి. ధనానికే ప్రధాన గౌరవము. నీతినిజాయతీలకు ప్రాధాన్యత యివ్వలేకపోతున్నారు.

శివదాస్ స్నేహితుడు సపత్నేకర్ అక్కల్‌కోటలో ఉండేవాడు. అతను, ఇతను ఎల్.ఎల్.బి. పరీక్షకు కూర్చున్నారు. శివదాస్‌కు బాబాపై అమిత విశ్వాసము. పరీక్ష వ్రాయుటకు బొంబాయి పోవాలి. షిరిడీ ప్రయాణమయ్యాడు. శివదాస్ షరిడీ చేరాడు. బాబాకు నమస్కరించాడు. కంటిధారలు కార్చుకుంటూ, ' బాబా! మీరు నన్ను క్షమించాలి' అన్నాడు. బాబా చెప్పాడు, ' ఎందుకు నీవు బాధపడుతున్నావు? భయపడకు. పరిపూర్ణమైన విశ్వాసముతో ఒక్కసారి నమస్కారము చేయి. నేను చూసుకుంటాను. తప్పక నీవు ప్యాసౌతావు'. ఆ ఒక్కమాట మాత్రమే తీసుకున్నాడు. బొంబాయి వచ్చాడు. ఇద్దరూ పరీక్షకు కూర్చున్నారు. పరీక్షలైన తరువాత శివదాస్‌ను ప్రశ్నించాడు ఎట్లా వ్రాసావని. ఈనాటి పిల్లలంతా అడుగుతుంటారుకదా ఫలాని ప్రశ్నకు యేమి జవాబు వ్రాసావని. పిల్లలు ఒకరికొకరు చెప్పుకుంటారు. ఒక్కదానికికూడా సరైన జవాబు యివ్వలేదు శివదాస్. 'ఏయ్! నీవు తప్పుతావు' అన్నాడు. 'నేను తప్పక నెగ్గుతాను' అని గట్టిగా చెప్పాడు శివదాస్. 'సరిగా జవాబు వ్రాయనివాడవు ప్యాసౌతానని యేధైర్యముతో చెబుతున్నావు?' 'నేను వ్రాసినా, వ్రాయకపోయినా ప్యాసౌతాను. బాబా పదమే నాకు ప్రధానము. అదే సత్యము. తప్పక ప్యాసు చేస్తారు' అన్నాడు శివదాస్ బాబాపై మంచి నమ్మకముతో. 'తట్టలో పెట్టుకున్న పదార్థము పొట్టలోనికి వస్తుందా? నీవు చేయవలసిన ప్రయత్నం నీవు చేయాలికదా! ఏమీ వ్రాయకుండాపోతే బాబా కూడా నిన్ను ప్యాస్ చేయలేడు. నేను అన్ని ప్రశ్నలకు జవాబులు సరిగా వ్రాసాను. ఫస్టు



క్లాసులో ప్యాసౌతాను. నీకు వచ్చేది జీరోయే' అని హేళన చేశాడు సపత్నేకర్. 'నీవు యేమైనా అనుకో, నాకు జీరో వచ్చినా హీరోగా చేస్తారు బాబా' అని చెప్పాడు శివదాస్. ఇద్దరూ వెళ్లిపోయారు. రిజల్సు వచ్చాయి. శివదాస్ మంచి మార్కులతో నెగ్గాడు. సపత్నేకర్ తప్పాడు. 'అరె! నేను పొరపడ్డాను. అనవసరంగా అన్ని మాట్లాడాను' అని. మరల పరీక్షకు కట్టుకొని నెగ్గాడు సపత్నేకర్.

శివదాస్ శిరిడీ పోయి తాను ప్యాసైనందుకు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. బొంబాయిలో ప్రాక్టీసు పెట్టుకున్నాడు. సపత్నేకర్ కూడా బొంబాయిలోనే ప్రాక్టీసు పెట్టుకున్నాడు. వివాహమైంది. ఒక కుమారుడు పుట్టి రెండు సంవత్సరములు పెరిగి మరణించాడు. పాపం ఒకే కుమారుడు పోయినందుకు చాలా బాధపడ్డాడు. ఆ బాధతో పిచ్చివాడుగా తయారయ్యాడు. ప్రాక్టీసు వదలిపెట్టాడు. 'నా జీవితమే వ్యర్థమైపోయింది. ఎవరికోసం సంపాయించాలి? ఈ సంపాదన ఎవరికివ్వాలి? ఏమీ ప్రయోజనం లేదు' అని విరక్తి చెందాడు. శివదాస్ అతని దగ్గరకు వచ్చి, 'నీవు చాలా పొరపడుతున్నావు. ఒకసారి షిరిడీ పోదాం రా!' అన్నాడు. 'నాకు నమ్మకం లేద'న్నాడు సపత్నేకర్. 'నాకోసమైనా రా' అని బలవంత పెట్టాడు శివదాస్. ధనము యివ్వటము కాదు మైత్రికి విలువ. కష్టములలో తోడ్పడటంకాదు మైత్రికి విలువ. కష్టసమయములందు భగవంతుని చూపించటము, భగవంతుని ప్రేమింపచేయటం ప్రధానమైన ధర్మము. ఎప్పుడూ ఏమిటి ఈ దైవము అనే పిచ్చి. ధనము సంపాదించు. అది మనకు తోడ్పడుతుంది అని భౌతిక, ప్రాకృతిక విషయాలకు ప్రాధాన్యత యిస్తారు యీనాటి మిత్రులు. తాత్కాలికముగా సహాయము చేస్తున్నారేగానీ వానిని లేనిపోని బురదలో నెట్టినట్టవుతుంది. మరిన్ని ఆశలు కల్పించి మోసము చేసినట్టవుతుంది. ధనము, గృహము అన్ని సౌకర్యములు లోకరీతిగా ఉండవలసిందే. కానీ ప్రధానమైన సంపద దైవానుగ్రహమే. శివదాస్ తన మిత్రుని ఒప్పించి బాబా దగ్గరకు తీసుకు వెళ్లాడు. ' పరిపూర్ణ విశ్వాసముతో రా, తప్పక నీకు

అన్ని కష్టాలు తీరుతాయి'అన్నాడు శివదాస్.

మన్మాడ్ స్టేషనులో దిగారు. టాంగాలో యిద్దరూ కూర్చున్నారు. పదిమైళ్లు పోవాలి. షిరిడీ చేరేవరకూ బాబా సమాచారాన్ని శివదాస్ చెబుతూ వచ్చాడు. ' కన్నులు మూసుకుంటే నా కుమారుడే ఎదురుగా కనిపిస్తున్నాడు. నాకెవ్వరూ కనిపించటం లేదు. శివదాస్ నన్ను ఊరికే వేధించకు' అన్నాడు. ' పోయిన కుమారుని నీవు ఎందుకు తలపులో పెట్టుకుంటావు? పుట్టక పూర్వము లేదు. చనిపోయిన తరువాత లేదు. మధ్యలో వచ్చి మధ్యలో పోయాడు. కానీ భగవంతుడు నీవు పుట్టక పూర్వము, నీవు చనిపోయన తరువాత ఉంటాడు. నీవు జీవించినప్పుడు ఉంటాడు. భగవంతుడు త్రికాలములందు ఉంటాడు. ఇవన్నీ వర్తమానములో కనిపించేవేగానీ భూతములో లేవు, భవిష్యత్తులో లేవు. మంచువలె కరగిపోయే వీటికోసం నీవు బాధపడుతున్నావు. ఇవి కేవలం ఎండమావులవంటివి. ఎండమావులను చూచి ఎంత దూరం పోయినా దాహం తీరుతుందా?' అని శివదాస్ బోధ చేస్తూ వచ్చాడు. మెల్లగా కొంచెంకొంచెం ఈ మాటల ప్రభావం పడింది. ఇద్దరూ షిరిడీ చేరారు. చెట్టు క్రింద కూర్చున్నాడు మిత్రుడు. శివదాస్ లోపలికి వెళ్లాడు. నమస్కారం చేసి, ' నేనొక మిత్రుని తెచ్చాను'. 'ఛీ! ఛీ! జావ్ సైతాన్' అన్నాడు బాబా. ఈ కోపము సహజమనుకున్నాడు . తరువాత మిత్రుని తీసుకు వచ్చాడు. చూచాడు బాబా. లేచి కఱ్ఱ తీసుకున్నాడు. బయటకు వెళ్లగొట్టమని గట్టిగా అరిచాడు. భయం వేసింది. సపత్నేకర్‌కు శివదాస్‌పై కోపం వచ్చింది. 'రాను, రాను అని చెప్పాను. ఇంతమందిలో నాకీ అవమానమైంది' అని బయట చెట్టు క్రింద కూర్చున్నాడు. బాబా బయటకు వచ్చి శ్యాంను పంపించాడు వానిని ఊరి పొలిమేరల వరకు తరిమివేయమని. టాంగా ఎక్కి వెళ్లిపోయారు శివదాసు, సపత్నేకర్.

శివదాస్ చాలా బాధ పడ్డాడు. కానీ లోపల కారణం లేనిదే యిలా జరగదని అనుకున్నాడు. బొంబాయి చేరుకున్నారు. అక్కడకు చేరిన తరువాత



శివదాస్ మాటంటే అతనికి గిట్టటం లేదు. శివదాస్‌ను తన యింటికి రావద్దన్నాడు. ' రావద్దని చెప్పటానికి నీకు అధికారం లేదు. నేను నీ మిత్రుడను. నిన్ను బాగుచేయాలనే నా పట్టుదల వదలను. నేను ఏ చెడుమాట నీకు బోధించటం లేదు. చెడ్డ నీకు ప్రబోధించటం లేదు. భగవంతుని చేరమని చెబుతున్నాను. అది నా పరిపూర్ణ విశ్వాసము. నీవు వినవచ్చు. వినకపోవచ్చు. నీలో నా మాటలు బీజంగా నిలచిపోతాయి. ఇది నా డ్యూటీ' అని శివదాస్ ప్రతి సాయంకాలము వెళ్లేవాడు. ' నీవు వానికేమాత్రం బాధపడవద్దు. నీలో ఉండే పాపము పరిహారము చేసేందుకు బాబా యీరకంగా చెబుతున్నారు. బాబా కారణము లేని కార్యము ఆచరింపరు. కనుక, తిట్టినా, కొట్టినా, ఏమి చేసినా నీవు పోయి పాదములు పట్టుకో. ఈ సంసారమైనా వదులు కానీ ఆ పాదములు మాత్రం నీవు విడువకు' అని శివదాస్ గట్టిగా చెప్పాడు.

మూడు దినములైన తరువాత సపత్నేకర్ భార్యకు స్వప్నం వచ్చింది. ఆమె ఎప్పుడూ బాబాను చూడలేదు. తలకు బట్ట కట్టుకున్నాడు. చేతిలో కఱ్ఱ ఉంది. ' అమ్మా! నీవు చాలా బాధ పడుతున్నావు. నీవు మంచిదానివే కానీ నీ భర్త రాక్షసుడు. వానికి దైవముపైగానీ, భగవంతునిపైగానీ భక్తివిశ్వాసములు లేవు. కనుకనే, నీవు కుమారుని పోగొట్టుకున్నావు. తిరిగి నీ కుమారుడు నీకు కావాలనుకుంటే తప్పక షిరిడీ చేరుకో. నీ పోయన కుమారుడే నీకు లభిస్తాడు' అని బాబా చెప్పాడు. తెల్లవారి లేచింది. కలలో జరిగినదంతా భర్తకు తెలిపింది. షిరిడీ పోదామన్నది. అతను చెప్పాడు,' నాకు యింకొక అవమానము జరుగవలెనున్నదా'. భార్యను కాదనలేక తెల్లవారి శివదాస్ సహాయం కోసం అతని యింటికి వెళ్లాడు. శివదాస్, ' నన్ను మీ యింటికి రావద్దని చెప్పావు. నీవే మా యింటికి రావటం చాలా ఆనందంగా ఉంది. ఏమిటివచ్చావ'ని ఆప్యాయంగా పిల్చాడు. తన భార్య స్వప్నం గురించి చెప్పి షిరిడీ పోదామన్నాడు.

తిరిగి అందరూ షిరిడీ ప్రయాణమయ్యారు. షిరిడీ వచ్చేసరికి

సపత్నేకరుకు భయం, బాధ పట్టుకున్నాయి. భార్యను, శివదాస్‌ను మసీదులోకి పంపించాడు. నవ్వుతూ మాట్లాడాడు బాబా. ' నీ కుమారుడు చనిపోయిన విషయం నాకు తెలుసు. రాత్రి చెప్పాను కదా! తిరిగి ఆ కుమారునే యిస్తాను' అన్నాడు. ఆమె, ' బాబా! నా కలలో వచ్చింది నీవే. నీవు సర్వాంత్ర్యామివి' అని వర్ణిస్తూ వచ్చింది. ఆమె బాబా మాటలకు చాలా ఆనందించింది. ఇదే మంచి సమయమని భర్త వచ్చాడు నెమ్మదిగా. అతన్ని చూసి బాబా గట్టిగా 'సైతాన్! జావ్. వ్రాసినా వ్రాయకపోయినా పరీక్ష ప్యాసౌతావా, పురుష ప్రయత్నం ఉండాలి అని అన్నావు కదా! నీ కుమారుని నీవు ఎందుకు రక్షించుకోలేకపోయావు? ఇది పురుష ప్రయత్నంతో జరిగిందా? భగవంతుని సంకల్పముతో జరిగింది. అహంకారముతో నీవు ఫేలయ్యావు. పరిపూర్ణ విశ్వాసముతోనున్న శివదాస్ ప్యాసయ్యాడు. నా భక్తుని అవమానిస్తే సహించను. నన్ను అవమాన పరచినా ఫరవాలేదు. శివదాస్ నా భక్తుడు' అని కఱ్ఱ తీసుకొని విసిరాడు. సపత్నేకర్ తలకు తగిలింది. ఎప్పుడు కఱ్ఱ తలకు తగిలిందో అప్పుడే అతని మనస్సు మారింది. భగవంతుడు కారణం లేనిదే యేకార్యము చేయడు. వెనక్కి తిరిగాడు సపత్నేకర్. 'మీరు కొట్టండి, చంపండి యేమైనా నేను మీ పాదములు విడువను. మీరే నా గతి. నా జీవితములో ఈ సంఘటన నేను మరువలేను. మీరే నా దిక్కు' అని గట్టిగా పాదములు పట్టుకున్నాడు.

అప్పుడు నవ్వుతూ బాబా, 'ఈ భావము కలిగేందుకే నీకింత శిక్ష యిచ్చాను. చెరకు పట్టుకొని బెల్లం కావాలంటే వస్తుందా! మిషనులో వేసి బాగా పిప్పి చేశాక రసం వస్తుంది. ఈ రసాన్ని ఊరకే వదలకూడదు. నిప్పుపై బాగా ఉడికించాలి. అప్పుడది బెల్లం అవుతుంది. ఈ శరీరము ఒక చెరకుగడ. ఈ శిక్ష మిషనులో వేసి పిప్పి చేయటం. రెండవ శిక్ష ఉడికించటం. అప్పుడు బెల్లం తయారైంది. ఇన్ని పనులు చేస్తేగానీ మీ పాడు బుద్ధి, చెడుబుద్ధి మారదు. ఆ నమ్మకము వచ్చేందుకే యిన్ని పనులు చేశాను. లోపల చెడు విత్తనం ఉంటే ఎప్పుడైనా మొక్క తిరిగి వస్తుంది.



కనుక, ఆ విత్తనం నశించాలి. నీకు పోయిన కుమారునే మరల యిస్తాను. వచ్చే సంవత్సరం ఎత్తుకురా!' అన్నారు.

భార్య సంతోషించింది. కృతజ్ఞతతో సపత్నేకర్ చూశాడు. ఇంటికి వెళ్లారు. అప్పటినుండి తెల్లవారి మొదలు రాత్రి వరకు బాబా చింతనే. మూడునెలల లోపలే యీామె గర్భము ధరించింది. పోయిన కుమారునికి ఎక్కడెక్కడ మచ్చలవీ ఉండేవో ఆ మచ్చలతోనే పుట్టాడు కుమారుడు. ఆ కుమారుని షిరిడీ తీసుకు వెళ్లి బాబా పాదములపై పెట్టి, ' మీ ప్రసాదమే బాబా!' అన్నారు కృతజ్ఞతలతో ఆ దంపతులు.

# జన్మలు మారినా కర్మలు మారవు

అది ఎండాకాలము. షిరిడీ దగ్గరలోనే గోదావరినది కాలువగా ప్రవహిస్తున్నది. ఒడ్డున బాబా, శ్యాం నడుస్తూపోతున్నారు. కొంతదూరము పోయి చెట్టు నీడన కూర్చున్నారు. ఒక కప్ప గట్టిగా అరుస్తూ ఉంది. శ్యాం చెప్పాడు, 'చాలా దీనంగా అరుస్తున్నాది కప్ప' అని. 'నాకు తెలుసురా! ఒక నల్లత్రాచు పట్టింది దానిని. అది మింగలేకుండా ఉంది. ఇది తప్పించుకో లేకుండా ఉంది. కప్పకు తప్పించుకునే శక్తి లేదు. పాముకు మింగే శక్తి లేదు. రెండింటికి బాధయే. దీనివల్ల కప్ప గట్టిగా అరుస్తున్నది' అన్నాడు బాబా. 'దీనిని తప్పించండి స్వామీ' అన్నాడు శ్యాం. 'ఆ చూడు' అని లేచి దాని దగ్గరకు పోతుంటే 'స్వామీ! నల్లత్రాచు. చాలా ప్రమాదకరమైనది. దగ్గరకు పోవద్దండి. చేతిలో కఱ్ఱ ఉందికదా అని దానిని కొట్ట వద్దండి' అన్నాడు శ్యాం. 'శ్యాం! నాకు తెలుసురా!' దగ్గరకు పోయి, 'ఒరే! వీరభద్రప్పా! నీవు యిన్ని జన్మలు యెత్తినా నీ దుర్బుద్ధి పోలేదురా. ఒరే చెన్నబసప్పా! జన్మలు మారినా ఈర్ష్యపోలేదురా. సిగ్గులేదా! పొండి' అన్నాడు బాబా. ఆమాటలకు పాము కప్పను విడిచి పాము దారిన పాము, కప్ప దారిన కప్ప పోయినాయి. 'వీరభద్రప్ప, చెన్నబసప్ప తక్షణమే వెళ్లిపోయారే' అన్నాడు శ్యాం. 'దీనికి పెద్ద చరిత్ర ఉందిరా శ్యాం' అన్నాడు బాబా.

పూర్వము మథురానగరములో శివదేవాలయము ఉండేది. ఆ శివ



దేవాలయము శిధిలావస్థలో ఉండేది. గ్రామస్తులందరూ చేరి ధనము ప్రోగుచేసి ఆ గ్రామములోని శ్రీమంతునికిచ్చి, 'స్వామీ! ఈ డబ్బు మీదగ్గరే పెట్టుకొని, మీరే ఈ మందిరము చక్కగా నిర్మించండి' అని చెప్పారు. డబ్బు రావటం శ్రీమంతునికి ఆనందమైంది. ఆ శ్రీమంతుడు ధనమునకు మాత్రమే యెక్కువ విలువ యిచ్చేవాడు. ఆ శ్రీమంతుని హృదయములో దయ, దాక్షిణ్యము, జాలి యేమాత్రమూ లేవు. మహాపిసినారి. ఒక్కపైసాకూడా త్యాగము చేసేవాడు కాదు. ఇంటికి భిక్షగాడు వస్తే కుక్కను వదిలేవాడు. ఇంత కఠినమైన వాడు. కానీ శ్రీమంతుడు, పెద్దవాడు. ఇంత డబ్బు తమ దగ్గర పెట్టుకోటం కష్టమని, అతనే అధికారియని అతనికిచ్చారు గ్రామస్తులు. క్రమక్రమేణా నెలలు గడుస్తూ వచ్చాయి. ఈ శ్రీమంతుడు మందిరము విషయము యేమాత్రమూ పట్టించుకోలేదు. దినము గ్రామస్తులు, ' ప్రభూ! ఇంకా ప్రారంభించలేదే ' అని అడుగుతూ వచ్చారు. అతని స్వంత ఎద్దులబండి ఉంటే వాటితో కొంత యిసుక, ముక్కలైపోయిన యిటుక తోలించాడు. పని ప్రారంభించాడని గ్రామస్తులు ఆనందించారు. కానీ అంతటితో ఆగిపోయింది. తరువాత యేమీ జరగలేదు. మరల గ్రామస్తులు వచ్చి, 'ప్రభూ! ఇంకా మొదలుపెట్టలేదే' మని అడిగారు. 'ఎక్కడిదిరా డబ్బు అంతా అయిపోయింది. యిసుక, యిటుకలకు అయిపోయింది. మందిరం ఎట్లా కట్టేది?' అన్నాడు శ్రీమంతుడు. ఈపెద్దమనిషి, శ్రీమంతుడు యీవిధంగా మాట్లాడుతుంటే ప్రజలు యేమి చెబుతారు. పాపం శక్తిహీనులు. వారిలోవారే గుసగుసలాడుతూ వచ్చారు. 'ఏమిరా! ఈపెద్దమనిషి చిన్న మాటలు మాట్లాడుతున్నాడు'. అతని గౌరవము ఆనాటినుండి తగ్గుతూ వచ్చింది.

ఒకనాడు ఈశ్వరుడు శ్రీమంతుని భార్యకు స్వప్నములో కనిపించాడు. 'అమ్మా! నీ భర్త ప్రజల డబ్బు తీసుకొని అబద్ధమాడుతున్నాడు. నాకు మందిరము అక్కరలేదు. కానీ ప్రజలు నామందిరము గురించి చాలా బాధపడుతున్నారు. భక్తులు శక్తిసామర్థ్యములకు తగినట్లుగా ధనము ప్రోగుచేసుకున్నారు. ప్రజలకు యింత ద్రోహము చేయకూడదు. అతను

యేదో చేశాడు. నీకు పుట్టింటివారిచ్చిన నగలుంటున్నాయి. వాటిని అమ్మి నీవీ మందిరాన్ని నిర్మించు' అన్నాడు. స్వప్నములో వచ్చినది తెల్లవారుతూనే భర్తకు చెప్పింది. స్వప్నముకాదు ప్రత్యక్షముగా వచ్చి చెప్పినా వినే స్వభావము కాదు భర్తది. 'కలకు యెందుకు విలువ యిస్తావు నీవు? ఈశ్వరుని నన్ను అడగమను నేను కట్టిస్తాను' అని మూర్ఖవాదము చేసే పిడివాదులు జగత్తులో అభివృద్ధి అయిపోతున్నారు. భగవంతుడు ఎదురుగా వచ్చి నాకు గుడి కట్టమని ఈ దరిద్రునకు చెబుతాడా! అందరకూ యిచ్చేవాడు భగవంతుడే! ఆ భగవంతుడు వచ్చి చేయి చాచాలట. భార్యకూడా యేమీ చెప్పలేకపోయింది. మరి రెండవ దినము కల వచ్చింది. 'భర్త కల కల్ల అంటున్నాడు. కల కల్ల కాదు. నాకు మందిరము కట్టి ప్రజలను సంతోషపెట్టు. నీకు సర్వసౌకర్యములు అందిస్తాను. నేను స్వయంగా చెబుతున్నాను' అన్నాడు. తెల్లవారి లేచి భర్తతో చెప్పింది. 'తిరిగి రాత్రి కూడా వచ్చాడు. సర్వసౌఖ్యాలు అందిస్తానన్నాడు'. 'మొట్టమొదట సర్వసౌఖ్యాలు అందించమను. తరువాత కట్టిస్తాను' అన్నాడు. ఆమె చాలా పట్టు పట్టింది. 'నా పుట్టింటి వారిచ్చిన నగలున్నాయి. వాటిని అమ్మి మందిరము కట్టిస్తాను. నీ ధనము నాకు అక్కరలే'దంది. 'సరే అయితే ఆ నగలు నేనే తీసుకొని డబ్బు నేనే యిస్తాను' అన్నాడు భర్త. ఆమె పాతకాలం మనిషి. బయటకు వెళ్లి అమ్మలేదు. బంగారము యెంత బరువు, యెంత విలువ యేమీ ఆమెకు తెలియదు. మేలుబంగారము కాదని అన్ని నగలు తానే తీసుకొని, 'వేయిరూపాయలు అవుతాయి' అని అన్నాడు. 'అవైనా యివ్వండి కట్టించుకుంటాను' అంది. ఆ శ్రీమంతుడు వడ్డీవ్యాపారము చేస్తూ ఉండేవాడు. ఒక బీదముసలామెకు నాలుగు వందల రూపాయలిచ్చాడు. చెప్పిన టైముకి యివ్వలేకపోవటం వలన ఆమెకున్న రెండెకరాల భూమి యిచ్చింది. ఈ భూమిని తాకట్టుపెట్టుకున్నాడు శ్రీమంతుడు. ఆ ముసలామె ఒకే ఏడుపు. జీవితమంతా ఆ భూమిపై ఆధారపడి ఉంటున్నానని యిప్పుడు తీసుకున్నాడేయని బాధపడింది. ఏమీ చేయలేదు. శ్రీమంతునిపై పట్టలేని



కోపము ఉంటున్నాది. కోపము వలన యేమి ప్రయోజనం? పేదవాని కోపము పెదవులకు చేటు. ఆమె యేమీ చేయలేకపోయింది. కానీ, అపకారమునకు అపకారమే కలుగుతుంది. ఏనాటికైనా తప్పదు.

ఒక రాత్రి పెద్ద గాలి వర్షము వచ్చింది. ఇల్లుకూలి శ్రీమంతుడు, అతని భార్య మరణించారు. అదే సమయమునకు ఆ బీదముసలామె ఇల్లుకూడా కూలి ఆమెకూడా మరణించింది. శ్రీమంతుడు వ్రేపల్లెలో తిరిగి వీరభద్రప్పగా పుట్టాడు. శ్రీమంతుని భార్య పూజారి కుమార్తెగా పుట్టింది. మందిరము యజమాని గర్భములో ఈ బీదముసలామె చెన్నబసప్పగా పుట్టింది. వారికి పూర్వజన్మలు తలియవు. శ్యామాకు బాబా చెబుతున్నాడు.

అమ్మాయి పెరుతూ వచ్చింది. పూజారి అమ్మాయికి పెండ్లిచేయాలని ప్రయత్నించాడు. ఒకనాటి రాత్రి పూజారికి కలలో ఈశ్వరుడు కనిపించి, 'నీ బిడ్డను వీరభద్రప్పకిచ్చి పెండ్లి చేయ'మన్నాడు. ఆయనకింకా తప్పలేదు. వీరభద్రప్పకిచ్చి పెండ్లి చేశాడు. వీరభద్రప్ప వ్యాపారము చేస్తూ ఉండేవాడు. భార్యకు గుడి కట్టాలనే సత్సంకల్పము పోలేదు. దేహాలు శిధిలమైనా సంకల్పములు చిరంజీవులు. ఆమె మందిరము కట్టాలి సహాయము చేయండని భర్తనడిగింది. ఈమె మందిరము కట్టాలనుకున్నప్పుడు యజమాని చెన్నబసప్ప భూమి యిస్తానన్నాడు. మందిరము కట్టటానికి అందరి సహాయమూ కావాలి. కట్టటానికి ప్రయత్నించారు. భూమి ముందు రిజిష్టరు చేయమన్నాడు వీరభద్రప్ప. చెన్నబసప్ప,'డబ్బు యియ్యి భూమి యిస్తాను' అన్నాడు. భూమి తీసుకోవాలని వీరభద్రప్ప, డబ్బు తీసుకోవాలని చెన్నబసప్ప. ఈరకంగా ఎవరెవరి స్వార్థానికి వారు ప్రాకులాడుతూ వచ్చారు. దీనివలన యిద్దరికీ కలహము వచ్చింది. పాతవాసనలు లోపలనుంచి వస్తున్నాయి. వారికి తెలియదు. క్రమక్రమేణా వారిద్దరూ మరణించారు. ఇప్పుడు వారిద్దరూ పోట్లాడుతున్నారు. జన్మలు మారినా కర్మలు మారటం లేదు. స్వార్థము, స్వప్రయోజనము ఉండినవారు ఎటువంటి ఉన్నత స్థాయిలో ఉన్నా అల్ప

బుద్ధి పోదు. అల్పబుద్ధులు పోవాలంటే మంచివారి సంగము చేరాలి. ఒకప్పుడు మంచివారి సంగము చేరినా పాతబుద్ధులు, రోతబుద్ధులు వెంటనే పోవు. నీరు త్రాగిన టంబ్లరు అప్పటికప్పుడు కడిగితే శుభ్రమైపోతుంది. వారముపాటు అట్లాగే ఉంచి కడిగితే శుభ్రము కాదు. పాతవాసన. ఎంతో మాలిన్యము పట్టి ఉంది. వాడు ఉత్తమ జన్మలో పుట్టినా ఎన్ని జన్మల వాసనలో అల్పబుద్ధే ఉంటుంది. ఉత్తమబుద్ధి రాదు. ఉత్తమజన్మ, ఉత్తమబుద్ధులు చాలా అదృష్టవంతులకే ప్రాప్తిస్తుంది. శ్యామా! నీవు ఉత్తమభావాలు పెంచుకోరా!' అన్నాడు బాబా.



# దేహములు వేరు దివ్యత్వమొక్కటే

పూర్వం నాగపూర్‌లో మాతాజీ కృష్ణప్రియ అనే వ్యక్తి ఉండేది. ఆమె కృష్ణ భక్తురాలు. కానీ అప్పుడప్పుడు షిరిడీ వచ్చి బాబాను దర్శించేది. కృష్ణుడు బాబా వేరు కాదు ఒక్కరే అనే భావంతో ఆమె మనస్ఫూర్తిగా ప్రార్థించేది. ఒకనాడు ఆమె సిమ్లా వెళ్ళింది. సిమ్లాకు వెళ్ళిన తరువాత 1918వ సంవత్సరము అక్టోబరు 15వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు బాబా దేహము వదిలాడని ఆమెకు తెలిసింది. చాలా బాధపడింది. అది విజయదశమిరోజు. శరీరము వదిలే పూర్వమే ఏకాదశి ప్రారంభమైంది.

ఈవిషయాన్ని పూర్వం 1916వ సంవత్సరంలోనే బాబా కాకాదీక్షిత్‌కి చెప్పాడు, 'కాకా1918 సంవత్సరం విజయదశమిరోజున తాత్యా చచ్చిపోతున్నాడురా!' అన్నాడు. అప్పుడు షరిడీలో తాత్యా అనేవాడు ఉండేవాడు. బాబా మాటలను విని కాకాదీక్షిత్ యింక రెండు సంవత్సరములలో తాత్యాసాహెబ్ చనిపోతాడేమోనని బాధపడుతూ వచ్చాడు.

అబ్దుల్‌బాబాకూడా బాబాకు సమీపంగా ఉండేవాడు. 'ఇంక ఈదేహాన్ని చాలిస్తాను' అని చెప్పాడు బాబా. అప్పుడు మహల్సాపతి కూడా చాలా బాధపడ్డాడు. 'మీరు బాధపడనక్కరలేదు. నేను మీతోనే ఉంటాను. తిరిగి నేను ఎనిమిది సంవత్సరముల తర్వాత వస్తాను' అని చెప్పాడు. 'మద్రాసు రాష్ట్రములో వస్తాను, తిరిగి పత్రిలోనే పుడతాను' అన్నాడు. అప్పుడు ఈ ఆంధ్రరాష్ట్రము మద్రాసు రాష్ట్రములోనే ఉండేది. అప్పుడు ఈ గ్రామము పేరు పుట్టపత్రి అని ఉండేది. చిత్రావతి సమీపముగా ఉంటున్నది.

అవతారములు ఎక్కడున్నా నది దక్షిణమునుండి ఉత్తరమునకు ప్రవహిస్తుంది. అక్కడ క్షేత్రముగా ఏర్పడుతుంది. చిత్రావతి దక్షిణమునుండి ఉత్తరానికి ప్రవహిస్తున్నది. 'అక్కడ నేను సత్యమనే పేరుతో అవతరిస్తాను' అన్నాడు. అదే ఇప్పుడు రావటం. దేహములు రెండు కానీ దివ్యత్వము ఒక్కటే. అయితే ఒకటి దివ్యత్వము తెలుపుటకోసము, ఇక్కడ దివ్యత్వాన్ని అందించేకోసము రాబోయేది దివ్యత్వాన్ని బోధించేకోసము. అవే షిరిడీసాయి, సత్యసాయి, ప్రేమసాయి.

1918వ సంవత్సరము అక్టోబరు 15వ తేదీ బాబాకు హైటెంపరేచరు వచ్చింది. అయితే అంతకు రెండురోజులు ముందు బాబా మూడు యిళ్లకుపోయి బిక్ష తెచ్చుకొని భుజించాడు. ఆరోజు పన్నెండు గంటలకు బాబా, 'నాకు యికిక్కడ యిష్టములేదు. నన్ను బూటీవాడాకు తీసుకొనిపొండి' అన్నాడు. అక్కడ బూటీ అనే వ్యక్తి మురళీధర మందిరాన్ని కట్టించాడు. దానిలో కృష్ణ విగ్రహాన్ని ప్రతిష్ఠించటానికి బూటీ అనేక పర్యాయములు బాబా అనుమతికై ప్రార్థించాడు. కానీ ప్రతి పర్యాయము విగ్రహ ప్రతిష్ఠను బాబా వాయిదా వేస్తూ వచ్చాడు. కడపటి దినము వరకుకూడా విగ్రహప్రతిష్ఠ గురించి బాబా యేమీ చెప్పలేదు. ఆరోజు మధ్యాహ్నం బూటీని, కాకాను భోజనం చేసిరమ్మని వారివారి యిండ్లకు పంపివేశాడు బాబా. తాను పండుకొన్న దిండు క్రిందున్న తొమ్మిది రూపాయల నాణాలను తీసుకొని లక్ష్మీబాయి చేతిలో పెట్టాడు. తరువాత అక్కడే ఉన్న ఒక ఆంతరంగిక భక్తుని ఒడిలో తలపెట్టి ప్రాణం వదిలాడు.

ఈవిషయం సిమ్లాలోని కృష్ణప్రియకు తెలిసి బాధపడింది. రెండవదినము మంచుకురుస్తూ ఉండటం చేత ఆమె తన యింటి తలుపులను మూసుకొని లోపల ఉంది. ఇంతలో ఆజానుబాహుడైన సన్యాసి తలకు బట్ట కట్టుకొని ఆమె ప్రక్క యింటికి వచ్చి తలుపు కొట్టాడు. ప్రక్క యింటి స్త్రీ తలుపు తెరచి, 'మీరెవరండి?' అని ప్రశ్నించింది. అప్పుడా సన్యాసి,



'మాతాజీ కృష్ణప్రియ ఎక్కడ?' అని అడిగాడు. ఆమె ఎక్కడున్నదీ తనకు తెలియక కాదు. తెలుసు. కానీ తాను శారీరకంగా దర్శనమిచ్చాడనే విషయం మిగిలిన వారికి కూడా తెలియటం కోసమే బాబా ఆవిధంగా చేశాడు. ఆ ప్రక్కింటామె కృష్ణప్రియ యిల్లు చూపించగా బాబా వెళ్లి ఆ యింటి తలుపు తట్టాడు. కృష్ణప్రియ తలుపు తెరిచింది. తన కళ్లను తానే నమ్మలేకపోయింది. 'ఏమిటి! బాబా నిన్ననే పోయారని తెలిసింది కదా! మరి ఈ చలిలో ఎలా వచ్చారు షిరిడీనుండి? ఇక్కడకు రావాలంటే కనీసం మూడురోజులైనా పడుతుంది కదా!' అని ఆమె ఈవిధంగా ఆలోచిస్తుంటే, 'బేటీ! నేను ఎక్కడ చూచినా ఉన్నాను. ఇంతకాలం నన్ను కృష్ణభావంతో పూజించిన నీవు నా గురించి తెలుసుకున్నది ఇదేనా? నాకు చలిగా ఉంది. ముందు ఒక కప్పు చాయ్ యివ్వు!' అన్నాడు బాబా. తక్షణమే కృష్ణప్రియ ఒక కప్పుతో చాయ్ తెచ్చి యిచ్చింది. బాబా దానిని త్రాగాడు. 'అక్కడ నుండి యిక్కడకు నడచి వచ్చేసరికి పొట్టలో ఉన్నదంతా అరిగిపోయింది. నాకు ఆకలౌతున్నాది' అన్నాడు బాబా. వెంటనే కృష్ణప్రియ లోనికి వెళ్లి చపాతీలు, వంకాయకూర ప్లేటులో వేసి తెచ్చింది. బాబాకు వంకాయకూర అంటే చాలా యిష్టము. ఆనాడు ఆమె ఎందుకో వంకాయ కూరనే వండింది. చపాతీలను తిని చేయి కడుక్కున్నాడు. టవలుతో తుడుచుకున్నాడు. 'నేను వచ్చిన పని అయిపోయింది. బయటకు వెళ్లిపోతున్నాను' అన్నాడు.

ఆ కాలంలో బాబాకు ఎదురు చెప్పే ధైర్యము ఎవరికీ లేదు. ఎవరైనా వారికి, 'ఇది కాదు' అని ఎదురు చెబితే యింక కొట్టటమే. ఎంతమాత్రం సహించేవాడు కాదు బాబా. అందుచేత ఆమె ఏమీ చెప్పలేకపోయింది. అక్కడనుండి బాబా బయలుదేరుతూ,'ఇదిగో ఈమాల తీసుకో' అని ఒక మల్లెపూలమాల చేతికి యిచ్చాడు. బాబా రోడ్డుపై నడచుకుంటూ వెళ్లటం ఆమె చాలాదూరం వరకు చూచింది. సిమ్లాలో రోడ్లు అక్కడక్కడ పల్లంగా ఉంటాయి. ఒకచోట కొంతమంది కూలివారు పని చేస్తున్నారు. బాబా వెళ్లి అక్కడున్న లోయలో పడిపోయాడు. ఎవరో

ఒక సన్నాసి వచ్చి లోయలో పడిపోయారని ఆ కూలివాళ్లందరూ అరిచారు. మరి అక్కడ దేహం లేదు. అంతర్ధానమైనాడు బాబా. ఈవిధంగా తాను శరీరమును వదలినప్పటికీ సర్వత్రా తానే ఉంటున్నాని బాబా కృష్ణప్రియ చెవిలో చెప్పి వెళ్లిపోయాడు.

బాబా దేహాన్ని వదలిన తర్వాత అనేక సమస్యలు తలెత్తాయి. 'అల్లామాలిక్! అల్లామాలిక్!' అనేవాడు కనుక బాబా మహమ్మదీయుడని, అతని దేహం తమకు చెందాలని మహమ్మదీయులు, 'రామమాలిక్! కృష్ణమాలిక్!' అనికూడా అనేవాడు కనుక బాబా దేహం తమకే చెందాలని హిందువులు పట్టుపట్టారు. ఆవిధంగా శరీరమునకు ఎట్టి అంత్యక్రియలు జరపాలో తీర్మానింపబడక సుమారు 36 గంటలు ఉంచారు. హిందూముస్లిలములకు ఎట్టి కలహములు సంభవించకూడదని కలెక్టరు, పోలీసులు, తదితర ఉన్నతాధికారులు షిరిడీ చేరుకొని బాబా దేహానికి చివరి కర్మలు ఏవిధంగా చేయాలనే విషయంలో మీటింగు ఏర్పాటు చేశారు. మహమ్మదీయులు కాల్చరు. హిందువులు కాలుస్తారు. ఈరెండూ లేకుండా ఉండేకోసమని సమాధి చేయటానికి తీసుకు వెళ్లారు. ఎన్ని అడ్డంకులు వచ్చినప్పటికీ బూటీ మందిరములోనే బాబా సమాధిని ఏర్పరచారు. అక్కడ సమాధి చేయటానికి గోయి తీసే సమయంలో ఒక శిలబొమ్మ వచ్చింది. అది చూస్తే కబీరు సమాధి. అక్కడున్న మహమ్మదీయులకు కబీరు గురువు. వీరు ప్రజంటు గురువు. వార్పు పాష్ట్ గురువు. ఈమూడూ గురుత్వముతో చేరినాయి. కనుక, గురుత్వమునకు గురువారము ఒక గుర్తుగా తీసుకున్నారు. బాబాకు గురువారము ప్రశస్తము. ఆ మురళీధర మందిరమే సమాధి, మందిరము.

ఇంక సిమ్లాలో మాతాజీ కృష్ణప్రియకు యిచ్చిన పూలమాలను ఆమె కృష్ణవిగ్రహం మెడలో వేసింది. ఆ దృశ్యము చూచిన చాలామంది, 'ఈమె సాయిబాబా భక్తురాలు కదా! ఆమె ఆ దండను కృష్ణుని మెడలో ఎందుకు వేసింది? సాయిబాబా మెడలో ఎందుకు వేయలేదు?' అని అనుకున్నారు.



కానీ ఆనాడు భజన జరుగుతుంటే కృష్ణుని మెడలో వేసిన మాల సాయిబాబా మెడలో పడిపోయింది. అనగా వారిరువురు ఒక్కటేయని గుర్తించి సిమ్లాలో అందరూ ఆనందించారు. తెల్లవారి లేచి చూచేటప్పటికి బాబా కృష్ణప్రియకు యిచ్చిన మాల అక్కడ లేదు. అది బూటీమందిరములో సమాధిపై ఉంది.

1918వ సంవత్సరములో అక్టోబరు నెలలో ప్రధాన్ భార్య తన గ్రామంలో నివసిస్తున్నాది. ఆమెకు కలలో బాబా మరణించినట్లుగా కనిపించింది. ప్రధాన్ షిరిడీలో ఉంటున్నాడు. లేచి తన బిడ్డలతో బాబా మరణించినట్లుగా తనకు కల వచ్చిందని యేడుస్తూ కూర్చొంది. తక్షణమే తన యింటిలో ఒక అశీరవాణి వినవచ్చింది. 'బాబా మరణించటమనే శబ్దము ఉపయోగించవద్దు. బాబా సమాధిలో ఉంటున్నాడనే శబ్దము ఉపయోగించు. సమాధిలో ఉంటున్నాడనగా సమచిత్తముతో కూడినవాడని అర్థము. జనన, మరణములు రెండూ సమానమే. సుఖదుఃఖములు రెండూ సమానమే. బాబాకు మరణమనేదే లేదు' అని వినిపించింది. ఎక్కడదీ శబ్దము? ఎక్కడనుండి వచ్చిందీ శబ్దము అని వెతుకుతుండగనే భర్త ఒక కబురు పంపించాడు, బాబా దేహము వదిలారని.

ఈవిధమైన మహిమలను బాబా ఎందుకు చూపాలి? ఆనాడు హిందూ మహమ్మదీయుల మధ్య చాలా ద్వేషభావాలు ఉండేవి. 'మత కలహాలు ఉండరాదు. సమస్తజీవులకు ఒకే దేవుడు. అతనికి కులమత బేధములు లేవు. సర్వులకు సమన్వయేమైన మతమే బాబా మతము. అదే సర్వులకు హితము. అదే మానవమతము' అనే సత్యము చాటటం కోసమే బాబా యిన్ని మహిమలను చూపవలసివచ్చింది.

# మంగళాశాసనము

ప్రేమస్వరూపులారా!

మానవుడు తినే ఆహారాన్ని బట్టి, సంచరించే పరిసరములను బట్టి అనేక సందేహాలు పుడుతూ ఉంటాయి. కానీ యిలాంటి సందేహాలకు లొంగి మనం దురదృష్టవంతులుగా కాకూడదు. స్వార్థముతో జీవించేవారికే యిట్టి మార్పులుగానీ సంపూర్ణ ప్రేమతో ఉండేవారికి ఎట్టి మార్పూరాదు. అదే అచంచలభక్తి. అప్పుడే నిజమైన హృదయం కరుగుతుంది. భగవంతుడు కదులుతాడు. దైవం ఎక్కడో లేదు. మనయందే ఉన్నాడు. 'నేను వేరు దైవం వేరు' అనే భిన్నత్వంతో జీవించరాదు. ఈరెండింటిని కలిపేది ఒకటి ఉంటున్నాది. అదే ప్రేమ. రెండు కాగితములను కలపాలంటే గమ్ వేయాలి. అప్పుడే ఆ రెండూ చేరిపోతాయి. అట్లే జీవాత్మను పరమాత్మకు చేర్చేదే ప్రేమ అనే గమ్. ఈ ప్రేమ ఉన్నప్పుడే జీవాత్మ, పరమాత్మ ఏకమైపోతాయి. సందేహాల వలన మార్పులు యేమైనా కలిగితే దానిని సరైన రీతిలో సాధించాలి. దానిని నెట్టుకొని, తట్టుకొని ముందుకు సాగిపోవాలి. తుచ్ఛమైన సందేహాలకు అవకాశ మివ్వరాదు. అవన్నీ మీలోని సంకల్పాలే గానీ దైవం లోనివి కావు. దైవము వజ్రము వంటివాడు. అది ఒకరితో పెరిగేది కాదు. మరొకరితో తరిగేది కాదు. 'బాబా అది చేయి, యిది చేయి, మా మనస్సు మార్చు' అని అడుగుతుంటారు. కానీ అది బాబా పనా! మీ కర్తవ్యమది. అన్నీ బాబా చేస్తుంటే యింక మీరు చేసే పని ఏమిటి? ఇది కేవలం పరిపూర్ణంగా సోమరితనమే. మీ ప్రయత్నంతో మీరు సాధించాలి. పురుష



ప్రయత్నం చేసినప్పుడే భగవంతుని సహాయం లభిస్తుంది. 'భగవంతుడా! అది చేయి, ఇది చేయి, నా మనస్సు మార్చు' అనటం బలహీనతయొక్క లక్షణం. పరిపూర్ణ విశ్వాసముంటే మీ మనస్సు ఎందుకు మారదు? ఇది లేదు కాబట్టే నన్ను మార్చమని కోరుతున్నారు. 'నాది మనస్సు మార్చే పని కాదు. మీ కర్మ తీర్చే పని నాది'. ప్రతి వ్యక్తి ఈ సత్యమును గుర్తించాలి. మొట్టమొదట మీలోని దోషములను నిర్మూలించుకోండి. మీ భక్తి ప్రపత్తులు స్థిరమైనవిగా చేసుకోండి. ఎట్టి పరిస్థితులందు మార్పులేకుండా చూసుకోండి. అది మీ పురుష ప్రయత్నము. అప్పుడే భగవదనుగ్రహం కూడా లభిస్తుంది. ఈ సత్యమార్గంలో ప్రవేశించి, ప్రేమ మార్గములో నడచి అనంతమైన దివ్యత్వంలో లీనం కండి.

# ఫలశ్రుతి

సాయీశు కథలను సొంతంబు విన్నను
 కష్టంబు లెల్లను కరగిపోవు
సాయీశు మహిమల సారెకు తలచిన
 మనసున భ్రమలెల్ల మాసిపోవు
సాయీశు భక్తిని సాధన చేసిన
 పురషార్థములనెల్ల పొంద గలరు
సాయీశు బోధల చాలగ పాటింప
 ఎనలేని సుఖముల నెరుగవచ్చు
చదువుడెప్పుడు వదలక చవులు కలుగు
కోర్కెలీడేరి దుఃఖంబు దూరమగును
సాధుసజ్జన సాంగత్యసారమెల్ల
ఒక్క పారాయణంబున చిక్కునయ్య.

# మంగళగీతం

మంగళం సత్యసాయి సర్వదేవతా స్వరూప
 సాధుజన పోషకాయ నిత్యమంగళం
ఈశ్వరాంబ తనూజాయ లీలా విగ్రహాయ
 విశ్వరూపాత్మకాయ సాయి మంగళం
సునందనంద వందితాయ సామవేద సంస్తుతాయ
 నారదాది సన్నుతాయ సాయి మంగళం
ఆనంద రూపాయ ఆశ్రిత వరదాయ
 ఆంజనేయ వందితాయ సాయి మంగళం
వేదాంత వేద్యాయ వేద స్వరూపాయ
 దేవదేవోత్తమాయ సాయి మంగళం
పుట్టపర్తి వాసాయ ప్రేమావతారాయ
 పుణ్యపురుష పూజితాయ సాయి మంగళం
నిత్య శభ మంగళం నిత్య జయమంగళం
 శ్రీసత్యసాయీ మంగళం